www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 8-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 100
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా.12.39 తదుపరి చతుర్దశి; నక్షత్రం: జ్యేష్ఠ తె. 3.15 తదుపరి మూల; వర్జ్యం: ఉ.7.16-9.00; దుర్ముహూర్తం: ఉ.8.26-9.18, రా.10.25-11.08; అమృతఘడియలు: సా.5.41-7.26; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.50 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అదృష్టమో.. దురదృష్టమో.. ఆగమైన శాఖలిచ్చారు

- ఒక్కటే కాదు.. నాకిచ్చిన ఐదూ అంతే
- మత్స్య శాఖలో.. అంతా కిందా మీద!
- పశుసంవర్ధక శాఖలో బర్లు.. గొర్లు
- వాటిని ఎంత క్లిష్టపరిస్థితుల్లో ఇచ్చారో అంత అద్భుతంగా తీర్చిదిద్దుతా
- మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యలు



కరీంనగర్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశు సంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్య, క్రీడలు, యువజన శాఖల మంత్రి వాకిటి శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. "నాకిచ్చిన శాఖలన్నీ ఎట్లున్నయంటే దురదృష్టమో, అదృష్టమో.. గడబిడ అయిన తర్వాత నాకిచ్చారు. మత్స్యశాఖ.. పదేళ్లలో అంతా కిందమీద చేసి నా చేతిలో పెట్టారు. పశుసంవర్ధకశాఖ.. దాంట్లో గొర్లు,

మిగతా 13వ పేజీలో...

బీసీ రిజర్వేషన్లకు జీవో!



- స్థానిక ఎన్నికల్లో 42 శాతం కల్పించేలా సవరణ
- న్యాయ నిపుణుల సలహా తీసుకున్న ప్రభుత్వం
- 10న మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం
- ఆపై సవరణ జీవో జారీకి అవసరమైన ప్రక్రియ
- రిజర్వేషన్ల ఖరారుకు మిగిలింది ఇక వారం రోజులే

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు జీవో జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. గతంలో బీసీల రిజర్వేషన్లకు సంబంధించి అమల్లో ఉన్న ఉత్తర్వులను సవరించి.. వాటిని 42 శాతానికి పెంచుతూ కొత్తగా ఉత్తర్వులు ఇవ్వాలని యోచిస్తోంది. ఈ విషయంలో న్యాయనిపుణుల అభిప్రాయాలను కూడా ప్రభుత్వం తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు తీర్పు మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటని విధంగా అమల్లో ఉన్నాయి. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం కేటాయించిన రిజర్వేషన్లు పోను.. మిగిలిన శాతాన్ని బీసీలకు కేటాయించేలా గత ఉత్తర్వులు ఉన్నాయి. అయితే.. తాము బీసీల సామాజిక, ఆర్థిక సమాచారాన్నంతా సేకరించామని, కుల సర్వే నిర్వహించామని, తమ వద్ద ఉన్న సమాచారం (ఎంపిరికల్ డేటా) ఆధారంగా రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతున్నామని పేర్కొంటూ కొత్త ఉత్తర్వులు జారీ చేసుకోవచ్చునని న్యాయనిపుణులు సూచించినట్లు తెలిపింది. దీంతో ప్రభుత్వం ఈ దిశగానే ముందుకెళ్లే యోచనలో ఉన్నట్లు సమాచారం. కుల సర్వే, డెడికేషన్ కమిషన్ ఏర్పాటు, దాని నివేదికలోని అంశాలను ప్రస్తావిస్తూ ఈ ఉత్తర్వులు జారీ చేయాలని సర్కారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఈ నెల 10న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. క్యాబినెట్ భేటీలో దీనికి ఆమోదం లభిస్తే.. సవరణ ఉత్తర్వులకు అవసరమైన ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభిస్తుంది. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ ఎవరైనా న్యాయస్థానానికి వెళితే.. అక్కడ నిలబడుతుందా, లేదా అన్న చర్చ కూడా ప్రభుత్వంలో ఉంది. ఒకవేళ అలాంటి

మిగతా 12వ పేజీలో...



ఢిల్లీలో దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో సీఎం

క్రీడా వర్సిటీకి సహకరించండి

ఖేలో ఇండియా గేమ్స్‌ను తెలంగాణలో నిర్వహించండి.. క్రీడా వసతులకు 100 కోట్లు ఇవ్వండి

- ఒలింపిక్స్-2036లో 2 ఈవెంట్లు రాష్ట్రంలో జరపండి
- క్రీడాకారులకు రైల్ చార్జీల్లో రాయితీ పునరుద్ధరించండి
- కేంద్ర మంత్రి మాండవీయకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- సీఎం రేవంత్‌తో కపిల్ దేవ్, అజయ్ దేవ్‌గణ్ భేటీ
- తెలంగాణలో క్రీడారంగం అభివృద్ధిపై కపిల్ ప్రశంస
- రాష్ట్రంలో ఫిల్మ్ స్టూడియో నిర్మిస్తానన్న అజయ్ దేవ్‌గణ్
- ఈ నెల 10న సమావేశం కానున్న రాష్ట్ర క్యాబినెట్
- బనకచర్ల, 'స్థానికం', యువ వికాసంపై చర్చించే చాన్స్

న్యూఢిల్లీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి.. కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది జరగనున్న ఖేలో ఇండియా గేమ్స్‌ను తెలంగాణలో నిర్వహించాలని, దాంతోపాటు జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశం తెలంగాణకు కల్పించాలని కోరారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన అధికారిక నివాసంలో రేవంత్ కలిశారు. ఖేలో ఇండియా కింద క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, క్రీడాకారుల శిక్షణ, క్రీడా నిపుణుల ఎంపిక, ఇతర

మిగతా 13వ పేజీలో...

మహిళలకు 60 ఎమ్మెల్యే టికెట్లు

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇస్తాం
- వారిని గెలిపించే బాధ్యత నేను తీసుకుంటా
- మహిళా సంఘాలకు 21 వేల కోట్ల రుణాలిచ్చాం
- ఈ ఏడాది 18 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం
- పిల్లల పేర్లతో తల్లులు మొక్కలు నాటాలి: రేవంత్
- అగ్రి వర్సిటీలో వనమహోత్సవం ప్రారంభం

13



శ్రీ వెంకట్, తేజస్విని, వారి పిల్లలు (ఫైల్)

అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

తెలుగు కుటుంబం సజీవ దహనం

- మూడేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి డాలస్‌కు వెళ్లి స్థిరపడిన శ్రీవెంకట్, తేజస్విని కుటుంబం
- భార్య, పిల్లలతో కలిసి.. అట్లాంటాలో ఉంటున్న తన అక్క ఇంటికి వెళ్లిన శ్రీవెంకట్
- తిరిగి వస్తుండగా రాంగ్ రూట్‌లో వారి కారును బలంగా ఢీకొట్టిన మినీ ట్రక్కు
- మంటలు చెలరేగి నలుగురూ కాలి బూడిద!

2

ఐసెట్‌లో 90.83% ఉత్తీర్ణత

- అమ్మాయిల్లో 90.95 శాతం, అబ్బాయిల్లో 90.7 శాతం
- మొత్తం 58,985 మంది పాస్
- వీరిలో 30,580 మంది బీకాం.. 13,389 మంది బీఎస్సీ, 3,812 మంది బీటెక్ పట్టభద్రులు

14

అనధికారిక నిర్మాణాలన్నీ కూల్చాల్సిందే!

- 'నెట్ నెట్' భవనంపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు సబబే
- అనధికారిక కట్టడాలను తొలగించే దాకా నిర్మాణ పనులు చేయొద్దు
- జీహెచ్ఎంసీ ఉత్తర్వుల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలి
- సిటీ స్మాల్ కాజెస్ కోర్టు తీర్పు
- ఇచ్చుకుంటూ పోతే భవిష్యత్తులో ప్రభుత్వ భూమన్నదే ఉండదు: హైకోర్టు

14

కాళేశ్వరం నివేదిక

నెలాఖరులోగా!

- ఇచ్చేందుకు సిద్ధమవుతున్న కమిషన్
- ప్రభుత్వం అందించిన పత్రాలను అధ్యయనం చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్
- గ్రౌటింగ్‌కు సాంకేతిక కమిటీ సిఫారసులు తీసుకోవటంపై ఆగ్రహం
- ఈఎన్‌సీకి నోటీసులు
- ఈ నెల 9 లేదా 10న హాజరు



జస్టిస్ పీసీ ఘోష్

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల్లో తలెత్తిన సమస్యలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది. సోమవారం జస్టిస్ పీసీ ఘోష్.. కమిషన్ కార్యాలయానికి వచ్చారు. ప్రభుత్వం అందించిన పత్రాలను ఆయన అధ్యయనం చేసినట్లు సమాచారం. కాగా, తమకు సాంకేతిక సహాయం అందించడం కోసం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ సిఫారసులతో.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో గ్రౌటింగ్ చేయడంపై కమిషన్ ఆగ్రహంతో ఉంది. కమిషన్‌కు సహాయంగా వేసిన కమిటీతో సిఫారసులు తెప్పించుకొని గ్రౌటింగ్ చేయటం ఏమిటని ప్రశ్నిస్తూ.. ఈఎన్‌సీ అనిల్‌కుమార్‌కు నోటీసులు పంపించింది. ఆయన ఈ నెల 9 లేదా 10వ తేదీన కమిషన్ ముందు హాజరై వివరణ ఇచ్చే అవకాశం ఉంది. ఈ నెల 11వ తేదీన కోల్‌కతాకు తిరిగి వెళ్లనున్న జస్టిస్ పీసీ ఘోష్.. ఈ నెల చివరి వారంలో హైదరాబాద్‌కు వచ్చి.. ప్రభుత్వానికి నివేదికను అందించనున్నట్లు సమాచారం. కమిషన్‌కు ప్రభుత్వం ఇచ్చిన గడువు కూడా ఈ నెలాఖరుతో ముగియనుంది.



గాడినపడనున్న వైద్య విద్య!

- ప్రభుత్వ వైద్య కాలేజీల్లో మరో 1,235 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు
- ఇప్పటికే 607 పోస్టులకు నోటిఫికేషన్ జారీ
- సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్స్‌గా 44 మందికి పోస్టింగులు.. నేడు జీవో
- 349 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతులు
- తీరనున్న అధ్యాపకుల కొరత

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్యవిద్యను గాడిన పెట్టే క్రమంలో సర్కారు రికార్డు స్థాయిలో అధ్యాపకుల నియామక ప్రక్రియను చేపట్టింది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భారీగా భర్తీ చేసేందుకు సిద్ధమైంది. మొత్తం 1,842 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనుంది. ఇప్పటికే 607 పోస్టులకు మెడికల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ జారీ కాగా.. అదనంగా 1,235 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కూడా వీటితో జతచేయనుంది. ఇందులో 715 పోస్టులకు

మిగతా 14వ పేజీలో...

కొత్త వైన్ పరిశ్రమ

- రాష్ట్రంలో ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న 3 సంస్థలు
- ప్రభుత్వ పరిశీలనలో ఫైల్.. ఒక సంస్థకు అనుమతి!
- ఈ ఏడాది జూన్‌కల్లా 2.68 లక్షల వైన్ కేసుల విక్రయం
- అందులో 8,725 కేసులు మాత్రమే స్థానిక కంపెనీలవి
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 700 ఎకరాలకు పైగా ద్రాక్షసాగు.. అక్కడే వైనరీ పరిశ్రమల స్థాపనకు చర్యలు



హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో త్వరలో కొత్త వైన్ పరిశ్రమ రానుంది. రాష్ట్రంలో వైన్ వినియోగం నానాటికీ పెరుగుతున్నప్పటికీ.. స్థానిక కంపెనీలు తక్కువగా ఉన్నందున హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. కొత్త వైనరీల ఏర్పాటుకు మూడు సంస్థలు దరఖాస్తు చేసుకోగా.. వాటిలో ఒకదానికి అనుమతి ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలో వైన్ విక్రయాలను పరిశీలిస్తే.. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో (జనవరి-జూన్) రూ.300 కోట్ల విలువైన

మిగతా 10వ పేజీలో...



ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయం వద్ద పోలీసుల మోహరింపు

ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై దాడులకు అవకాశం!

- నిఘా వర్గాల నుంచి పోలీసులకు సమాచారం
- సంస్థ కార్యాలయాల ముందు భద్రత ఏర్పాటు
- బీఆర్ఎస్ ఖబర్దార్.. మీడియాపై దాడులు సహించం
- రక్షణ కవచంగా మా కార్యకర్తలు నిలబడతారు
- బీఆర్ఎస్ దాడులకు దిగితే టీ న్యూస్ అంతుచూస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు హెచ్చరిక
- కేసీఆర్‌ను ఉద్యమకారుడిగా చూపిందే ఆంధ్రజ్యోతి
- మహా టీవీపై దాడి అప్పుడే సీఎం కఠినంగా ఉండాల్సింది
- ఏబీఎన్‌పై దాడి చేస్తే 2 గంటల్లో టీ న్యూస్‌పై దాడి చేస్తాం
- బీఆర్ఎస్ నేతలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం

హైదరాబాద్/జగిత్యాల, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏబీఎన్, ఆంధ్రజ్యోతి కార్యాలయాలపై బీఆర్ఎస్ వర్గాలు దాడిచేసే అవకాశముందని నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో రాష్ట్ర పోలీసు విభాగం అప్రమత్తమైంది. హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, ఆంధ్రజ్యోతి కార్యాలయాల ముందు పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి నిఘా వర్గాలకు దాడి అవకాశాలపై సమాచారం వచ్చినట్లు తెలిసింది. దీంతో ఆదివారం అర్ధరాత్రి నుంచే సంస్థ

మిగతా 3వ పేజీలో...

ఫోన్ ట్యాపింగ్ విచారణ.. ఇక

ప్రవీణ్ వంతు

- ఆయన వాంగ్మూలం సేకరణకు సిద్ధమవుతున్న సిట్ అధికారులు
- అసెంబ్లీ ఎన్నికలకు ముందు ట్యాపింగ్‌పై ఆర్ఎస్పీ ఫిర్యాదు
- పోలీసులు పట్టించుకోవట్లేదని అప్పట్లో బీఎస్పీ నేతగా విమర్శలు
- ఆ ఫిర్యాదుపై విచారించాలని తాజాగా సిట్ నిర్ణయం
- ఫోరెన్సిక్ విశ్లేషణకు ప్రభాకర్‌రావు ఫోన్, ల్యాప్‌టాప్
- త్వరలో సిట్ ముందుకు బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) సిద్ధమవుతోంది. ట్యాపింగ్ కేసులో ఇప్పటికే పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులను సిట్ విచారించి, వాంగ్మూలాలను నమోదు చేసుకుంది. ఈ క్రమంలోనే ప్రవీణ్ కుమార్‌కు నోటీసులను జారీచేసి, విచారించేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్ఎస్పీ.. సిర్పూర్ నియోజకవర్గం

మిగతా 12వ పేజీలో...



సీఎం సిగ్గున్నోడైతే..

- బకెట్ నీళ్లలో మునిగి ఆత్మహత్య చేసుకునేవాడు
- అలాంటిదేమీ లేనందునే ప్రజలు తిట్టినా పట్టించుకోవట్లే
- రేవంత్‌రెడ్డిలాగా మేం లేకి పనులు చేయలేదు: కేటీఆర్

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిలాగా తాము లేకిపనులు చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలపై అడ్డమైన కేసులు పెట్టలేదని, ఇతర పార్టీల కార్యకర్తలను పోలీసులతో కొట్టించలేదని చెప్పారు. ఎన్నికల్లో

మిగతా 12వ పేజీలో...

కుపోలా.. భూమండలాన్ని చూపించే కిటికీ!



న్యూఢిల్లీ, జూలై 7: భారత సంతతి వ్యోమగామి శుభాన్షు శుక్లా వెనుక కనిపిస్తున్నది అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనా కేంద్రం(ఐఎ‌స్‌ఎస్)లోని ఓ కిటికీ. పేరు కుపోలా. మన ఇంట్లో కిటికీ నుంచి చూస్తే మహా అయితే వీధి చివర వరకు, ఇంకా అంటే ఊరి చివరి చెట్లు, భవనాల వరకు చూడొచ్చు. కానీ, ఈ కిటికీ నుంచి భూమండలం మొత్తం కనిపిస్తుంది. 14రోజుల మిషన్‌లో భాగంగా జూన్ 26న ఐఎస్ఎస్ వెళ్లిన శుభాన్షు శుక్లా సోమవారం ఈ కిటికీ దగ్గర ఉన్న ఫొటోలను పంపించారు. కుపోలా అంటే ఇటాలియన్ భాషలో డోము అని అర్థం. ఇది ఏడు గాజు అద్దాలతో కూడిన నిర్మాణం. 2010లో దీన్ని ఐఎస్ఎస్‌లో ఏర్పాటు చేశారు. ఉల్కల్లాంటివి తాకి అద్దాలు ధ్వంసం కాకుండా కిటికీలోని ఈ ఏడు అద్దాలకు షట్టర్లు ఉంటాయి. వ్యోమగాములు భూమండలాన్ని, అంతరిక్షాన్ని చూడాలనుకున్నప్పుడు ఆ షట్టర్లను తెరుస్తారు


ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం

» 18 కి.మీ ఎత్తుకు ఎగిసిపడుతున్న బూడిద

జకార్తా, జూలై 7: ఇండోనేషియాలోని మౌంట్ లెవోటోబి లాకీ లాకీ అగ్నిపర్వతం బద్దలయింది. సుమారు 18 కిలోమీటర్ల ఎత్తు వరకు నిప్పురవ్వలు, దట్టమైన బూడిద ఎగిసిపడుతున్నాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఎటువంటి ప్రాణ నష్టం నమోదు కాలేదు. అయితే అగ్నిపర్వతం నుంచి విడుదలైన లావా సుమారు 5 కిలోమీటర్ల వరకు విస్తరించిందని ఇండోనేషియా భూగర్భశాస్త్ర ఏజెన్సీ తెలిపింది. గతేడాది నవంబర్‌లో లాకీ లాకీ అగ్నిపర్వతం బద్దలు కావడంతో తొమ్మిది మంది మృతి చెందగా చాలా మంది గాయపడ్డారు. గత నెలలోనూ పలుమార్లు అగ్నిపర్వతం బద్దలయింది. దాంతో మరిన్ని పేలుళ్లు సంభవించే ప్రమాదం ఉన్నందున పర్వతానికి ఏడు కిలోమీటర్ల వరకు



అధికారులు ఆంక్షలు విధించి చుట్టు పక్కల గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు పంపారు.



రేపు భారత్ బంద్

» 25 కోట్ల మంది పాల్గొంటారు: కార్మిక సంఘాలు

న్యూఢిల్లీ, జూలై 7: కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ 10 కార్మిక సంఘాల వేదిక బుధవారం భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. మోదీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ఈ దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని కోరింది. దేశవ్యాప్తంగా జరగనున్న ఈ సమ్మెలో బ్యాంకింగ్, బీమా, తపాలా, బొగ్గు గనులు, జాతీయ రహదారులు, నిర్మాణ రంగాలకు చెందిన 25 కోట్ల మందికి పైగా పాల్గొంటారని పేర్కొంది. దేశవ్యాప్తంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల్లోకి కార్మికులు కూడా సమ్మెలో పాల్గొంటారని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు చెందిన అమర్జీత్ తెలిపారు.

హిమాచల్‌లో వరదలకు నీట మునిగిన బ్యాంకు

మండి, జూలై 7: హిమాచల్ ప్రదేశ్‌లో వరదలకు ఆ రాష్ట్ర సహకార బ్యాంకు నీట మునిగింది. వరద ఉధృతికి బ్యాంకులోని విలువైన వస్తువులన్నీ పాడైపోయి ఉంటాయని.. శిథిలాలు, బురద తొలగించిన తర్వాతే నష్టాన్ని అంచనా వేయగలుగుతామని బ్యాంకు అధికారులు భావిస్తున్నారు. మండి జిల్లాలోని ధునాగ్ పట్టణంలో ఉన్న హిమాచల్ రాష్ట్ర సహకార బ్యాంకులో సమీప పట్టణాలకు చెందిన వందలాది మంది వ్యాపారులు, ఖాతాదారులు తమ డబ్బును డిపాజిట్ చేస్తుంటారు. నగలు, విలువైన పత్రాలను దాచుకున్నారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో మండి జిల్లా అతలాకుతలమైంది. ఈ నేపథ్యంలోనే సహకార బ్యాంకు భవనం వరద నీటిలో పూర్తిగా మునిగిపోయింది. దీంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. వరదల వల్ల కొట్టుకుపోయిన విలువైన వస్తువులు చోరీ కాకుండా కొంత మంది స్థానికులు బ్యాంకు వద్దే కాపలా ఉండటం గమనార్హం.

సౌదీలో గతేడాది 345 మందికి ఉరి

దుబాయ్, జూలై 7: సౌదీ అరేబియాలో గత ఏడాది విధించిన మరణ శిక్షల సంఖ్య రికార్డు స్థాయికి పెరిగాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సోమవారం పేర్కొంది. 2024లో సౌదీలో ఏకంగా 345 మందిని ఉరితీయగా.. తమ రికార్డుల ప్రకారం ఈ సంఖ్య గత మూడు దశాబ్దాలకు పైగా కాలంలోనే అత్యధికమని వెల్లడించింది. మాదకద్రవ్యాల కేసుల్లో శిక్షలు అధికంగా ఉన్నాయని తెలిపింది. ఈ సంవత్సరం కూడా మొదటి ఆరు నెలల కాలంలోనే 180 మందికి మరణశిక్ష విధించారని, గత రికార్డును ఈ ఏడాది అధిగమించే అవకాశం ఉందని పేర్కొంది. దీనిపై మానవ హక్కుల కార్యకర్తలతో పాటు ఆమ్నెస్టీ ఆందోళన వ్యక్తం చేసింది.

పదవి నుంచి తొలగించిన గంటల్లోనే తుపాకీతో కాల్చుకొని రష్యా మంత్రి ఆత్మహత్య

మాస్కో, జూలై 7: పదవి నుంచి తొలగించిన కొద్ది గంటల వ్యవధిలోనే రష్యా రవాణా శాఖ మంత్రి రోమన్ స్టారోవోయిత్ సోమవారం తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మాస్కో శివారులో తన సొంత కారులోనే ఆయన ప్రాణాలు తీసుకున్నారు. కొంతకాలంగా ఆయన పనితీరుపై అసంతృప్తితో ఉన్న అధ్యక్షుడు పుతిన్ ఆయనను పదవి నుంచి తొలగించినట్టు తెలుస్తోంది. పదవి నుంచి తొలగిస్తూ పుతిన్ ఇచ్చిన ఆదేశాలను రష్యా లీగల్ ఇన్‌ఫర్మేషన్ పోర్టల్‌లో పెట్టినా ఇందుకుగల కారణాలను వివరించలేదు. ఉక్రెయిన్‌కు సరిహద్దులో ఉన్న కుర్స్క్ రీజియన్‌కు అయిదేళ్లపాటు గవర్నర్‌గా పనిచేసిన స్టారోవోయిత్‌ను గత ఏడాది మే నెలలో రవాణా శాఖ మంత్రిగా పుతిన్ నియమించారు.

హౌతీలపై ఇజ్రాయెల్ దాడులు

దుబాయ్, జూలై 7: ఇరాన్ మద్దతుతో ఎర్ర సముద్రంలో విధ్వంసాలకు పాల్పడుతున్న తిరుగుబాటు దళం హౌతీ స్థావరాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) ఆదివారం సాయంత్రం నుంచి ముప్పేట దాడులు జరిపింది. ఆదివారం ఉదయం ఎర్రసముద్రంలో లిబేరియన్ జెండా ఉన్న ఓ వాణిజ్య నౌకపై హౌతీలు దాడి చేయడంతో.. ఇజ్రాయెల్ తన చర్యలను ప్రారంభించింది. దక్షిణ యెమన్‌లోని హౌతీల స్థావరాలైన హోడెడా, రాస్‌ఈసా, సలిఫ్ బందరా, రాస్ కానాటిబ్ పవర్ ప్లాంట్‌లపై సోమవారం కూడా గగనతల దాడులు కొనసాగాయి. ఈ దాడుల్లో గెలాక్సీ లీడర్ నౌకను ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. 2023లో భారత్‌కు వస్తున్న ఆ నౌకను హౌతీలు అపహరించారు. దాన్ని ఇజ్రాయెల్‌కు చెందిన నౌకగా భావించి, అపహరించినట్లు అప్పట్లో వార్తలొచ్చాయి.

క్షుద్రపూజల నెపంతో బిహార్‌లో ఐదుగురి హత్య

బిహార్, జూలై 7: క్షుద్రపూజలు చేస్తున్నారనే నెపంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని గ్రామస్థులు హత్య చేశారు. అనంతరం మృతదేహాలకు నిప్పంటించారు. ఈ ఘటన పూర్ణియా జిల్లాలోని టెట్‌గామా గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుమారులలో ఒకరు ఇటీవల చనిపోగా, మరొకరు అనారోగ్యానికి గురయ్యారు. వీరికి గ్రామానికి చెందిన సీతాదేవి అనే మహిళ క్షుద్రపూజలు చేసిందనే అనుమానంతో 50 మంది గ్రామస్థులు అర్ధరాత్రి ఆమె ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో సదరు మహిళ సహా ఆమె కుటుంబసభ్యులు ఐదుగురు మృతిచెందారు. అనంతరం గ్రామస్థులు ఆ మృతదేహాలకు నిప్పంటించారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటివరకు ఇద్దరిని అరెస్టు చేశారు.

బ్రిక్స్‌కు మద్దతిస్తే 10% అదనపు సుంకం

దానివి అమెరికాకు వ్యతిరేక విధానాలు.. ప్రపంచ దేశాలకు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్/రియో డీ జనేరో: ఒక పక్క బ్రిక్స్ దేశాల సదస్సు బ్రెజిల్‌లో జరుగుతుంటే మరోపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ వాణిజ్య కూటమి పట్ల విషం కక్కారు. బ్రిక్స్ అనుసరిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతుగా నిలిచిన దేశాలపై మరో పదిశాతం అదనపు సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండబోదని స్పష్టం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. బ్రిక్స్ అనుసరిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలేంటో చెప్పలేదు. ప్రపంచ దేశాలకు వాణిజ్య విధివిధానాలు అధికారికంగా లేఖల రూపంలో పంపిస్తున్నట్లు తెలిపారు. 2009లో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో ఏర్పడి, తర్వాత దక్షిణాఫ్రికాను కలుపుకొని, ఇప్పుడు ఈజిప్టు, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలకు విస్తరించిన వాణిజ్య కూటమి బ్రిక్స్. ట్రంప్ అడ్డగోలు సుంకాలను పరోక్షంగా తప్పుబడుతూ బ్రిక్స్ ప్రకటన చేయగానే ట్రంప్ తాజా ప్రకటనతో బదులిచ్చారు. బ్రిక్స్ ప్రకటనలో ప్రపంచ వాణిజ్య సంస్థ మద్దతు కలిగిన నిబంధనలతో కూడుకున్న, పారదర్శకమైన, అందరినీ కలుపుకొనిపోయే, సమానత్వంతో కూడిన బహుళ వాణిజ్య వ్యవస్థకు మద్దతు తెలుపుతామని చెప్పింది. ట్రంప్ ప్రకటించిన భారీ సుంకాల అమలుకు 90 రోజుల గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే. అది బుధవారంతో ముగిసిపోతోంది. ఆలోపు భారత్ అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవాలి. అందుకు సంబంధించిన చర్చలు ముగిశాయి. ట్రంప్ తాజా ప్రకటన ఇరు దేశాల మధ్య కుదరనున్న వాణిజ్య ఒప్పందం మీద ఎలాంటి ప్రభావం చూపబోదని అధికారులు అంటున్నారు. ట్రంప్ ప్రకటన మీద చైనా స్పందించింది. మూడో దేశాన్ని లక్ష్యంగా చేసుకొని బ్రిక్స్ పని చేయదని స్పష్టం చేసింది. వాణిజ్యంలో విజేతలు ఉండరని, రక్షణాత్మక వాణిజ్యం ముందుకు తీసుకెళ్లదని వ్యాఖ్యానించింది.

పహల్గాంపై ఖండన

బ్రిక్స్ సభ్య దేశాలు కశ్మీరులోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండించాయి. ఉగ్రవాదంపై పోరులో ఎలాంటి రాజీ ఉండరాదని పిలుపునిచ్చాయి. ఉగ్రవాదంపై కొన్ని దేశాల ద్వంద్వ ప్రమాణాలను తప్పుబట్టాయి. ఉగ్రవాదులకు నిధులు అందకుండా చూడాల్సిన అవసరాన్ని గుర్తు చేశాయి. మరోపక్క ప్రధాని మోదీ నిరుపేద దేశాల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా బ్రిక్స్ దేశాలు పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ క్యూబా అధ్యక్షుడు మైగల్ డియాజ్ కెనాల్ బెర్ముడెజ్‌తో సమావేశం అయ్యారు. ఫార్మా, యూపీఐ అమలు వంటి అంశాలపై చర్చించారు. మలేసియా ప్రధాని, బొలీవియా, ఉరుగ్వే అధ్యక్షులతోనూ భేటీ అయ్యారు.



మస్క్ పూర్తిగా గాడితప్పారు

» పార్టీ ఏర్పాటు ఓ హాస్యాస్పద నిర్ణయం

» నాసాలోకి తన మిత్రుణ్ణి తీసుకోవాలని నాపై ఒత్తిడి: ట్రంప్

న్యూయార్క్, జూలై 7: టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ కొత్తగా రాజకీయ పార్టీని ఏర్పాటుచేయడాన్ని హాస్యాస్పదమైన నిర్ణయంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. మస్క్ ఐదు వారాలుగా పూర్తిగా గాడి తప్పిపోయారన్నారు. అమెరికాలో మూడోపార్టీని ఏర్పాటుచేయడం తెలివితక్కువ నిర్ణయమని ట్రంప్ అన్నారు. ద్విపార్టీ వ్యవస్థ నడుస్తున్న అమెరికా రాజకీయాల్లో మూడో పార్టీ ఏర్పాటు గందరగోళానికి దారితీస్తుందని తెలిపారు. అమెరికాలో మూడోపార్టీ విజయం సాధించిన చరిత్రే లేదని వివరించారు. వాహన రాయితీలు రద్దయిపోయి, అందరూ ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసేలా మస్క్ ఎత్తు వేశారని ట్రంప్ విమర్శించారు. తన స్నేహితుడు జార్డ్ ఇసాక్‌మన్‌ను నాసాలోకి ప్రవేశపెట్టాలంటూ తనపై మస్క్ ఒత్తిడిని తెచ్చారని ఆరోపించారు. బిగ్ బ్యూటీఫుల్ బిల్లు విషయంలో ట్రంప్‌తో విభేదించి 'డోజ్' నుంచి మస్క్ తప్పుకోగానే జార్డ్ ఇసాక్‌మన్‌కు సంబంధించిన నామినేషన్ కూడా రద్దయిపోయింది. స్పేస్ బిజినెస్‌లో ఉన్న ఇసాక్‌మన్‌కు నాసా పగ్గాలు అప్పగించడం సబబు కాదని భావించానని ట్రంప్ తెలిపారు.

ట్రంప్‌పై మస్క్ తొలి దాడి

మస్క్ తన తొలిదాడిని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఎక్కుపెట్టారు. బాలలపై లైంగిక దాడుల కేసుల్లో నిందితుడిగా ఉండి 2019లో పోలీస్ కస్టడీలో మరణించిన జఫ్రీ ఎప్‌స్టీయిన్ వివాదాన్ని ఆయన మరోసారి తెరపైకి తెచ్చారు. ఎప్‌స్టెయిన్ తన క్లయింట్లకు బాలలను సరఫరా చేసేవాడు. ఆ తర్వాత వారిని బెదిరించి డబ్బులు గుంజేవాడు. ఇలాంటి క్లయింట్ల జాబితాలో ట్రంప్ కూడా ఉన్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఎప్‌స్టెయిన్ చనిపోయిన వ్యవహారంలో ఇంతవరకు అరెస్టులు జరగలేదని మస్క్ తాజాగా విమర్శించారు.

జపాన్, దక్షిణ కొరియాలపై 25% మేర సుంకాల హెచ్చింపు

వాషింగ్టన్, జూలై 7: జపాన్, దక్షిణ కొరియా దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న వస్తువులపై విధిస్తున్న సుంకాలను 25% మేర పెంచుతున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. వివిధ రంగాల వారీగా ఇప్పుడు వసూలు చేస్తున్న పన్నులకు అదనంగా దీన్ని విధిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు జపాన్ ప్రధాని ఇషిబ షిగెరు, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జాయ్-మయుంగ్‌కు లేఖలు కూడా రాశారు. ఒకవేళ సుంకాన్ని ఎగవేయడానికి ప్రయత్నిస్తే మరింతగా పెంచుతామని పేర్కొన్నారు. ప్రతీకారంగా ఆ దేశాలు కూడా సుంకాలను పెంచితే కఠినంగా ఉంటామని తెలిపారు. పెంచిన శాతాన్ని, ఈ 25 శాతాన్ని కలిపి మొత్తం వసూలు చేస్తామని పేర్కొన్నారు. ద్వైపాక్షికంగా వాణిజ్యలోటు ఉండకూడదన్న ఉద్దేశంతోనే సుంకాలు పెంచినట్టు చెప్పారు.

టెక్సస్ వరదల్లో 82కు పెరిగిన మృతుల సంఖ్య

కెర్‌విలే, జూలై 7: టెక్సస్‌లో భారీ వరదల కారణంగా మృతి చెందినవారి సంఖ్య 82కు పెరిగింది. 41మంది గల్లంతయ్యారు. ఇంకా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సెంట్రల్ టెక్సస్‌ను మరోసారి వరద ముంచెత్తవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. గల్లంతైనవారి కోసం 17 హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. ధ్వంసమైన నివాసాలు, కార్యాలయాల శిథిలాల కింద చాలా మంది ఉండి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కెర్ కౌంటీని తీవ్ర వరద ప్రభావ ప్రాంతంగా గుర్తిస్తూ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం డిక్లరేషన్‌పై సంతకం చేశారు. 11న (శుక్రవారం) సదరు కౌంటీని సందర్శిస్తానని ప్రకటించారు.

కుమార్తెలకు అనారోగ్య సమస్యలు

» అరుదైన జన్యువ్యాధి.. అందుకనే అధికారిక నివాసం ఖాళీ చేయలేదు

» మాజీ సీజేఐ చంద్రచూడ్

న్యూఢిల్లీ, జూలై 7: అరుదైన జన్యువ్యాధితో బాధపడుతున్న తన ఇద్దరు కుమార్తెలకున్న ప్రత్యేక అవసరాల దృష్ట్యానే.. అధికారిక బంగ్లాను ఖాళీ చేయాలేదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. గతేడాది నవంబరులో రిటైరైన చంద్రచూడ్ ఇప్పటికీ సీజేఐ అధికారిక నివాసంలోనే ఉంటున్నారని, ఆయనను ఖాళీ చేయించాలని కేంద్రప్రభుత్వానికి సుప్రీంకోర్టు పాలనా విభాగం లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనిపై చంద్రచూడ్ వివిధ మీడియా సంస్థలతో మాట్లాడుతూ.. తాను, తన భార్య కల్పన.. ప్రియాంక, మహి అనే ఇద్దరు బాలికలను గతంలో దత్తత తీసుకున్నామని, వారిరువురూ నెమలిన్ మయోపతి అనే అరుదైన జన్యువ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధి వల్ల బాలికలిద్దరికీ కండరాలు, నాడీ, శ్వాస సంబంధమైన సమస్యలు తలెత్తుతుంటాయని.. ఈ వ్యాధికి ప్రస్తుతం చికిత్స లేదన్నారు. వారి ప్రత్యేక అవసరాల దృష్ట్యా.. అధికారిక నివాసంలో పలు మార్పులు చేశామని, రిటైర్మెంట్ తర్వాత అటువంటి ఇల్లు కోసం వెదికితే ఢిల్లీలో దొరకలేదన్నారు. పదవీ విరమణ తర్వాత తనకు ప్రభుత్వం కేటాయించిన భవంతిలో గత రెండేళ్లుగా ఎవరూ ఉండటం లేదని, ఆ భవనంలో మరమ్మతులు జరుగుతున్నాయని, అవి పూర్తి కాగానే దాంట్లోకి వెళ్తామన్నారు. కాగా, జస్టిస్ చంద్రచూడ్‌కు ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు.



దలైలామాకు మోదీ శుభాకాంక్షలపై చైనా అభ్యంతరం

బీజింగ్, జూలై7: టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామాకు భారత ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు చెప్పడంపై చైనా అభ్యంతరం తెలిపింది. దలైలామా 90వ జన్మదిన ఉత్సవాలకు భారత మంత్రులు, సీనియర్ అధికారులు, ప్రముఖులు హాజరుకావడంపైనా అసంతృప్తి వ్యక్తం చేసింది. టిబెట్‌కు సంబంధించిన వ్యవహారాల్లో చైనా మనోభావాలను అర్థం చేసుకోవాలని సూచించింది. టిబెట్ వ్యవహారాల్లో చైనా వైఖరి స్థిరంగా ఉందని, ఇది అందరికీ తెలిసిన విషయమేనని పేర్కొంది. సోమవారం చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మీడియాతో మాట్లాడుతూ.. చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని భారత్ మానుకోవాలని సూచించారు. దీనిపై భారత్‌కు అభ్యంతరం తెలియజేశామని చెప్పారు.

పాక్ ఆర్మీకి విశ్వాసపాత్రుడైన ఏజెంట్‌ని

2008లో ముంబైపై దాడుల్లో కీలకపాత్ర పోషించా

» దాడులకు ముందు ముంబైలో తిరిగా

» దాడుల సమయంలో ఆ నగరంలోనే ఉన్నా

» హెడ్లీ నా చిన్ననాటి స్నేహితుడు.. మేమిద్దరం కలిసి లష్కరే ఉగ్ర శిబిరాల్లో శిక్షణ పొందాం

» ఎన్ఐఏ విచారణలో తహవ్వుర్ రాణా వెల్లడి!

న్యూఢిల్లీ, జూలై 7: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీలో ఉన్న ముంబై పేలుళ్ల కేసు నిందితుడు తహవ్వుర్ రాణా.. విచారణలో పలు సంచలన విషయాలు బయటపెట్టాడు. 2008లో ముంబైపై దాడులు (26/11) జరిగిన సమయంలో తాను అక్కడే ఉన్నానని.. ఆ దాడుల వెనుక తన ప్రమేయం ఉందని అతడు అంగీకరించినట్లు సమాచారం. ప్రస్తుతం ఢిల్లీలోని తిహాడ్ జైల్లో ఉన్న తహవ్వుర్‌ను.. ఎన్ఐఏతోపాటు ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు కూడా విచారిస్తున్న సంగతి తెలిసిందే. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ విచారణలో అతడు తన తప్పులన్నీ ఒప్పుకొన్నాడు. తాను 1986లో రావల్పిండిలోని పాకిస్థాన్ ఆర్మీ వైద్య కళాశాలలో వైద్య విద్య (ఎంబీబీఎస్) పూర్తిచేశానని.. అనంతరం పాక్ ఆర్మీ తనను క్వెట్టాలో కెప్టెన్ (డాక్టర్)గా నియమించిందని చెప్పాడు. తనకు సింధ్, బెలూచిస్థాన్, బహావల్‌పూర్, సియాచెన్-బలోత్రా వంటి సున్నితమైన ప్రాంతాల బాధ్యతలు అప్పగించారని, కానీ ఊపిరితిత్తుల్లో సమస్యల కారణంగా తాను విధులకు హాజరు కాకపోవడంతో ఆర్మీ తనను 'డెజర్టర్'గా ప్రకటించిందని చెప్పాడు (చెప్పాపెట్టకుండా, మళ్లీ తిరిగొచ్చే ఉద్దేశం లేకుండా ఆర్మీని విడిచిపెట్టి పారిపోయేవారిని ఆర్మీ 'డెజర్టర్'గా ప్రకటిస్తుంది). అలా తన మీద పడ్డ 'డెజర్టర్' అనే ముద్రను రికార్డుల నుంచి తొలగించుకోవడానికి.. డేవిడ్ హెడ్లీకి సాయం చేసేందుకు అంగీకరించినట్టు చెప్పాడు. 26/11 దాడులకు ముందు.. 'ఇమ్మిగ్రెంట్ లా సెంటర్' ప్రతినిధిగా డేవిడ్ హెడ్లీ ముంబై, ఢిల్లీ, పుణె సహా పలు నగరాల్లో పర్యటించినట్టు దర్యాప్తులో వెల్లడైంది. ఆ కంపెనీని ఏర్పాటు చేయడం వెనుక తానే కీలకపాత్ర పోషించానని రానా విచారణలో తెలిపాడు. ముంబైలో కీలక లక్ష్యాలను గుర్తించడంలో కూడా హెడ్లీకి తాను సాయం చేశానని ఒప్పుకొన్నాడు. దాడులకు ముందు తాను కూడా ముంబైకి చేరుకుని.. ఒక హోటల్‌లో బస చేశానని.. ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ సహా ఆ నగరంలో పలు ప్రాంతాల్లో రెకీ నిర్వహించానని తెలిపాడు. డేవిడ్ హెడ్లీ భారత్‌కు రావడానికి అవసరమైన నకిలీ గుర్తింపు పత్రాలను సృష్టించానని వెల్లడించాడు. పాక్ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) సహకారంతోనే దాడులు జరిపినట్టు స్పష్టం చేశాడు. 26/11 దాడుల్లో.. పాకిస్థాన్ ఆర్మీకి విశ్వాసపాత్రుడైన ఏజెంట్‌గా తాను పోషించిన పాత్ర గురించి వివరించాడు. పాకిస్థానీ ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబా నిర్వహించే శిక్షణ కార్యక్రమాల్లో తాను, తన చిన్ననాటి స్నేహితుడు డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ శిక్షణ పొందినట్లు తెలిపాడు. గల్ఫ్ యుద్ధం సమయంలో పాక్ ఆర్మీ తనను సౌదీఅరేబియాకు కూడా ఒక రహస్య మిషన్‌పై పంపిందని వెల్లడించాడు.



అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు తాళం

» 40 నెలలుగా భవనానికి అద్దె చెల్లించకపోవడం వల్లే

» సబ్‌రిజిస్ట్రార్ హామీతో తాళం తొలగించిన యజమాని

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దాదాపు మూడేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి భవన యజమాని తాళం వేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో పిట్టల రాజుకు చెందిన భవనంలో గత కొన్నేళ్లుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగుతోంది. కాగా, సుమారు 40 నెలలుగా భవనానికి ఆ శాఖ అధికారులు అద్దె చెల్లించడం లేదు. దీంతో పలుమార్లు రాజు రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులను కలిసి అద్దె చెల్లించాలని విన్నవించుకున్నారు. గత నెల 4వ తేదీన మరోసారి జిల్లా రిజిస్ట్రార్‌ను కలిసి 15రోజుల్లో అద్దెను పూర్తిగా చెల్లించాలని.. లేని పక్షంలో 3-4 నెలల్లో కార్యాలయం ఖాళీ చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఆ శాఖ జిల్లా అధికారులు 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయించిన వెంటనే పూర్తిగా అద్దె చెల్లిస్తామని రాజుకు లేఖ ద్వారా హామీ ఇచ్చారు. దీంతో అద్దె చెల్లింపు మరింత ఆలస్యం అయ్యేలా ఉందని భావించిన రాజు.. సోమవారం కార్యాలయాన్ని సిబ్బంది తెరిచిన కొద్ది సేపటికి అక్కడికి చేరుకొని సిబ్బందిని బయటకు పంపి తాళం వేశారు. ఈ విషయాన్ని కార్యాలయ సిబ్బంది సబ్ రిజిస్ట్రార్ సునీతారాణికి తెలపగా, ఆమె వెంటనే అక్కడికి చేరుకొని ఉన్నత అధికారులతో మాట్లాడి 15 రోజుల్లో అద్దె చెల్లించేలా చర్యలు తీసుకుంటామని రాజుకు హామీ ఇచ్చారు. దాంతో ఆయన తాళాలను తొలగించారు. నిర్మాణ సమయంలో భవనంపై లోన్ తీసుకున్నానని, అధికారులు 40 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో ప్రతి నెలా ఈఎంఐ కట్టేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోందని భవన యజమాని రాజు తన ఆవేదనను వ్యక్తం చేశారు.

అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

తెలుగు కుటుంబం సజీవదహనం.. నలుగురు వెళ్తున్న కారును బలంగా ఢీకొట్టిన మినీ ట్రక్కు

» మంటలు చెలరేగి కుటుంబం మొత్తం కాలి బూడిద!

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో.. నగరానికి చెందిన ఓ నిండు కుటుంబం సజీవ దహనం అయింది. నగరంలోని కొంపల్లి ప్రాంతానికి శ్రీవెంకట్ బెజుగం, తేజస్విని దంపతులు, వారి ఇద్దరు పిల్లలు సిద్ధార్థ్ బెజుగం, మ్రిదా బెజుగం దుర్మరణంపాలయ్యారు. శ్రీవెంకట్, తేజస్విని ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే. వీరు మూడేళ్ల క్రితం అమెరికాకు వెళ్లి, డాలస్‌లో ఇల్లు కొనుక్కొని అక్కడే స్థిరపడ్డారు. ఇటీవలే శ్రీవెంకట్.. అట్లాంటాలోని తన అక్క ఇంటికి భార్య, పిల్లలతో సహా వెళ్లారు. వారంరోజుల పాటు అక్కడే ఆనందంగా గడిపి తిరిగి వస్తుండగా.. ఆదివారం అర్థరాత్రి గ్రీన్ కౌంటీ ఏరియాలో.. రాంగ్ రూట్‌లో వచ్చిన మినీ ట్రక్ వారి కారును ఢీ కొట్టింది. ట్రక్ వేగంగా ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. వెంకట్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఆ నలుగురి శరీరాలూ పూర్తిగా కాలిపోవడంతో అధికారులు వారి ఎముకలను సేకరించి.. డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ ద్వారా గుర్తించే ప్రయత్నంలో ఉన్నారు. ట్రక్ డ్రైవర్ తప్పిదమే ఈ ప్రమాదానికి కారణమని స్థానిక పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కాగా.. వెంకట్ కుటుంబం మృతితో హైదరాబాద్‌లోని వారి కుటుంబ సభ్యులు, బంధువులు శోక సముద్రంలో మునిగిపోయారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన శ్రీవెంకట్ తల్లిదండ్రులు పశుపతినాథ్, గిరిజ నగరంలోని తిరుమలగిరి టీచర్స్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. ఏడాది క్రితం వారు డాలస్‌లోని తమ కుమారుడి వద్దకు వెళ్లారు. అప్పట్నుంచీ అక్కడే ఉన్నారు. ఇక.. తేజస్విని తల్లిదండ్రులు రవి, అనిత కొంపల్లిలోని ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రమాదం గురించి తెలియగానే సోమవారం రాత్రి వారు అమెరికాకు బయల్దేరి వెళ్లినట్లు కాలనీవాసులు తెలిపారు. తేజస్విని అన్నయ్య కూడా అమెరికాలోనే స్థిరపడినట్టు సమాచారం.



మంటల్లో కాలిపోతున్న శ్రీవెంకట్ కారు

సిద్దిపేట 'ప్రజావాణి'లో రైతు ఆత్మహత్యాయత్నం

» భూ సమస్యను పరిష్కరించడంలేదని ఆరోపణ



సిద్దిపేట కలెక్టరేట్‌కు డీజిల్ ప్యాకెట్‌తో వస్తున్న రైతు ఎల్లారెడ్డి

సిద్దిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తన భూ సమస్యను పరిష్కరించడం లేదంటూ సిద్దిపేట కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఓ రైతు డీజిల్ ప్యాకెట్‌తో రావడం కలకలం రేపింది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన రైతు చిలుపూరి ఎల్లారెడ్డి (70)కి 12 ఎకరాల వారసత్వపు భూమితో పాటు సొంతంగా కొనుగోలు చేసిన 18 ఎకరాల భూమి ఉంది. వివాదాల కారణంగా వారసత్వపు భూమిని రెవెన్యూ అధికారులు గతంలో బ్లాకు లిస్టులో పెట్టారు. తర్వాత ఎల్లారెడ్డి కొనుగోలు చేసిన భూమిలో కూడా తమకు వాటా ఉందని అతడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ భూమిని కూడా అధికారులు బ్లాక్‌లిస్టులో పెట్టారు. అప్పుచేసి ఆ భూమిని కొనుగోలు చేశానని, తనకు న్యాయం చేయాలని కోరుతూ రైతు తహసీల్దార్, ఆర్‌డీవో కార్యాలయాలను ఆశ్రయించాడు. సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఐదు సార్లు దరఖాస్తులు సమర్పించాడు. తహసీల్దార్ తన భూమిని బ్లాక్ లిస్టులో నుంచి తొలగిస్తానని చెబుతూ కాలయాపన చేస్తున్నాడని, ఆర్‌డీవో వద్దకు వెళ్తే బ్లాక్ లిస్టులో నుంచి తీయడం కుదరదని చెప్పాడని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. భూమిని బ్లాక్ లిస్టులో నుంచి తీయకపోగా, పండించిన ధాన్యాన్ని కూడా ఐకేపీ కేంద్రాల్లో కొనలేదని ఆరోపించాడు.

ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై దాడులకు అవకాశం!

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాల వద్ద రక్షణ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్గాల వైఖరిపై బీజేపీ, కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీఎన్, ఆంధ్రజ్యోతి మీడియా సంస్థలపై బీఆర్‌ఎస్ నేతలు బరితెగించి వ్యవహరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఆ పార్టీని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా ఇంకా బుద్ధి రాలేదని వ్యాఖ్యానించారు. ఎన్ని గిమ్మిక్కులు చేసినా ప్రజలు తమను నమ్మకపోవడంతో అత్త మీద కోపం దుత్త మీద తీసినట్లు మీడియా సంస్థలపై దాడులకు తెగబడుతున్నారని వ్యాఖ్యానించారు. తక్షణమే మీడియా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్చరించారు. మీడియా సంస్థలు ఏదైనా తప్పుగా రాస్తే చట్టపరంగా, న్యాయపరంగా చర్యలు తీసుకోవాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు చేస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. అవసరమైతే మీడియాకు బీజేపీ రక్షణ కవచంగా నిలబడుతుందని ప్రకటించారు. ఏబీఎన్, ఆంధ్రజ్యోతి కార్యాలయాలకు అండగా నిలవాలని బీజేపీ యువ మోర్చా నేతలకు రామచందర్‌రావు పిలుపునిచ్చారు.

"బీఆర్‌ఎస్ నాయకులను హెచ్చరిస్తున్నా. ఇకపై మీడియా సంస్థలపై, అమాయక ప్రజలపై దాడులు చేశారో ఖబడ్దార్. మీ అంతు చూస్తాం. మీ లాగే మేం ఆలోచిస్తే మీ బూతు ఛానల్ టీ న్యూస్‌ను ఎప్పుడో భూస్థాపితం చేసేవాళ్లం. మీడియా సంస్థలను బీజేపీ గౌరవిస్తుంది. మాకు వ్యతిరేకంగా కథనాలు రాస్తే తప్పులుంటే సరిదిద్దుకుంటాం. కావాలని తప్పుడు వార్తలు రాస్తే చట్టపరంగా ముందుకెళ్తాం. వాక్ స్వాతంత్ర్యాన్ని గౌరవించే పార్టీ మాది" అన్నారు. మీడియా సంస్థలపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేస్తే టీ న్యూస్ అంతు చూస్తామని హెచ్చరించారు. బీజేపీ కార్యకర్తలు, మోదీ అభిమానులు తలచుకుంటే అడుగు కూడా బయట పెట్టలేరన్నారు.

ఏబీఎన్‌పై దాడిచేస్తే 2 గంటల్లోనే టీ న్యూస్‌పై ప్రతి దాడి చేస్తాం: బండి సంజయ్

జగిత్యాల జిల్లాలో మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా బీఆర్‌ఎస్ నేతలపై విరుచుకుపడ్డారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై దాడి చేస్తే బీఆర్‌ఎస్‌కు చుక్కలు చూపిస్తామని అన్నారు. "మీరు తలచుకుంటే పది ఇరవై మంది వస్తారు. యువ మోర్చా కార్యకర్తలు వందల మంది ఉన్నారు. మీ గుండాయిజం తెలంగాణలో నడవనివ్వం" అన్నారు.



ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా సంపాదకీయం రాస్తే పేపర్, టీవీపై దాడి చేసేందుకు సిద్ధమవుతున్నట్లు పోలీసుల నుంచి సమాచారం వచ్చిందని సంజయ్ తెలిపారు. మహా టీవీపై దాడి చేసినప్పుడే రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తే ఈ రోజు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. తెలంగాణ కేసీఆర్, కేటీఆర్ జాగీర్ కాదని, వాడు, వీడు అని మాట్లాడితే కాంగ్రెస్ వాళ్లు ఊరుకుంటారేమో గానీ, తాము మాత్రం రోడ్ల మీద బీఆర్‌ఎస్ నేతల కాన్వాయ్ కూడా తిరగనివ్వబోమని హెచ్చరించారు. తెలంగాణ వచ్చాక వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయని కేసీఆర్‌ను ప్రశ్నించారు. "ఉద్యమంలో కేసీఆర్, కేటీఆర్‌లు లాఠీ దెబ్బలు తిన్నారా, జైలుకు వెళ్లారా? ఇయాల వేల కోట్లు సంపాదించి దుబాయి, మస్కట్‌లో వ్యాపారాలు చేస్తోంది నిజం కాదా?" అన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఫైనాన్స్ పైసలు కట్టలేకపోతే కేసీఆర్ కారును గుంజుకుపోయారన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం తమతో పాటు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' మద్దతిస్తూ కేసీఆర్ కుటుంబం ఎన్ని తప్పులు చేసినా బాహాటంగా మద్దతిచ్చిందని చెప్పారు. ఉద్యమకాలంలో కేసీఆర్‌ను హీరోను చేసింది ఆంధ్రజ్యోతేనన్నారు. నేడు ఆయన చేసిన తప్పులను ఎత్తిచూపితే దాడులకు తయారవుతారా? అని ప్రశ్నించారు. దాడి అనగానే లోపలేయకుండా సీఎం ఏం చేస్తున్నారు? అన్నారు. టెన్త్ హిందీ పేపర్ లీక్ పేరుతో తనను, డ్రోన్ ఎగరేశారనే సాకుతో రేవంత్‌రెడ్డిని గతంలో జైల్లో వేసి బెయిల్ రాకుండా చేశారని ప్రస్తావించారు. రేవంత్‌రెడ్డి పౌరుషం ఎటు పోయిందని, ఎందుకు కుమ్మక్కయ్యారని ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి మీద దాడి చేస్తే 2 గంటల్లోపే టీ న్యూస్‌పై దాడి తప్పదని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇప్పటికే బీజేవైఎం కార్యకర్తలను ఆదేశించారని చెప్పారు. తాను హోంమంత్రిగా ఈ మాటలు చెప్పకూడదని, కానీ కాంగ్రెస్ ఉద్దేశ పూర్వకంగా బీఆర్‌ఎస్‌తో రాజీ పడుతున్న నేపథ్యంలో ఏ మీడియా సంస్థ మీద దాడి జరిగినా మీడియాకు తాము అండగా ఎదురు దాడి చేస్తామని పార్టీ అధ్యక్షుడు చెప్పిన మాటను గుర్తు చేస్తున్నానని అన్నారు. బీజేపీ కార్యకర్తలు కిరాయి ఇస్తే వచ్చే వాళ్లు కాదని, సిద్ధాంతాన్ని నమ్ముకొని తీవ్రవాదులకు వ్యతిరేకంగా కొట్లాడిన వాళ్లమని చెప్పారు. రాజకీయ పార్టీ కార్యాలయంలో న్యూస్ ఛానల్‌ను ఎలా కొనసాగిస్తున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు.



ఆంధ్రజ్యోతికి మద్దతుగా టీవీ చానల్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న బీజేవైఎం నాయకులు

పింకీల పైశాచిక ఆనందం: చనగాని

ఆంధ్రజ్యోతి పత్రికలను దహనం చేయడం.. పింకీల పైశాచిక ఆనందనానికి నిదర్శనమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌గౌడ్ అన్నారు. రాధాకృష్ణ కొత్త పలుకులో అన్నీ వాస్తవాలే రాశారని చెప్పారు. వరుసగా ఎన్నికల్లో ఓటమి పాలైనా బీఆర్‌ఎస్ నేతలకు అహంకారం ఇంకా తగ్గలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీడియా స్వేచ్ఛను కాపాడుతుందని చెప్పారు.

కేటీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు: అద్దంకి దయాకర్

తెలంగాణ ఉద్యమ సమయంలో.. ఉద్యమానికి, టీఆర్‌ఎస్ పార్టీకి ఏబీన్ ఆంధ్రజ్యోతి సహకరించిందని, ఉద్యమంలో ఉన్న తమకు అది తెలుసునని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. మీడియా అనుకూలంగా ఉంటే.. పూలదండలు, లేకుంటే దాడులు చేస్తామంటే కేటీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మీడియాపై రెచ్చగొట్టేలా బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న ప్రకటనల వెనుక రాజకీయ దురుద్దేశం ఉందన్నారు. వారి అక్రమాలపై ఎవరూ మాట్లాడకుండా చేసే ప్రయత్నంలో భాగంగానే ఇదంతా జరుగుతోందని వ్యాఖ్యానించారు. కేటీఆర్ ట్రాప్‌లో పడొద్దని, ఆయన మాటలు విని క్రెడిబిలిటీ పోగొట్టుకోవద్దని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సూచించారు.

తప్పులు ఎత్తి చూపితే ఆంధ్రా పత్రికలా?: ఆది శ్రీనివాస్

తెలంగాణలో బీహార్ తరహా రౌడీయిజాన్ని బీఆర్‌ఎస్ నేతలు ప్రోత్సహిస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఆ పార్టీ తప్పుడు విధానాలను ఎత్తి చూపితే ఆంధ్రా పత్రికలంటూ మాట్లాడుతున్నారన్నారు. మీడియాపై దాడి చేసిన వారిని తప్పు పట్టకుండా ఇంకా దాడులు చేస్తామంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. టీఆర్‌ఎస్ పేరును బీఆర్‌ఎస్‌గా మార్చినపుడే ప్రజల గుండెల్లో నుంచి ఆ పార్టీ పోయిందన్నారు.

పంచనామా నివేదికకు రూ.70వేల లంచం డిమాండ్

» డిప్యూటీ తహసీల్దార్‌ను అరెస్టు చేసిన ఏసీబీ

నల్లగొండ క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జప్తు చేసిన వాహనాల పంచనామా నివేదిక ఇవ్వడానికి రూ.70 వేల లంచం డిమాండ్ చేసిన డిప్యూటీ తహసీల్దార్ షేక్ జావీద్‌ను నల్లగొండలో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. గత మే నెలలో మిర్యాలగూడ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న 2 మినీ లారీలు, ఒక కారును పౌర సరఫరాలశాఖ జప్తు చేసింది. వాటి విడుదలకు అదనపు కలెక్టర్ కోర్టు రిలీజ్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుంది. అందుకవసరమైన పంచనామా నివేదిక ఇవ్వడానికి వాహనాల యజమానిని డిప్యూటీ తహసీల్దార్(పౌర సరఫరాల శాఖ) షేక్ జావీద్ రూ.లక్ష డిమాండ్ చేశాడు. అంత డబ్బు ఇవ్వలేనని వాహనాల యజమాని వేడుకుంటే, రూ.70 వేలు ఇవ్వమని పట్టుబట్టాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వాహనాల యజమానిని లంచం అడిగినట్లు నిర్ధారించుకున్న ఏసీబీ అధికారులు సోమవారం నల్లగొండ పట్టణ శివారుల్లో జావీద్‌ను అరెస్టు చేశారు. అనంతరం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చినట్లు ఏసీబీ నల్లగొండ రీజియన్ డీఎస్పీ జగదీష్ చంద్ర సోమవారం మీడియాకు వెల్లడించారు. ఇదిలా ఉంటే, తనకు లాంగ్ లీవ్ కావాలంటూ గత ఏప్రిల్ 29 నుంచి ఇంటి వద్దే ఉంటున్న జావీద్‌కు అనుమతి నిరాకరించిన ఉన్నతాధికారులు పది రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. అయినా స్పందించక పోవడంతో గత నెల 27న ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.

నలుగురు విదేశీయుల దేశ బహిష్కరణ

రాంగోపాల్‌పేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వీసా గడువు ముగిసినప్పటికీ చట్ట విరుద్ధంగా దేశంలోనే ఉంటూ మాదక ద్రవ్యాల సరఫరాకు పాల్పడుతోన్న నలుగురు విదేశీయులను దేశం నుంచి బహిష్కరించినట్లు హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్ న్యూ) పోలీసులు వెల్లడించారు. టూరిస్ట్ వీసాపై భారత్‌కు వచ్చి బంజారాహిల్స్‌లో నివాసముంటోన్న టాంజనియాకు చెందిన మ్వజుమ అల్మాసి మసిసిలా(30) డ్రగ్స్ చేస్తోందన్న అనుమానంతో నిఘా పెట్టగా.. నైజీరియాకు చెందిన ముగ్గురు సభ్యుల డ్రగ్స్ ముఠాతో సంబంధాలు ఉన్నాయని తేలింది. వారిని బ్లాక్‌లిస్ట్ చేసి, దేశంలోకి తిరిగి ప్రవేశించకుండా నిషేధం విధించారు. సోమవారం టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో డీసీపీ సుధీంద్ర మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే 8712661601 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వేతనాలు రాక మనోవేదన.. గుండెపోటుతో ఉపాధి హామీ ఏపీవో మృతి

» జనగామ జిల్లా పాలకుర్తిలో ఘటన



శ్రీనివాస్ (ఫైల్)

పాలకుర్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి) : మూడు నెలలుగా వేతనాలు అందక మనోవేదనకు గురైన ఉపాధి హామీ పథకం ఏపీవో గుండెపోటుతో మృతి చెందారు. ఈ ఘటన సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో జరిగింది. పాలకుర్తికి చెందిన కమ్మగాని శ్రీనివాస్(45) దేవరుప్పుల మండల ఏపీవోగా రెండు దశాబ్దాలుగా పని చేస్తున్నారు. మూడు నెలలుగా వేతనాలు అందక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. అప్పటి నుంచి మనోవేదనకు గురయ్యారు. సోమవారం రోజులాగే జనగామ రోడ్డులో వాకింగ్‌కు వెళ్లిన ఆయనకు గుండెపోటు రావడంతో కుప్పకూలాడు. స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని ఈజీఎస్ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు అంత్యక్రియలకు తీసుకెళ్లమని పట్టుబట్టారు. డీఆర్‌డీవో పీడీ వసంత వారికి నచ్చజెప్పి, శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థికసాయం అందచేశారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

ఆదివాసీల ఇళ్లకు విద్యుదీకరణ

» వ్యయంలో రూ.2.88 కోట్ల కేంద్ర గ్రాంటు

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 10 జిల్లాల్లోని 112 ఆవాస ప్రాంతాల్లో ఉన్న 1987 ఆదివాసీల ఇళ్లకు ధార్తి అబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద రూ.5.21 కోట్లతో విద్యుదీకరణ చేయాలని దక్షిణ డిస్కమ్ నిర్ణయించింది. దీనికోసం రూ.2.88 కోట్లను కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌గా ఇవ్వనుంది. ఈ పథకం అమలు కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ని నోడల్ ఏజెన్సీగా ఏర్పాటు చేశారు. విద్యుదీకరణ కోసం 6.3 కేవీ, 11కేవీ సామర్థ్యం కలిగిన హెచ్‌టీ లైన్లతో పాటు 67 కి.మీ. మేర ఎల్‌టీ లైన్లు వేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా 25 కేవీఏ సామర్థ్యం కలిగిన 115 డీటీఆర్‌లు సమకూర్చనున్నారు. ఈ మేరకు పరిపాలనపరమైన అనుమతినిస్తూ డిస్కమ్ సీఎండీ ఉత్తర్వులు ఇచ్చారు.

భద్రాద్రి రామయ్య భూముల్లో ఆగని ఆక్రమణలు

» ఏపీలోని పురుషోత్తమపట్నంలో ఉన్న దేవస్థానం భూముల్లో అక్రమంగా ఇంటి నిర్మాణం

» అడ్డుకోవడానికి వెళ్లిన అధికారులకు బెదిరింపులు

» తెలంగాణ వాళ్లు రావొద్దని హెచ్చరిక



ఆలయ భూముల్లో అక్రమంగా చేపట్టిన నిర్మాణం

భద్రాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం పుణ్యక్షేత్రానికి సమీపంలో ఏపీ పరిధిలో ఉన్న భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ భూముల్లో ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నంలో దేవస్థానం భూముల్లో ఆక్రమణదారులు ఇంటి నిర్మాణం చేపట్టారు. అడ్డుకోవడానికి సోమవారం దేవస్థానం ఇబ్బంది వెళ్లగా "నిర్మాణాలు ఆపేది లేదు.. ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ ఆక్రమణదారులు తెగేసి చెప్పారు. "తెలంగాణ అధికారులు మా భూముల్లోకి రావద్దు" అంటూ బెదిరించారు. దేవస్థానం సిబ్బందిని ఆ ప్రాంతం నుంచి వెళ్లగొట్టే యత్నం చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని యటపాక రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు సరిగా స్పందించలేదని దేవస్థానం వర్గాలు వాపోతున్నాయి. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ సమస్యపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పట్టనట్లు వ్యవహరిస్తుండటం పట్ల రామ భక్తుల నుంచి ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

స్వర్ణకారులూ ఆత్మహత్యలు చేసుకోవద్దు

» 411 చట్ట సవరణకు పోరాటం: కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో స్వర్ణకారులు ఆత్మహత్యలకు పాల్పడటం తనను కలచివేసిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. దొంగ బంగారం కొన్నారని పోలీసులు స్వర్ణకారులపై కేసులు పెట్టి వేధిస్తున్నారని, ఆ బంగారం అమ్మిన దొంగలను మాత్రం పట్టుకోలేకపోతున్నారని ఆరోపించారు. తన నివాసంలో ఆమె సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థల ప్రవేశంతో ఆయా వృత్తులకు ఆదరణ తగ్గిపోయిందని, కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్వర్ణకారులతోపాటు అన్ని చేతివృత్తులవారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తెలంగాణతోపాటు ఏపీలోనూ 411 చట్టం కింద కేసులు పెట్టి స్వర్ణకారులను వేధించడం తగదన్నారు. స్వర్ణకారులను వేధింపులకు గురిచేస్తున్న 411 చట్టానికి సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీగా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా, బీసీల కోసం ఉద్యమిస్తున్న నాయకురాలిగా ఈ చట్టం సవరణ కోసం పోరాడుతానన్నారు. పోలీసుల వేధింపులు తట్టుకోలేక స్వర్ణకారులు ఆత్మహత్య చేసుకోవడం తగదని, ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవాలన్నారు. అదేవిధంగా కొందరు పోలీసుల పేరు చెప్పి స్వర్ణకారులను వేధిస్తున్నారని, అలాంటి నకిలీలు ఇబ్బంది పెడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రేమోన్మాది కిరాతకం

» యువతి మెడకోసి హత్య

» ఘటనాస్థలంలోనే యువతి మృతి

» తర్వాత తానూ ఆత్మహత్యాయత్నం

» పెళ్లి నిరాకరించినందుకే ఘాతుకం

» ఆరు నెలల క్రితం ప్రవీణ్‌ను హెచ్చరించిన రమ్య తల్లిదండ్రులు





రమ్య(ఫైల్), ఆత్మహత్యాయత్నం చేసిన ప్రవీణ్

రామచంద్రాపురం టౌన్, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): ప్రేమ త్యాగం కోరుతుంది.. తన ఇష్టసఖి బాగుండాలని ప్రేమికులు కోరుకుంటారు.. కానీ, చదువైపోయిన తర్వాతే పెళ్లి సంగతి ఆలోచిస్తానని చెప్పిన ప్రేమికురాలి గొంతు కోసి కిరాతకంగా హత్య చేసిన ప్రేమోన్మాది ఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని విజయనగరం జిల్లా బొబ్బిలి ప్రాంత వాసి బొత్స శ్రీనివాసరావు 25 ఏళ్ల క్రితమే పటాన్‌చెరుకు వలస వచ్చి బండ్లగూడ గ్రామంలో నివసిస్తున్న శ్రీనివాసరావు, ఆయన భార్య ఈశ్వరమ్మ ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నారు. చందానగర్ ప్రగతి కాలేజీలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న వారి కూతురు రమ్య (23), పటాన్‌చెరులో ఉంటూ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న మెదక్‌జిల్లా మన్నేపల్లి వాసి ప్రవీణ్ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. సోమవారం మధ్యాహ్నం రమ్య తల్లిదండ్రులు ఇంట్లో లేరని నిర్ధారించుకున్న ప్రవీణ్.. లోపలికెళ్లి పెళ్లి చేసుకోమని అడిగాడు. చదువు పూర్తయ్యాక పెళ్లి సంగతి ఆలోచిస్తానని ఆమె చెప్పడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకున్నది. ప్రవీణ్ ముందే వెంట తెచ్చుకున్న కత్తితో రమ్య గొంతు కోసి కిరాతకంగా హత్య చేశాడు. తర్వాత తానూ ఆత్మహత్యాయత్నం చేశాడు. అదే సమయంలో ఇంటికొచ్చిన తల్లి ఈశ్వరమ్మ గేటు లోపలి నుంచి తాళం వేసి ఉండటంతో చాలా సేపు పిలిచినా జవాబు రాకపోవడంతో భర్తకు ఫోన్ చేసి చెప్పింది. ఆయన ఇంటి వద్ద కొచ్చి గోడ దూకి లోపలికెళ్లి చూడగా, గదిలో మంచంపై రమ్య, ప్రవీణ్ రక్తపు మడుగులో ఉన్నారు. రమ్య అప్పటికే మరణించగా, కొన ఊపిరితో ఉన్న ప్రవీణ్‌ను స్థానికులు 108 అంబులెన్సులో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. రమ్య తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆరు నెలల క్రితం రమ్య తల్లిదండ్రులను కలిసిన ప్రవీణ్ ఆమెను తనకిచ్చి పెళ్లి చేయమని కోరాడు. కానీ, తమ కూతురు వైపు మళ్లీ చూస్తే బాగుండదని వారు హెచ్చరించి పంపారు. అటుపై రమ్యకు పెళ్లి సంబంధాలు వెతుకుతున్నారు. దీంతో ఆగ్రహించిన ప్రవీణ్.. ఆమెతో ఘర్షణకు దిగి.. హతమార్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఫ్యాన్‌కు టవల్ చుట్టి చిన్నారి ఆట.. మెడకు చుట్టుకొని మృతి

» సంగారెడ్డి జిల్లా చిట్కుల్‌లో ఘటన

పటాన్‌చెరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఫ్యాన్‌కు టవల్‌ను చుట్టి ఆడుకుంటున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు అది మెడకు చుట్టుకొని మృతి చెందింది. ఈ విషాద ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో సోమవారం జరిగింది. చిట్కుల్‌కు చెందిన వడ్ల నర్సింహులు, లత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. సోమవారం తల్లిదండ్రులు జిన్నారం బీసీ హాస్టల్‌లో చదువుతున్న పెద్ద కుమార్తెను చూసేందుకు వెళ్లగా, ఇంట్లో చిన్న కూతురు సహస్ర (6), కుమారుడు గణేశ్ ఉన్నారు. వారికి తోడుగా వారి నాయనమ్మ ఉంది. విద్యుత్ పోవడంతో నాయనమ్మ బయట కూర్చోగా సహస్ర తమ్ముడితో కలిసి స్టూల్ వేసుకొని ఇంట్లోని ఫ్యాన్‌కు టవల్‌ను చుట్టి ఆడుకుంటోంది. ఈ క్రమంలో విద్యుత్ రావడంతో ఫ్యాన్ తిరిగింది. దాంతో టవల్ సహస్ర మెడకు బిగుసుకుపోయి ఊపిరాడక మృతి చెందింది. ఇంట్లోంచి అరుపులు వినిపించడంతో నాయనమ్మ వచ్చి ఫ్యాన్ ఆపు చేసి సహస్రను కిందకు దింపింది. అయితే అప్పటికే బాలిక మృతి చెందింది. తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం సహస్ర మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

చిన్నమ్మే హంతకురాలు..

» కోరుట్ల చిన్నారి హత్య కేసులో నిందితురాలి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

కోరుట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల చిన్నారి హితీక్ష (5) హత్య కేసు మిస్టరీ వీడింది. ఆ బాలికను చంపింది (బాబాయ్ భార్య) చిన్నమ్మ మమతేనని పోలీసులు నిర్ధారించారు. హత్యకు వాడిన కత్తి, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకొని ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సోమవారం కోరుట్ల సీఐ సురేశ్ బాబు తెలిపారు. కోరుట్ల ఆదర్శనగర్‌లో ఐదేళ్ల బాలికను గొంతు కోసి చంపి పక్కింటి బాత్రూంలో పడవేసిన ఘటన శనివారం కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సీసీటీవీ ఫుటేజ్, ఫోన్ డేటాను ఆధారంగా చేసుకొని ఆదివారమే మమతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో ఆమెను విచారించగా.. నేరం అంగీకరించింది. తోడి కోడలు నవీనపై కోపంతోనే ఆమె కూతురు హితీక్షను మమత హత్య చేసిందని పోలీసులు వెల్లడించారు. హితీక్ష తండ్రి రామ్, బాబాయ్ లక్ష్మణ్, తాత మదన్ గల్ఫ్ దేశానికి ఉపాధి నిమిత్తం వెళ్లి వస్తుంటారని.. నవీన, మమత తమ పిల్లలతో అత్త వద్దే ఉండేవారని తెలిపారు.

తాగుడుకు అడ్డొస్తోందని.. కన్న కూతురిని చంపిన తల్లి

» ఐదు నెలల పసికందును గొంతు నులిమి హత్య

» నిజామాబాద్ జిల్లాలో దారుణం

భీమ్‌గల్ రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఆ తల్లి తాగుడుకు అడ్డొస్తోందని ఏకంగా తన కన్న కూతురినే హతమార్చింది. ఈ దారుణ ఘటన నిజామాబాద్ జిల్లాలో సోమవారం వెలుగు చూసింది. భీమ్‌గల్ మండలం గోన్‌గొప్పులకు చెందిన గంగోని మల్లేశ్, రమ్యకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఐదు నెలల కూతురు శివాని ఉంది. అయితే, ఇటీవల కాలంలో రమ్య కల్లుకు బానిసయింది. భర్త మల్లేశ్.. తీరు మార్చుకోవాలంటూ భార్యకు హితవు పలికాడు. ఆమె మారకపోవడంతో వారం రోజుల క్రితం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఇరుకుటుంబాల పెద్దలు సర్దిచెప్పి పంపారు. అయినా రమ్య మద్యం మత్తులో బిడ్డను నిర్లక్ష్యం చేస్తుండడంతో రెండు రోజుల క్రితం మరోమారు భార్యాభర్తల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ జరిగింది. తాగుడు మానుకోవాలని, బిడ్డను పట్టించుకోవాలని భర్త మందలించాడు. దీంతో తన కూతురి వల్లే ఇదంతా జరుగుతోందని భావించిన రమ్య, తన బిడ్డ అడ్డును తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. గత ఆదివారం భర్త మల్లేశ్ బయటకు వెళ్లగా ఇదే అదునుగా భావించి చిన్నారి శివాని గొంతు నులిమి హత్య చేసింది. జరిగిన దారుణం గురించి మల్లేశ్.. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు రమ్యను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని భీమ్‌గల్ ఎస్సై తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అనుమానాస్పదం!

బిహార్‌లో నాలుగునెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ తీవ్ర రాజకీయ దుమారం రేపింది. 'ప్రత్యేక సమగ్ర సవరణ' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్) పేరుతో ఈసీ సాగిస్తున్న ఈ ప్రక్షాళన కార్యక్రమాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తూ లాలూ యాదవ్ పార్టీ ఆర్జేడీతో పాటు అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), తృణమూల్ నేత మహువా మొయిత్రా, యోగేంద్రయాదవ్ ఇత్యాదులు పిటిషన్లు వేశారు. భారతరాజ్యాంగంలోని పలు అధికరణలను, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని పలు నిబంధనలను జూన్ 24న ఈసీ జారీ చేసిన ఆదేశాలు ఉల్లంఘిస్తున్నందున వాటిని రద్దుచేయాలన్నది ఈ పిటిషన్ల సారాంశం. స్వల్పవ్యవధిలో పౌరులు తమ ఉనికినీ, నివాసాన్నీ రుజువుచేసుకోలేక ఆఖరుకు లక్షలాదిమంది ఓటుహక్కు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతోందని పిటిషన్‌దారులు సర్వోన్నత న్యాయస్థానానికి తెలియచేశారు. గురువారం అత్యవసర విచారణకు అంగీకరించిన కోర్టు, అంతవరకూ 'సర్' మీద స్టే విధించడానికి మాత్రం ఒప్పుకోలేదు. మోదీ ప్రభుత్వం అమితంగా ఆధారపడే, ప్రతీ సంక్షేమంతోనూ అనుసంధానించే ఆధార్ కార్డు కానీ, ఎన్నికల సంఘం స్వయంగా జారీ చేసిన ఓటరు గుర్తింపుకార్డు కానీ ఈ 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'లో పౌరులు సమర్పించాల్సిన అధీకృత డాక్యుమెంట్ల జాబితాలో లేవు.

కోర్టులో సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని కాబోలు, బిహార్ ఓటర్లకు ఆదివారం ఈసీ కొన్ని సూచనలు చేసింది. జూలై 25కల్లా అధీకృత డాక్యుమెంట్లు చూపించకుంటే ఓటర్లను జాబితానుంచి తొలగిస్తానని ఈసీ అంటోందని విపక్షాలు విమర్శిస్తున్న నేపథ్యంలో, ఆదివారం కొన్ని పత్రికల్లో హిందీలో ప్రకటనలు విడుదలచేసింది. 'బూత్‌స్థాయి అధికారి మీకు అందించిన ఎన్యుమరేషన్ ఫారమ్ నింపి డాక్యుమెంట్లు, ఫోటో జతచేసి ఇవ్వండి. సమర్థింపు పత్రాలు సిద్ధంగా లేనిపక్షంలో నింపిన ఫారమ్ ఇచ్చేస్తే సరిపోతుంది. తగిన డాక్యుమెంట్లు ఉంటే, దరఖాస్తును ప్రాసెస్ చేయడం సులువు, లేనిపక్షంలో అంతిమంగా సదరు అధికారి స్థానికంగా విచారించి ఏ నిర్ణయమూ తీసుకుంటాడు' అన్నది ఆ ప్రకటన సారాంశం. ఉపరితలంలో ఏదో మినహాయింపు, వెసులుబాటుగా కనిపిస్తున్నా ఈసీ చెప్పదల్చుకున్నదేమిటో అర్థమవుతూనే ఉంది.

2003లో 'సర్' జరిగింది కనుక, ఆ తరువాత ఓటర్ల జాబితాలో చేరివచ్చినవారి పుట్టుపూర్వోత్తరాలని పరీక్షించి, అర్హులు కానివారిని ఏరివేయడం ఈసీ ఉద్దేశం. ఆర్జేడీ, కాంగ్రెస్ ఓటుబ్యాంకు అయిన దళితులు, ప్రధానంగా ముస్లింలను ఏరివేయడం లక్ష్యంగా ఇది ఆరంభమైందని ఆ పార్టీలు అంటాయి. మయన్మార్, బంగ్లాదేశ్‌ల నుంచి బిహార్‌కు అక్రమవలసలు అత్యధికంగా జరిగిపోతూ, మరోపక్క లక్షలాది మంది బిహారీ యువకులు ఇతర రాష్ట్రాలకు ఉపాధికి వలసపోతున్న తరుణంలో జాబితాను ప్రక్షాళించకపోతే ఎలా అన్నది ఈసీ, దాని సమర్థకుల వాదన. 2003 జనవరి 1 తరువాత జాబితాలోకి ఎక్కినవారినందరినీ ఈసీ అనుమానిస్తున్నదని అర్థం. అంతేనా, ఆనాటినుంచి నేటివరకూ జరిగిన ఐదు పార్లమెంట్, ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో వీరంతా అక్రమంగా ఓటేశారని కూడా ఒప్పుకున్నట్టే. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో వినియోగించిన ఓటర్ల జాబితాలనే ఏడాదికాలంగా చేర్పులూ తొలగింపులతో అప్‌డేట్ చేసుకుంటూ పోయి, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వాటినే వాడటానికి గతనెలలోనే కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు తీర్మానించుకున్న తరువాత, హఠాత్తుగా ఈసీకి ఈ బుద్ధి ఎందుకు పుట్టిందో తెలియదు. రెండు దశాబ్దాలనాటి 'సర్' ఏడాదిపాటు కొనసాగడమే కాదు, నిర్దిష్టకాలపరిమితిలో ఓటర్లుగా నమోదైనవారిని ఇలా అనుమానించిందీ లేదు. సిద్ధం చేసిన జాబితాలో అనుమానాస్పద అంశాలేమీ లేవని స్థానిక అధికారులు చెబుతున్నప్పటికీ, బీజేపీ వ్యతిరేక ఓటర్ల ఏరివేత లక్ష్యంగానే కేంద్ర ఎన్నికల సంఘం హఠాత్తుగా ఈ నిర్ణయానికి వచ్చిందని విపక్షాల విమర్శ. ఇంటింటికీ పోయి సర్వేలు చేయడం నుంచి, జాబితాలు సిద్ధం చేయడం వరకూ సమస్తమూ రెండునెలల్లోనే చక్కబెట్టగల వ్యవస్థ తన దగ్గర ఉన్నదనీ, వేలాదిమందిని రంగంలోకి దించానని ఈసీ చెప్పుకుంటోంది. కానీ, కొత్తగా ఓటర్లయిన దాదాపు మూడు కోట్లమంది బిహారీల్లో ఎంతమంది తమ పుట్టుక, ఊరు, చదువుతో పాటు, తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రాలనూ చూపించి 1955నాటి జాతీయ పౌరసత్వ చిట్టా (ఎన్ఆర్‌సి) నిర్దేశించిన రీతిలో తమ పౌరసత్వాన్ని ఇంత స్వల్పకాలంలో రుజువుచేసుకోగలరన్నది ప్రశ్న.

'ఉపాధి హామీ'పై పరిమితి, పేదలకు నష్టం

ఉపాధి ఆదాయం కోసం మాత్రమే కాదు, అది మానవ గౌరవానికి సంబంధించింది.

– జీన్ డ్రెజ్, ఆర్థిక శాస్త్రవేత్త

ఇలాంటి గౌరవాన్ని కాపాడడమే లక్ష్యంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరెగా) రూపొందింది. ఒక కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల పనిని హామీ ఇచ్చే ఈ చట్టాన్ని భారత సుప్రీంకోర్టు సామాజిక న్యాయానికి ఆలంబనగా నిలిచిన చట్టంగా అభివర్ణించగా, ప్రపంచంలో అతిపెద్ద పని హామీ పథకంగా 'గ్రామీణ ఉపాధి'ని ప్రపంచ బ్యాంకు గుర్తించింది.

కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఈ పథకాన్ని బలహీనపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉండటం, వేతనాల చెల్లింపుల్లో కావాలనే ఆలస్యం చేయడం, సాంకేతిక జోక్యాల పేరుతో కార్మికులపై భారం వేయడం... ఇవన్నీ దీని లక్ష్యాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా నరెగాకి సంబంధించి ఇటీవల కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం ఈ పథకాన్ని పూర్తిగా నిస్సారంగా మార్చే ప్రమాదాన్ని కలిగిస్తోంది. ఆ నిర్ణయం ఏమిటి? దాని ప్రభావం కార్మికులపై ఎలా ఉండబోతుంది అనే అంశాలను చర్చిద్దాం. చర్చలోకి వెళ్లేముందు నరెగా ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కొన్ని ప్రాథమిక విషయాలు మననం చేసుకుందాం.

నరెగా– ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే కార్యక్రమం. అయితే ఆర్థిక సంవత్సరం మొదట్లో ఆ సంవత్సరంలో ఉపాధి హామీలో పని డిమాండ్ ఎలా ఉంటుందో తెలియదు కాబట్టి, కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్లో అంచనాగా ఆ నిధులు కేటాయిస్తుంది. మునుపటి సంవత్సరపు నిధుల వినియోగం, రాష్ట్రాల నుంచి వచ్చే అభ్యర్థనలు దృష్టిలో ఉంచుకుని ఈ కేటాయింపు జరుగుతుంది. అయితే కేటాయించిన నిధులు ఖర్చు కాగానే, రాష్ట్రాలు అదనపు నిధుల కోసం కేంద్రాన్ని ఆశ్రయిస్తాయి. ఆ అభ్యర్థనలు పరిశీలించి కేంద్రం అదనపు నిధులు విడుదల చేస్తుంది. అంటే సిద్ధాంత పరంగా ఉపాధి హామీ బడ్జెట్ క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులకు గల డిమాండ్‌పై ఆధారపడి ఉంటుంది. ఇంకొక రకంగా చెప్పాలంటే అసలు ఉపాధి హామీ బడ్జెట్‌ను కట్టడి చేయడం చట్ట మూల సూత్రాలకు వ్యతిరేకం.

అసలు విషయానికి వస్తే, ఈ సంవత్సరం మే 29న కేంద్ర ఆర్థిక శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖకు ఒక అధికారిక లేఖ (ఆఫీస్ మెమొరాండం) జారీ చేసింది. అందులో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి అర్ధ సంవత్సరం (ఏప్రిల్–సెప్టెంబర్)లో నరెగా కోసం కేటాయించిన వార్షిక బడ్జెట్లో 60 శాతం వరకే ఖర్చు చేయాల్సిందిగా సూచించింది. ఈ నిర్ణయానికి వెనుక ఉన్న కారణాలను కేంద్రం స్పష్టంగా, బహిరంగంగా వెల్లడించలేదు. అయితే లేఖలో మాత్రం ఇది ఆర్థిక నిర్వహణపరమైన నిర్ణయమని మాత్రమే రేఖామాత్రంగా పేర్కొంది. కానీ ఈ నిర్ణయం పలు సమస్యలకు దారితీయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు; ఇందుకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అనుభవాలను ఉదాహరణలుగా చూపుతున్నారు.



తెలుగు రాష్ట్రాలలో ఉపాధి హామీలో అధిక శాతం పనులు వేసవి నెలల్లో జరుగుతాయి. కేంద్రం తీసుకువచ్చిన కొత్త నిబంధనల వల్ల ప్రధానంగా తెలుగు రాష్ట్రాలలోని పేద ప్రజలు నష్టపోయే అవకాశం ఎక్కువ. గ్రామీణ పేదల హక్కులను కాలరాసే, వారి జీవనోపాధిని దెబ్బతీసే కొత్త నిబంధనలపై ప్రభుత్వం తిరిగి సమీక్షించాలి. లేకపోతే ప్రధాని నిత్యం వల్లించే 'మంచి ఉద్దేశంతో కూడిన మంచి పాలన' నినాదం నీటిమీద రాతగా మిగులుతుంది.

మొదటిగా, ఈ కొత్త విధానంలో ముఖ్యమైన అంశం– క్షేత్రస్థాయి అవసరాలతో సంబంధం లేకుండా, సంవత్సరం ప్రారంభంలోనే అంచనాల ఆధారంగా నరెగా నిధుల వినియోగాన్ని పరిమితం చేయడం. దీని ప్రకారం, నరెగా ఖర్చును ముందస్తుగా నియంత్రించాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఉందని అనుమానించక తప్పదు. ఈ అనుమానానికి కారణాలు ఉన్నాయి.

ప్రతి ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్లో కేటాయించిన మొత్తం ఖర్చయిన తర్వాత, అదనంగా నిధులు మంజూరు చేయడం సాధారణంగా అనుసరించే విధానం. కానీ గత దశాబ్దంలో తొలిసారిగా, 2024–25లో, కేటాయించిన మొత్తం ఖర్చు అయినప్పటికీ, కేంద్రం అదనపు నిధులు విడుదల చేయలేదు. అంతేకాకుండా, గత సంవత్సరం ఎక్కువగా పనులు నమోదవుతున్న తెలుగు రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో 'నియమాల ఉల్లంఘన' అనే పేరుతో ఉపాధి హామీ పనులకు అడ్డంకులు కలిగించింది.

నిజానికి ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో గ్రామీణులు పని కోసం దరఖాస్తు చేసుకున్నా, వారికి పని లభించడం లేదని, పథకం అమలుచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పని డిమాండ్‌ను కృత్రిమంగా తక్కువ చేసి చూపుతున్నారని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వం 2023–24లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో పేర్కొంది. ఇప్పుడిక ఆ పరిమితి విధించే పనిలో కేంద్రం కూడా పాలుపంచుకుంటుందని అనిపించక మానదు.

అలాగే రెండో అంశానికి వస్తే– 2025–26 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం నరెగాకు రూ.86వేల కోట్లు కేటాయించింది. ఇప్పుడు కేంద్రం తెచ్చిన నియమాల ప్రకారం, తొలుత ఆరు నెలల కాలానికి 60 శాతం మించి అంటే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రాలు రూ.51,600 కోట్ల కన్నా ఎక్కువ ఖర్చు చేయలేవు. ఉపాధి కోరితే ప్రభుత్వం పనిని కల్పించాలి అన్న నిబంధన ఉండగా, ఇప్పుడు కేంద్రం జరిపిన కేటాయింపుల పరిమితిని చూపిస్తూ పనిని నిరాకరించే అవకాశం ఉంది. ఇది నేరుగా చట్టాన్ని ఉల్లంఘించడమే.

ఇక మూడో విమర్శకు వస్తే– ఆరు నెలలకు అందుబాటులో ఉన్న 60 శాతం కేటాయింపు అంటే పైన పేర్కొన్న విధంగా రూ.51,600 కోట్ల నుంచి గత ఏడాది పెండింగ్‌లో ఉన్న రూ.18,300 కోట్ల బకాయిలను తీర్చాల్సి ఉంటుంది. అలా చేస్తే ఈ సంవత్సరంలో కొత్తగా పనికి మిగిలే మొత్తం కేవలం రూ.30,600 కోట్లు మాత్రమే. గత సంవత్సరంలో నరెగాలో ఒక కార్మికునికి ఒక్క రోజు పని కల్పించడానికి రూ.390 ఖర్చు అయ్యింది. అదే లెక్కన ఈ సంవత్సరం మొదటి ఆరు నెలల్లో కేవలం 78 కోట్ల పని దినాలు మాత్రమే కల్పించగలిగే అవకాశం ఉంది. గత సంవత్సరం మొదటి ఆరు నెలల్లో నరెగాలో 161 కోట్ల పని దినాలు నమోదు అయ్యాయి. అంతే కాకుండా ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ ఖర్చు చేయడానికి అవకాశం ఉన్న రూ.51,600 కోట్లలో 56 శాతం జూన్ 29 నాటికే ఖర్చు అయిపోయింది. ఇక మిగిలిన నాలుగు శాతం నిధులతో మిగతా మూడు నెలలు పనులు నడపాలి.

నిజానికి ఈ సంవత్సరమే కాదు, ప్రతి ఏడాది మొదటి ఆరు నెలల్లో బడ్జెట్‌లో దాదాపు 20 నుంచి 25 శాతం వరకు నిధులు గత సంవత్సరపు బకాయిల చెల్లింపునకే ఖర్చవుతున్నాయి. ఈ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఖర్చులను ముందుగానే పరిమితం చేయడం వల్ల, కార్మికులకు అవసరం అయినప్పుడు పని దొరకకుండా పోయే అవకాశం ఎక్కువగా ఉంది. కేంద్రం ఈ నిర్ణయానికి 'ఆర్థిక మేనేజ్‌మెంట్' అనే పేరు పెట్టినా, దీని వెనుక ఉన్న ప్రాతిపదిక పూర్తిగా తప్పు అవగాహనపై ఆధారపడింది. కేంద్రం తీసుకువచ్చిన కొత్త నిబంధనల వల్ల ప్రధానంగా తెలుగు రాష్ట్రాలు నష్టపోయే అవకాశం ఎక్కువ. ఎందుకంటే మొదటి ఆరు నెలల్లో తెలుగు రాష్ట్రాలలో అధికంగా ఉపాధి హామీ పనులు జరుగుతాయి. ఉదాహరణకు 2024–25లో మొదటి ఆరు నెలల్లో తెలంగాణలో 84శాతం పనులు జరగగా, ఆంధ్రప్రదేశ్‌లో 74 శాతం పనులు జరిగాయి. కారణం– మన తెలుగు రాష్ట్రాలలో ఉపాధి హామీలో అధిక శాతం పనులు వేసవి నెలల్లో జరుగుతాయి. వర్షాలు ముమ్మరంగా పడుతూ, వ్యవసాయ పనులు అందుబాటులో ఉన్నప్పుడు నరెగా కార్మికులు వ్యవసాయ పనులకు హాజరవుతారు. నరెగా పనుల్ని వేరే ఉపాధి అవకాశాలు లేనప్పుడు ఉపయోగించుకుంటారు.

మొత్తానికి కేంద్ర నిర్ణయం వల్ల ప్రధానంగా ఆదివాసీలు, దళితులతో సహా అణగారిన వర్గాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఎందుకంటే ఉపాధి పనులలో వాళ్ళే ఎక్కువగా పాల్గొంటున్నారు. ఉదాహరణకు దేశంలో ఆదివాసీల జనాభా కంటే ఉపాధి హామీ పనిదినాలలో వారి వాటా 2.5 రెట్లు ఎక్కువ. ఈ మార్పు ప్రకటించడంలో కేంద్రం తీసుకున్న ధోరణి కూడా గర్హనీయం. రాష్ట్ర ప్రభుత్వాలతో, గ్రామ పంచాయతీలతో, కార్మిక సంఘాలతో ఎటువంటి సంప్రదింపులు జరపకుండా, ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం ఇది. ఉపాధి హామీ వేదికగా గ్రామీణ ప్రజల జీవితాల్లో ఒక సామాజిక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్న సమయంలో, దీన్ని తగ్గించే చర్యలు వారిపై నైతిక, ఆర్థిక దాడులుగా మారుతున్నాయి.

ఉపాధి హామీ పథకం డిమాండ్–ఆధారిత హక్కుగా ఉండాలి. ఇది చట్టబద్ధ హామీ. కానీ కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల ఇది సరఫరా పరిమిత పథకంగా మారే ప్రమాదం ఉంది. ఇది కేవలం పరిపాలనా మార్పు కాదు. గ్రామీణ పేదల హక్కులను కాలరాసే, వారి జీవనోపాధిని దెబ్బతీసే చర్య. ప్రభుత్వం దీనిపై తిరిగి సమీక్షించాలి. లేకపోతే ప్రధాని నిత్యం వల్లించే 'మంచి ఉద్దేశ్యాలతో కూడిన మంచి పాలన' (Good governance with good intentions) నినాదం నీటిమీద రాతగా మిగులుతుంది.

■ చక్రధర్ బుద్ధ

సామ్రాజ్యవాద అంతిమ బుసలు!

అమెరికా సామ్రాజ్యవాదులు తమ తొత్తు నెతన్యాహు ఫాసిస్టు ప్రభుత్వాన్ని రంగంలోకి దింపటమే కాకుండా, యుద్ధం ఆరంభమైన పదవ రోజున ఇరాన్‌పై ప్రత్యక్షంగా బంకర్ విధ్వంసక బాంబు దాడులు జరిపి, అణు ఇంధన పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను ధ్వంసం చేశారు. ఇది ఇరాన్ సార్వభౌమాధికారాన్నీ, ఐరాస నిబంధనావళినీ, అంతర్జాతీయ చట్టాన్నీ ఉల్లంఘించడమే. అమెరికా దాడులకు ఇరాన్ గట్టిగా బదులివ్వడంతో డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ప్రకటించక తప్పలేదు. ఇరాన్ అణ్వాయుధాల తయారీకి సిద్ధమవుతున్నదనే అమెరికా ప్రకటనలు దొంగ ప్రచారమే. రసాయనిక ఆయుధాలున్నాయనే సాకు చూపి ఇరాక్‌పై అమెరికా అక్రమంగా దాడి చేసిన విషయం ప్రజలు మరచిపోలేదు.

అమెరికా నేతృత్వంలోని పాశ్చాత్య సామ్రాజ్యవాదులు తమ ఆధిపత్యాన్ని ఇరాన్ సవాల్ చేసినందుకే ఇజ్రాయెల్ జియోనిస్టు, జాత్యహంకార పాలకుల్ని ఉసిగొల్పి దారుణ మారణకాండకు పాల్పడ్డారు. సిరియాలో అస్సాద్ ప్రభుత్వాన్ని కూలదోసి తమ అనుకూల టెర్రరిస్టు ముఠాను అధికారంలోకి తీసుకువచ్చారు. సిరియా, లెబనాన్, యెమెన్ భూభాగాలను దురాక్రమించారు. గాజాలో నెత్తురుటేరులు పారుతున్నాయి. వేల సంఖ్యలో మరణాలు, లక్షల సంఖ్యలో క్షతగాత్రులు, ఇంకా అనేకమంది శరణార్థులు– ఇదీ నేటి పశ్చిమాసియా రణరంగ దృశ్యం.

ఇక, ఉక్రెయిన్–రష్యా యుద్ధరంగానికి వస్తే, నాటో సేనలు రష్యా వైపుగా విస్తరించబోవు అనే హామీని సామ్రాజ్యవాదులే ఉల్లంఘించారు. ఉక్రెయిన్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయిన ప్రభుత్వాన్ని కుట్రపూరితంగా కూలదోశారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నాజీ ఫాసిస్టులతో చేతులు కలిపిన బండేరాకు అనుచరులుగా వ్యవహరించిన వారిని అధికారంలోకి తీసుకువచ్చారు. అక్కడ మైనారిటీగా ఉన్న రష్యా జాతి ప్రజల మీద క్రూరమైన దాడులు చేసి వేలాది మందిని హతమార్చారు. రష్యా దేశమే దురాక్రమణ ప్రమాదాన్ని ఎదుర్కోవలసి రాగా, దీనిని నివారించాలనే లక్ష్యంతో, అది సైనిక చర్యకు పాల్పడింది. మూడు సంవత్సరాలుగా అక్కడ యుద్ధం కొనసాగుతూనే ఉంది. అంతేగాక తూర్పు ఆసియా, పశ్చిమ పసిఫిక్ ప్రాంతాలకు యుద్ధరంగాన్ని విస్తరింపజేసి, ఉత్తర కొరియా, చైనాలను లక్ష్యాలుగా చేసుకుని అణు యుద్ధాన్ని సైతం ఎగదోయాలని వ్యూహాలు రచిస్తున్నారు. అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదులు ఒక పథకం ప్రకారం కొనసాగిస్తున్న ఈ యుద్ధాలన్నింటి లక్ష్యం. దోపిడీనీ, ప్రపంచాధిపత్యాన్నీ నిలుపుకోవడమే.



మొదటి ప్రపంచ యుద్ధానంతరం అక్టోబరు సోషలిస్టు విప్లవం జయప్రదమై సోవియట్ రష్యా ఆవిర్భవించింది. యూరప్‌కి చెందిన చాలా దేశాల్లో విప్లవజ్వాలలు మిన్నుముట్టాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం చైనా, తూర్పు యూరప్‌లలో విప్లవాలు చెలరేగి సోషలిస్టు శిబిరం ఏర్పడింది. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మూడవ వరుస విప్లవాలు సమీప భవిష్యత్తులో జయప్రదం కానున్నాయి.

ఆయుధ పోటీ, అణ్వస్త్రవ్యాప్తి, యుద్ధ ఉద్రిక్తతలు నిత్యకృత్యమయ్యాయి. రష్యా, చైనాల నుంచి ప్రమాదం ఉందనే పేరుతో సామ్రాజ్యవాద దేశాలు సైనిక వ్యయాన్ని భారీగా పెంచేశాయి. నాటో దేశాల మిలటరీ బడ్జెట్ జీడీపీలో రెండు నుంచి ఐదు శాతానికి పెరగనుంది. ఉక్రెయిన్–రష్యా యుద్ధంలో ప్రాణనష్టం, పాలస్తీనా ప్రజల హత్యాకాండ, స్థానిక యుద్ధాలలో సంభవిస్తున్న విధ్వంసం... ఇవన్నీ గత ప్రపంచ యుద్ధాల నాటి పరిస్థితులను తలపిస్తున్నాయి. మూడవ ప్రపంచ యుద్ధ ప్రమాదం తీవ్రమవుతోంది.

మొదటి ప్రపంచ యుద్ధం సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధంగా కొనసాగింది. రెండవ ప్రపంచ యుద్ధం సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధంగా ఆరంభమయినా ఫాసిస్టు హిట్లరు నేతృత్వంలోని జర్మనీ, సోవియెట్ యూనియన్‌పై దాడి జరపడంతో ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంగా పరిణమించింది. ఇప్పుడు మూడవ ప్రపంచ యుద్ధం సామ్రాజ్యవాద వ్యతిరేక యుద్ధంగా పెంపొందుతోంది. అమెరికా, యూరోపియన్ యూనియన్, నాటో సామ్రాజ్యవాద దేశాలన్నీ ఒక కూటమిగా సమీకృతమవుతుంటే, సోషలిస్టు వారసత్వం కలిగిన పెట్టుబడిదారీ దేశం రష్యా, చైనా, ఉత్తర కొరియా, ఇరాన్, వియత్నాం, లావోస్, క్యూబా వంటి దేశాలు సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్‌గా ఏర్పడడానికి సిద్ధమవుతున్నాయి. ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంట్‌లు అంతిమంగా సామ్రాజ్యవాద వ్యతిరేక లక్ష్యాలనే నెరవేరుస్తాయి. రష్యా, చైనా దేశాల్ని సోషల్ సామ్రాజ్యవాద దేశాలుగా పేర్కొనటం గానీ, రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధంగా పరిగణించడం పూర్తి అవాస్తవికం.

సామ్రాజ్యవాద దోపిడీని ప్రతిఘటిస్తున్న దేశాలు తమ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాలని బలంగా ఆకాంక్షిస్తున్నాయి. రష్యాపై ఆంక్షలు విధించి, దానిని ఆర్థికంగా కృంగదీయాలనే ప్రయత్నాలు విఫలమయ్యాయి. పాశ్చాత్య దేశాలకు బలమైన ఆర్థిక శక్తిగా చైనా ఎదిగింది. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా గణనీయంగా పెరిగింది. లాటిన్ అమెరికా దేశాలలో వామపక్ష శక్తుల విజయపరంపర కొనసాగుతోంది. ఆఫ్రికా దేశాల స్వాతంత్ర్య పోరాటాలు బలోపేతమవుతున్నాయి. యూరప్ ప్రజలు ప్రపంచ శాంతి, సుస్థిరతల కోసం ఉద్యమిస్తున్నారు. ట్రంప్ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ అమెరికా ప్రజలు వీధుల్లో ప్రదర్శనలు చేస్తున్నారు. భారత పాలకవర్గాలు అనుసరిస్తున్న ఇజ్రాయెల్, అమెరికా అనుకూల విదేశాంగ విధానం పట్ల ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రపంచ యుద్ధం ఏనాడైనా బద్దలుకానున్న ప్రస్తుత పరిస్థితులలో ఆయా దేశాల విప్లవ వ్యూహాలు ప్రపంచ విప్లవ వ్యూహంలో సంలీనం కావాలి. రష్యా, చైనా, ఉత్తర కొరియా వంటి దేశాలు రెగ్యులర్ సైన్యాలను కలిగివున్నాయి. కనుక అవి సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సాయుధ యుద్ధాన్ని కొనసాగిస్తాయి. మిగిలిన దేశాలలోని విప్లవశక్తులు విస్తృత ప్రజా ఉద్యమాల నిర్మాణానికి కృషి చేయాలి. దండకారణ్య గిరిజన పోరాటాలపై కొనసాగుతున్న నిర్బంధాన్ని ఖండిస్తూ ఇటీవల విస్తృతంగా జరిగిన ప్రదర్శనలు, ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండిస్తూ దేశవ్యాప్తంగా జరిగిన నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు ఆహ్వానించదగినవి. రాబోయే కాలంలో జరిగే పరిణామాలకు ఇవి ఒక ప్రతీకగా నిలుస్తాయి.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం అక్టోబరు సోషలిస్టు విప్లవం జయప్రదమై సోవియట్ రష్యా ఆవిర్భవించింది. యూరప్‌కి చెందిన చాలా దేశాల్లో విప్లవజ్వాలలు మిన్నుముట్టాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం చైనా, తూర్పు యూరప్‌లలో విప్లవాలు చెలరేగి సోషలిస్టు శిబిరం ఏర్పడింది. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మూడవ వరుస విప్లవాలు సమీప భవిష్యత్తులో జయప్రదం కానున్నాయి. సామ్రాజ్యవాదానికి అంతిమ ఘడియలు దాపురించాయి. ప్రపంచ కార్మికులు ఏకమై తీరుతారు. సమైక్యంగా నిలిచిన పీడిత ప్రజానీకాన్ని ఏ శక్తీ ఓడించజాలదు.

○ డా. శ్రీనివాస్
కె.ఎస్. మెమోరియల్ కమిటీ

పాఠశాలల కన్నా గోశాలలపైన మక్కువ!

2023 లెక్కల ప్రకారం దేశంలో 18 సంవత్సరాలలోపు పిల్లలు 43.66 కోట్ల మంది ఉండగా, తెలంగాణలో 67.26 లక్షలు ఉన్నారు. ఇక దేశంలో పశువులు 53.67 కోట్లు ఉండగా, తెలంగాణలో 3.26 కోట్లు ఉన్నాయి. తెలంగాణలో ఇప్పటి వరకు గోశాలల ఏర్పాటు, నిర్వహణ మొత్తం ప్రైవేటు వ్యక్తులు, ధార్మిక సంస్థలు, హిందూ మత అనుబంధ మఠాలు మాత్రమే నిర్వహిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు అనేక ప్రోత్సాహకాలు ఇప్పటికే ఇస్తున్నాయి.

పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం గోశాలల నిర్వహణదారులు సగటున ఒక్కో సాధారణ ఆవుకు రోజుకు రూ.100, పాడి ఆవుకు రూ.229 దాణా కోసం ఖర్చు చేయాలి. ప్రభుత్వం పాఠశాల, కళాశాలల విద్యార్థులకు జీఓ 9 ప్రకారం పెంచిన మెస్ చార్జీల 1–7వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.1330, రోజుకు 44.33; 8–10వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.1540, రోజుకు 51.33; ఇంటర్ ఆపై విద్యార్థులకు నెలకు రూ.2100 రోజుకు 70 రూపాయలు ఖర్చు చేస్తున్నది. ఈ లెక్కన ఒక్కో ఆవుపై పెట్టే ఖర్చు కన్నా విద్యార్థిపై పెట్టే ఖర్చు తక్కువ. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు 25 ఎకరాలు కేటాయిస్తుండగా, గోశాలలకు 100 ఎకరాలు కేటాయించ తలపెట్టారు. అధికారంలోకి రాగానే విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయింపులు చేస్తామని చేవెళ్ళలో కాంగ్రెస్ డిక్లరేషన్ చేసినా, విద్యారంగానికి 2024–25లో 7.3శాతం, 2025–26లో 7.55శాతం మాత్రమే బడ్జెట్ కేటాయింపులు చేశారు.

విద్యార్థి కేంద్రంగా ఉండవలసిన పాఠశాలలను, గడచిన ఇరవయ్యేళ్ళ నుంచి టీచర్ కేంద్రంగా మార్చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలన్నీ టీచర్ల రాకపోకలకు, బోధనకు అనుకూలమే తప్ప, ఎక్కడ కూడా విద్యార్థిని కేంద్రం చేసుకొని పాఠశాలల నిర్వహణ, బోధన, మూల్యాంకన ప్రణాళికలు లేవు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి భరోసా లేకపోవడంతో, ఈ పాఠశాలల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల అనాసక్తిని ప్రదర్శిస్తున్నారు. గురుకులాలు కూడా ఇందుకు మినహాయింపు కాదు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థి భవిష్యత్తు దిశగా చేస్తున్న చర్చలు, ఆలోచనలు కార్యక్రమాలు కంటి తుడుపు చర్యలే కానీ, విద్యార్థి భవిష్యత్తుకు భరోసా ఇచ్చేవి కావు.

గోశాలల ఏర్పాటు పట్ల ఎవరికీ అభ్యంతరం ఉండదు. వ్యాపార దృక్పథంతో చూడాల్సిన ఆవుల పెంపకాన్ని ప్రభుత్వం సామాజిక దృక్పథంతో ప్రాధాన్యం ఇస్తున్నది. సామాజిక బాధ్యతతో నిర్వహించాల్సిన పాఠశాల విద్యను వ్యాపార దృక్పథంలోకి నెట్టివేస్తున్నది. సమాజానికి ఇది ఏ మాత్రం శ్రేయస్కరం కాదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్య కోర్సుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో, ఎన్నికల్లో ప్రత్యేక కోటా చట్టమొక్కటే శరణ్యమని గుర్తించాలి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోశాలల పితామహుడిగా కన్నా, ప్రభుత్వ పాఠశాలల పితామహుడిగా నిలవడం శ్రేష్ఠం.

– మామిడి నారాయణ, సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రీసెర్చ్ ఫౌండేషన్

సర్వేయర్లు లేరు.. మరి 'భూధార్' ఎలా?


ఆధార్ కార్డు లాగా భూమి ఉన్న ప్రతి రైతుకూ భూధార్ కార్డు మంజూరు చేస్తామని గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ సర్వేయర్ల కొరత కారణంగా దీని సాధ్యాసాధ్యాలపై సందేహాలు తలెత్తుతున్నాయి.

తెలంగాణలో భూములను సర్వే చేసి, భూ వివరాలను నవీకరిస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రాన్ని 'డిజిటల్ మ్యాప్ ఆఫ్ తెలంగాణ' చేస్తామని ప్రకటించింది. కానీ, తర్వాత సర్వే అంశాన్ని పూర్తిగా విస్మరించింది. భూములతో ముడిపడి ఉన్న అవినీతి తగ్గాలంటే రికార్డుకు, భూమికి లింకు ఉండాలని రెవిన్యూ, ప్రజా సంఘాలు, న్యాయస్థానాలు, ఉన్నతాధికారులు నొక్కిచెబుతున్నారు. వాస్తవానికి 'జాతీయ భూముల నవీకరణ పథకం' (ఎన్ఎల్ఆర్ఎంపీ) ద్వారా తెలంగాణలో సమగ్ర భూ సర్వేకు 2014లోనే కేంద్రం సంకల్పించింది. ఇందుకు రూ. 400 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసి, ముందుగా రూ. 83 కోట్లు విడుదల చేసింది. కానీ పదేళ్ల గడిచినా భూముల కొలతల విషయమై ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

సమగ్ర భూ సర్వే కోసం.. నాటి నిజాం సర్ సాలార్‌జంగ్ తెచ్చిన 'భూమి కొలతల చట్టం–1923'కు అదనంగా కొన్ని సవరణలు చేయాల్సి ఉంటుంది. సరైన అనుమతులు లభిస్తే రెండేళ్లలో తెలంగాణలో భూముల సర్వే పూర్తి చేస్తానని 2016లో అప్పటి సీసీఎల్ఏ రేమండ్ పీటర్ ప్రతిపాదించారు. కానీ అందుకు నాడు సీఎం కార్యాలయం స్పందించలేదు. రాష్ట్రంలోని భూములకు 'సంపూర్ణ యాజమాన్య హక్కు చట్టం– కంక్లూజివ్ టైటిల్ యాక్ట్' తెస్తామని కేంద్రం తొమ్మిదేళ్లుగా చెబుతూనే ఉన్నా అది ఆచరణసాధ్యం కావడం లేదు. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే.. 2021 జనవరిలో నాటి ఏపీ ప్రభుత్వం సమగ్ర భూ సర్వేకు ముహూర్తం ఖరారు చేసినా, కొన్ని కారణాల వల్ల దాన్ని పూర్తి చేయలేకపోయింది. ఇప్పటికే గుజరాత్, త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పాలకులు 90 శాతం సమగ్ర భూ సర్వేలు నిర్వహించారు. బీహార్, ఉత్తరప్రదేశ్‌లోనూ భూములకు సంబంధించి కీలకమైన చట్టాలు తెచ్చారు.

పక్క రాష్ట్రమైన కర్ణాటకలో పద్నాలుగేళ్ల కిందటే ఆదర్శవంతమైన భూ రికార్డుల ప్రక్షాళన సర్వే జరిగింది. 'భూమి–కావేరి' పేరిట ఆ రాష్ట్రంలో ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎవరైనా భూమి అమ్మాలనుకున్నా, కొనాలనుకున్నా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తారు. అభ్యంతరాలేవీ లేవని నిర్ధారించిన తర్వాత దాన్ని సరైన భూమిగా గుర్తించి వెంటనే మ్యాప్‌తో డిజిటలైజ్ చేస్తారు. ఆ తరువాత రిజిస్ట్రేషన్ చేస్తారు. ఆపై అలాంటి భూమిని ఎన్నిసార్లు ఎవరు కొన్నా, అమ్మినా వెంటనే మ్యుటేషన్ చేస్తారు. దాంతో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావడం లేదు.

మన రాష్ట్రంలో 33 జిల్లాలు, 561 మండలాలు, 78 రెవిన్యూ డివిజన్లు, 76 లక్షల కమతాలు, 18 లక్షల వరకు సర్వే నెంబర్లు ఉన్నాయి. ఈ మొత్తం భూ విస్తీర్ణం 2,45,57,758 ఎకరాలు. ఈ భూముల సర్వే పూర్తి కావాలంటే తగు సంఖ్యలో మానవ వనరులు, సర్వేయర్లు, టెక్నికల్ సిబ్బంది అవసరం. దీనికి రాష్ట్రంలోని భూ పరిపాలనా విభాగం, కొలతలకు కమిషనర్ సర్వే–సెటిల్మెంట్ విభాగం అనుబంధంగా ఉంటాయి. ప్రతి జిల్లాకు ఒక అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే, ల్యాండ్ రికార్డుల అధికారి ఉంటారు. అన్ని రెవిన్యూ డివిజన్లకు సర్వే ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. ఒకవేళ రైతుకు మండల సర్వేయర్ పనిపై అసంతృప్తి ఉంటే అతడు పై అధికారులను, డివిజన్, జిల్లా స్థాయి అధికారులను సంప్రదించవచ్చు. చివరగా సర్వే కమిషనర్ ఎంక్వైరీతో ఆ రైతు పని పూర్తవుతుంది.



రాష్ట్రంలోని అన్ని మండలాల్లో పదమూడేళ్లుగా లైసెన్స్‌డ్ సర్వేయర్స్ పని చేస్తున్నారు. వీరికి సరైన జీతభత్యాలు లేవు. తమను ప్రభుత్వం ఎప్పటికైనా పర్మినెంట్ చేస్తుందనే ఆశతో ఉన్నారు. తమ లైసెన్సును రెన్యువల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రైతుల నుంచి వచ్చే సమస్యల్లో భూమి కొలతల సమస్యలే అధికం. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ రెవిన్యూ అనుబంధశాఖలో అవసరమైన దాంట్లో సగానికి కంటే తక్కువగానే శాశ్వత సిబ్బంది ఉన్నారు. రాష్ట్రంలోని అన్ని మండలాల్లో పదమూడేళ్లుగా లైసెన్స్‌డ్ సర్వేయర్స్ పనిచేస్తున్నారు. వీరికి సరైన జీతభత్యాలు లేవు. తమను ప్రభుత్వం ఎప్పటికైనా పర్మినెంట్ చేస్తుందనే ఆశతో ఉన్నారు. తమ లైసెన్సును రెన్యువల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కొత్త చట్టం ప్రకారం అన్ని భూములు సర్వే చేయడానికి ఇటీవల ఐదు వేల మందిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రస్తుతం వారు శిక్షణ పొందుతున్నారు. వారికి ప్రభుత్వం పూర్తి స్థాయి ఉద్యోగం ఇస్తుందన్న హామీ లేదు. మరోవైపు నైపుణ్యం ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్స్‌ను ప్రభుత్వం గుర్తించడం లేదు. కానీ లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించామని, ఇక భూ సర్వే సమస్యలు దూరమవుతాయని రెవిన్యూ మంత్రి ఇటీవల పలు సమావేశాల్లో చెబుతున్నారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చింది. అందులో సెక్షన్ 9లో పొందుపరిచినట్లుగా ప్రతి పార్సెల్‌కు (ఎ)తాత్కాలిక భూధార్, (బి) శాశ్వత భూధార్, (సి) భూధార్ కార్డ్ ఉంటుందని తెలిపింది. భూ కమతం విస్తీర్ణంతో నిమిత్తం లేకుండా రైతులందరికీ భూధార్ కార్డు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆ ప్రక్రియ ఈ ఏడాది ఆగస్టు 15నాటికి పూర్తవుతుందని తెలిపింది. కానీ ఈ ప్రక్రియలోనూ అనేక సమస్యలున్నాయి. ఉదాహరణకు.. ఒక కమతాన్ని కొలవాలంటే రైతు, ఒక సర్వే ఉద్యోగి, ఒక రెవిన్యూ ఉద్యోగి కలిసి పొలం సరిహద్దుల వెంట నడవాలి. ప్రతి భూమి పార్సెల్‌కు నాలుగు మూలలు ఉంటాయి. నాలుగుకు మించి మూలలుంటే ప్రతి మూలకు వెళ్లి రిమోట్‌ను క్లిక్ చేస్తే ఆ పొలం కోఆర్డినేట్ పాయింట్స్ (అక్షాంశాలు, రేఖాంశాలు) రికార్డు అవుతాయి. అన్ని మూలల్లో హద్దురాళ్లను బిగించాలి. ప్రతి కమతంపై ఇరుగు పొరుగు రైతుల మధ్య ఎలాంటి గట్టు పంచాయితీ లేకుండా డిజిటల్ మ్యాప్ సిద్ధం చేయాలి. అప్పుడు ప్రతి రైతు తన కమతానికి ఒక భూధార్ కార్డు పొందగలుగుతాడు. అలా ఇవ్వగలిగితే ప్రతి రైతు భరోసా పొందగలుగుతాడు. కానీ తగు సంఖ్యలో భూ కొలతల సిబ్బంది లేకుండా ఈ పని పూర్తి చేయడం అసాధ్యం. ఎలా చూసినా నైపుణ్యం ఉన్న సర్వేయర్స్ అవసరం చాలా ఉంది. ఇప్పటికే ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్స్‌ను క్రమబద్ధీకరించడం గురించి ప్రభుత్వం పునరాలోచన చేయాలి. తద్వారా సిబ్బంది కొరత లేకుండా భూ భారతి చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడానికి వీలవుతుంది.

● వి. బాలరాజు
రిటైర్డ్ తహశీల్దారు


మాట్లాడుతున్న సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి


మాట్లాడుతున్న కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



కేయూ స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు

మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

విద్య ప్రజల జీవితాలను మెరుగుపర్చాలి

- ఉన్నతవిద్య వ్యాప్తిలో కేయూ కీలక భూమిక
- సమర్ధవంతంగా జాతీయ విద్యావిధానం అమలు
- 50 ఏళ్ళ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్ళు
- స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- జ్ఞానం సద్వినియోగంతోనే సత్ఫలితాలు : సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస రెడ్డి

7

పరిశోధన, అభివృద్ధి అనేది ప్రయోగశాలకే పరిమితం కారాదని, వాస్తవిక జీవనంలో ప్రజల మౌలిక అవసరాలను తీర్చే, వారి జీవితాల్లో విప్లవాత్మక మార్పు తీసుకురాగలిగే ఆలోచనలకు కేంద్రంగా ఉండాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. కేయూలో సోమవారం జరిగిన 23వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. 50 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన కాకతీయ విశ్వవిద్యాలయం జాతీయ విద్యావిధానం అమలులో కీలక భూమిక పోషిస్తోందని ప్రశంసించారు. కన్నుల పండువలా జరిగిన ఈ వేడుకలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చాన్సలర్ హోదాలో పాల్గొనగా, సీఎస్ఐఆర్-ఐఐసీటి డైరెక్టర్ డి.శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్‌లు, బంగారు పతకాలు సాధించిన వారికి పట్టాలు ప్రదానం చేశారు. వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రంతోపాటు పాలక మండలి, అకడమిక్ సెనేట్ సభ్యులు ఈ వేడుకలో పాల్గొన్నారు. పట్టాలు స్వీకరించేందుకు అభ్యర్థులు తమ కుటుంబసభ్యులతో తరలిరావడంతో క్యాంపస్‌లో పండుగ వాతావరణం కనిపించింది. డాక్టరేట్‌లు సాధించిన అభ్యర్థులతో వీసీ ప్రతిజ్ఞ చేయించారు.

- ఆంధ్రజ్యోతి, కేయూ క్యాంపస్




బలాకా, విజయామాతగా.. భద్రకాళి అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో కొనసాగుతున్న శాకంబరీ వేడుకలు సోమవారం 12వ రోజుకు చేరాయి. ఉదయం 5 గంటలకు అమ్మవారికి నిత్య పూజలతో నిత్యాహ్నికం కార్యక్రమాన్ని అర్చకులు పూర్తిచేశారు. అనంతరం శాకంబరీ వేడుకల సందర్భంగా తిథి మండల దేవతాయజనంలో భాగంగా కాళీ క్రమాన్ని అనుసరించి అమ్మవారి ఉత్సవమూర్తులలో ఇచ్ఛాశక్తిని బలాకా గాను, శోడషీ క్రమాన్ని అనుసరించి విజయామాత గాను అలంకరించి పూజారాధనలు చేసి భక్తులకు దర్శనాన్ని గావించారు.

నేడు ఆరుగురు మంత్రుల రాక

- మానుకోట జిల్లాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మహబూబాబాద్, జూలై7 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మంగళవారం పర్యటించనున్నారు. మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.400 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. సోమ్లతండా, కేసముద్రంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన అనంతరం మంత్రులు ప్రసంగించనున్నారు. మహబూబాబాద్ మండలం సోమ్లతండాలో, కేసముద్రంలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే మురళీనాయక్ పర్యవేక్షించారు.



సమన్వయం సవాలే!

- కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా మంత్రి అడ్లూరి
- గ్రామస్థాయి నుంచి పార్టీ జిల్లా కమిటీల ఎన్నికల బాధ్యతలు
- అంతర్గత విభేదాలను పరిష్కరించడం కత్తి మీద సామే..
- కొనసాగుతున్న ఇన్‌చార్జిల నియామకాల జోరు
- ఏప్రిల్ 23న జిల్లాకో పరిశీలకుడిని నియమించిన కాంగ్రెస్ పార్టీ
- ఆరు జిల్లాల్లో సంస్థాగత ఎన్నికలపై పరిశీలకుల పర్యవేక్షణ
- తాజాగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా మంత్రికి బాధ్యతలు
- పార్టీ పదవులపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆశలు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ నాయకత్వం దృష్టి పెట్టింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ పార్టీ పదవులు, నామినేటెడ్ నజరానాలు లేక డీలా పడుతున్న పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపి, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం చేసేందుకు ఈ నెలఖారులోగా గ్రామ స్థాయి నుంచి జిల్లా కమిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే టీపీసీసీ నుంచి జిల్లాకో పరిశీలకుడిని నియమించగా, ఇటీవల పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించింది. తాజాగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను పార్టీ ఇన్‌చార్జిగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నియమించారు.

సంస్థాగతంపై దృష్టి

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయాలని భావిస్తున్న అధిష్టానం, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నప్పటికి ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల మధ్య విభేదాల మూలంగా పూర్తి స్థాయిలో నామినేటెడ్ పోస్టులు భర్తీకి నోచుకోవటం లేదు. దీంతో ద్వితీయ శ్రేణి నేతల్లో నిరాశ వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవులను కూడా భర్తీ చేయాలనే లక్ష్యంతో అధిష్టానం దూకుడుగా ముందుకు వెళ్తోంది. ఈ నెలఖారులోగా పార్టీ పదవులన్నింటినీ పూర్తి చేయాలనే ఆలోచనతో ఉంది. అంతేకాకుండా మండల, జిల్లా స్థాయిలో ఉండే దేవాదాయ, మార్కెట్ కమిటీలను కూడా నియమించేందుకు కసరత్తు చేస్తోంది. వచ్చే అగస్టు నెలలో బీసీ రిజర్వేషన్లపై ఏదో ఒకటి తేల్చి, గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు కూడా నిర్వహించాలని భావిస్తోంది. ఈలోగా పార్టీకి సంబంధించిన ఎన్నికలు, నామినేటెడ్ పదవులన్నీ కూడా పూర్తి చేయాలని అధిష్టానం కసరత్తు చేస్తోంది.

ఇన్‌చార్జిల నియామకం

సంస్థాగత ఎన్నికల కోసం అధిష్టానం వివిధ దశల్లో ఇన్‌చార్జీలను బాధ్యులుగా నియమించింది. ఇప్పటికే ఏప్రిల్ 23వ తేదీన (మిగతా 6లో...)

రైతుల్ని మోసగిస్తే సహించం

- కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు
- కర్రెగుట్టలను టూరిజం హబ్‌గా మార్చడం బెటర్
- వాజేడులో మంత్రులు తుమ్మల, సీతక్క


రైతులకు చెక్కులు అందిస్తున్న మంతులు తుమ్మల, సీతక్క

వాజేడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): రైతులను మోసగిస్తే సహించేది లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. రైతుల సంక్షేమానికి రేవంత్ సర్కారు పెద్ద పీట వేస్తోందన్నారు. జిల్లాలోని వాజేడు మండల కేంద్రంలో సోమవారం నకిలీ మొక్కజొన్న విత్తనాలతో నష్టపోయిన బాధిత రైతులకు నష్టపరిహార చెక్కుల పంపిణీ కార్యక్రమంకు ముఖ్యఅతిధులుగా విచ్చేసి చెక్కులను రైతులకు అందజేశారు. ములుగు జిల్లాలో ఇద్దరు మంత్రులు సోమవారం పర్యటించారు. నకిలీ విత్తనాలతో నష్టపోయిన మొక్కజొన్న రైతులకు పరిహారం చెక్కులను వాజేడు మండల కేంద్రంలో పంపిణీ చేశారు. ఒప్పంద వ్యవసాయ పద్ధతిలో మొక్కజొన్న పంటవేసి నష్టపోయిన వాజేడు, (మిగతా 6వ పేజీలో...)



దొరికింది రుమాల్.. చూసుకో కమాల్...

అసలై కోతి.. ఆపై దానికో రుమాలు దొరికింది.. వేప చెట్టు ఎక్కింది.. కొమ్మల ఆలంబనగా రకరకాల విన్యాసాలు చేసింది.. అచ్చం మనుషుల లాగానే ప్రవర్తించింది. ఓసారి చుట్టుకొని, మరోసారి దానిపైన పడుకొని ఎన్నిరకాలుగా చేయాలో అన్ని రకాలు చేసి ముచ్చట గొలిపింది. కాదు కాదు. ఆశ్చర్యపరిచింది. వరంగల్ కలెక్టరేట్ ఆవరణలో సోమవారం 'ప్రజావాణి' వేళ చోటుచేసుకున్న ఈ మంకీ షో అక్కడున్న వారికి కొద్దిసేపు వినోదాన్ని పంచింది.

-ఫోటో: స్టాఫ్ ఫోటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి/వరంగల్


సర్వసభ్య సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయి

నగర అభివృద్ధికి రూ.149.29 కోట్లు

- 23 ఎజెండా అంశాలకు మెజారిటీ సభ్యుల ఆమోదం
- వ్యతిరేకిస్తూ కొందరు కార్పొరేటర్ల బహిష్కరణ
- అభివృద్ధికి బీఆర్ఎస్ అడ్డుపడుతోంది: ఎమ్మెల్యే నాయిని
- హైదరాబాద్ తరహాలో వాటర్‌బోర్డు ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్సీ బస్వరాజు
- గరం గరంగా జీడబ్ల్యూఎంసీ సర్వసభ్య సమావేశం


గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కౌన్సిల్ సమావేశం సోమవారం రసాభాసగా సాగింది. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగిన సమావేశంలో 23 ఎజెండా అంశాలకు ఎమ్మెల్యేలు, ఎక్స్ అఫిషియో మెంబర్లు, కార్పొరేటర్లు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నగర అభివృద్ధికి రూ. 149.29 కోట్లతో చేపట్టే పనులకు ఆమోదం తెలిపారు.

మొదట కాంగ్రెస్ కార్పొరేటర్లతో పాటు మేయర్ గుండు సుధారాణి ఉదయం 11.45 నిమిషాలకు కౌన్సిల్ హాల్‌లోకి చేరుకున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్యతో పాటు మేయర్ సుధారాణి కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. మేయర్ సుధారాణి ఎజెండా అంశాలను వెల్లడించారు. అంశాలు చదువుతుండగానే బీఆర్ఎస్ కార్పొరేటర్లు కొందరు అడ్డుపడ్డారు. అయినా వారిని పట్టించుకోకుండా ఎజెండాను పూర్తి చేశారు.

ఈ క్రమంలో కౌన్సిల్‌హాల్‌లో కొంత సేపు స్వల్ప ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. కాంగ్రెస్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ తమ డివిజన్ వెనుకబడి ఉందని ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తుండగా, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కలుగజేసుకున్నారు. ఇప్పటికే 62వ డివిజన్‌కు రూ.1.50కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించామని, ఇంకా ఎందుకు అంత ఆపేక్ష..? అనడంతో సమస్య (మిగతా 6వ పేజీలో...)

ఒక్కో డివిజన్‌కు రూ. 50 లక్షల నిధులు

కౌన్సిల్ సమావేశంలో 23 ఎజెండా అంశాలతో రూ. 149.29 కోట్ల అభివృద్ధి పనులకు సభ ఆమోదం తెలిపింది. అందులో సాధారణ నిధులు రూ. 62.15 కోట్లతో అంచనాలు రూపొందించారు. నగరంలోని 66 డివిజన్‌లకు ఒక్కో డివిజన్‌కు రూ. 50 లక్షల చొప్పున రూ. 33 కోట్లు కేటాయించారు. ఇతర పనులకు రూ.24.05 కోట్లు, హంటర్‌రోడ్డులోని 12 మోరీల కూడలి అభివృద్ధికి రూ. 2 కోట్లు, వీధి దీపాలకు రూ. 2 కోట్లు కేటాయించారు. ఇంకా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 18.18 కోట్లు ఖర్చు చేయనున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన స్టాంప్ డ్యూటీల నిధుల ద్వారా కొత్తగా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశారు. రూ. 41.56 కోట్లు డివిజన్‌లకు, రూ. 13.50 కోట్లు భద్రకాళి చెరువులో మ్యూజికల్ లైటింగ్‌కు, రూ. 6 కోట్లు స్మార్ట్ నీటి సరఫరా యంత్రాలకు, రూ. 4 కోట్లు నిల్వ వ్యర్థాల శుద్ధీకరణకు కేటాయించారు. అన్నపూర్ణ పథకానికి రూ. 87.54లక్షలు, అర్బన్ మలేరియా విభాగంలో పని చేస్తున్న 90 మంది కార్మికులకు రూ. 91.61 లక్షలు, స్వచ్ఛ ఆటో ఓనర్ కమ్ డ్రైవర్లకు రూ. 92.91 లక్షలు, స్వచ్ఛభారత్ మిషన్, లెగసీ మిషన్ (బయో వ్యర్థాల మేనింగ్)కు రూ.4.60 కోట్లు కేటాయించారు.

ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం దుర్మార్గం

బీఆర్ఎస్ రాష్ట్ర నేత జోరిక రమేష్



సుబేదారి పోలీసు స్టేషన్‌లో అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ రాష్ట్ర నేత జోరిక రమేష్ విమర్శించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కాకతీయ యూనివర్సిటీ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టులు చేసి సుబేదారి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడంపై ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాపాలన అందిస్తామంటూ బ్రోకర్ మాటలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రశ్నించే వారిని పొద్దుపొడవకముందే పోలీసులు ఇంటికి పంపి అరెస్టులు చేశారని మండిపడ్డారు. గవర్నర్‌కు వినతి పత్రాలు ఇవ్వడానికి అనుమతిస్తామని చెప్పి విద్యార్థి సంఘాలతో వీసీ చర్చలు నిర్వహించిన అనంతరం అర్ధరాత్రి నుంచే వారిని అరెస్టు చేసి సోమవారం సాయంత్రం విడుదల చేశారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అరెస్టు అయిన వారిలో మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జోరిక రమేష్, నాయకులు బొల్లికొండ వీరేందర్, పోలపల్లి రాంమూర్తి, గుగులోతు రాజేష్ నాయక్, గంధ్రకోట రాకేష్ యాదవ్, స్నేహిత్ ఉన్నారు.

విద్యార్థి నేతల ముందస్తు అరెస్టులు...



కేయూ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులు బైరపాక ప్రశాంత్ తదితరులు

కేయూక్యాంపస్ జూలై 7, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కాకతీయ యూనివర్సిటీ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూతో పాటు ఇతర విద్యార్థి సంఘాల నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. వర్సిటీ పోలీస్‌స్టేషన్‌తోపాటు హసన్‌పర్తి, సుబేదారి ఇతర పోలీసు స్టేషన్లకు తరలించారు. అరెస్టైన వారిలో కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నేత బొల్లికొండ వీరేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

రేపు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ బంద్

వరంగల్ వ్యవసాయం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కార్మిక సంఘాలు, యూనియన్లు ఈనెల 9న సమ్మెలో పాల్గొంటున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్‌కు సమ్మె నోటీసు ఇచ్చినందున చాంబర్ ఆఫ్ కామర్స్ విజ్ఞప్తి మేరకు మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్యా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, కార్మికులు, వ్యాపారులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు. మార్కెట్‌లో తిరిగి గురువారం నుంచి క్రయ విక్రయాలు యథావిధిగా జరుగుతాయని కార్యదర్శి పేర్కొన్నారు.

టీబీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి
- రెడ్‌క్రాస్ సొసైటీ భాగస్వామ్యం కావాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హనుమకొండ కలెక్టరేట్, జూలై7(ఆంధ్రజ్యోతి): క్షయ(టీబీ)వ్యాధిపై ప్రజలకు కలెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ అవగాహన కల్పించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో టీబీ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల తీరు తెన్నులపై సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. టీబీ వ్యాధి నిర్మూలనకు ఇరు జిల్లాల కలెక్టర్లు, రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయంతో పనిచేయాలన్నారు. దేశంలో టీబీ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రధాని టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమం తీసుకువచ్చారన్నారు. టీబీ వ్యాధి నిర్మూలనకు స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించి టీబీ కేసులను గుర్తించాలన్నారు. టీబీ నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఇందులో రెడ్‌క్రాస్ సొసైటీ భాగస్వామ్యం కావాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన పేషంట్లకు దాతల ద్వారా పౌష్టిక ఆహార కిట్లను అందించాలన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపుగా 9లక్షల జనాభా ఉందని, ఇందులో 1.98లక్షల మంది హైరిస్క్ గ్రూపులో ఉన్నారని అన్నారు. వీరందరికీ స్క్రీనింగ్, ఎక్స్‌రే చేసి లక్షణాలు ఉన్నవారికి తెమడ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఇప్పటివరకు 6923 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేయగా ఇందులో 1389మందికి ఎక్స్‌రే పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో 720 క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో జూన్ 2 నుంచి టీబీ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో 2,04,979 మంది హై రిస్క్‌లో ఉన్నారని, అందులో 5389 మందికి ఇప్పటివరకు పరీక్షలను నిర్వహించామన్నారు. ఇందులో 176 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించామన్నారు. జిల్లాలో 594 మంది క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. హనుమకొండ జిల్లాకు రూ.60వేలు, వరంగల్ జిల్లాకు రూ.40వేలను పోషకాహార కిట్లనను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, డాక్టర్ రాకేష్ రెడ్డి దంపతులు హనుమకొండ జిల్లాకు రూ.50వేలను, డాక్టర్ వంగ హేమంత్‌రెడ్డి రూ.20వేలు గవర్నర్ సమక్షంలో కలెక్టర్‌లకు అందజేశారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అడిషినల్ కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, హనుమకొండ, వరంగల్ ఆర్డీవోలు, డీఎంహెచ్‌వోలు, ప్రభుత్వ వైద్యాధికారులు పాల్గొన్నారు.

పీడీపీఎస్ విధానాన్ని స్వాగతిస్తున్నాం

- ఈ స్కీంతో పత్తి రైతులకు ఎంతో మేలు..
- కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కటకం పెంటయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కటకం పెంటయ్య తదితరులు

వరంగల్ వ్యవసాయం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రైస్ డెఫిసిట్ పేమెంట్ స్కీం(పీడీపీఎస్) విధానాన్ని స్వాగతిస్తున్నామని, దీనివల్ల పత్తి రైతులకు మేలు జరుగుతుందని అడ్తి అండ్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం పెంటయ్య అన్నారు. సోమవారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ మినీ చాంబర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెంటయ్య మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతులు మార్కెట్‌కు 10, 20 బస్తాలు తీసుకువస్తే సీసీఐకి అమ్ముకోని పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ప్రయోగాత్మకంగా పీడీపీఎస్‌ను అమలు చేసేందుకు నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మార్కెట్‌కు 30, 40 శాతం మంది రైతులు బస్తాలలోనే పత్తిని తీసుకువచ్చి అమ్ముతారని, బస్తాలలో తీసుకువచ్చిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదని అన్నారు. దీంతో రైతులకు మద్దతు ధర దక్కడం లేదన్నారు. వాహనాలలో లూజు పత్తి తీసుకురావాలంటే అధిక కిరాయి చెల్లించలేని స్థితిలో ఉన్న రైతులు మార్కెట్‌కు బస్తాలలోనే పత్తిని తీసుకువచ్చి అమ్ముకుంటారని తెలిపారు. పీడీపీఎస్ విధానం వల్ల ప్రతీ పత్తి రైతుకు మేలు జరిగే అవకాశం ఉందన్నారు. పత్తికి బహిరంగ మార్కెట్ ధర, కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర పలికిన సందర్భాల్లో అట్టి వ్యత్యాసం ధర మొత్తాన్ని రైతులకు నేరుగా చెల్లించే ఉద్దేశ్యంతో పీడీపీఎస్ విధానాన్ని అమలులోకి తీసుకువస్తున్నారని తెలిపారు. దీనివల్ల రైతులకు, అడ్తిదారులకు, కార్మికులకు.. ఇలా అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

మార్కెట్ అడ్తి సెక్షన్ అధ్యక్షుడు లింగారెడ్డి, చాంబర్ సహాయ కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, మొగిలి చంద్రమౌళి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, నల్గొండ మార్కెట్లలో పీడీపీఎస్ అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయాన్ని అడ్తి సెక్షన్ పక్షాన స్వాగతిస్తున్నామన్నారు. నీతి అయోగ్ సమావేశంలో భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చినప్పటికీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మార్కెట్లలో అడ్తి వ్యవస్థ ఉన్న దగ్గర వారికి ఏవిధంగా నష్టం జరుగకుండా నిబంధనలు రూపొందించాలని నీతి అయోగ్ సమావేశంలో కోరినట్లు తెలిసిందన్నారు. అదే విధంగా ఇప్పటికే మార్కెట్లలో బస్తాలలో తెచ్చిన పత్తిని కూడా సీసీఐ కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులను రవీందర్‌రెడ్డి కోరిన విషయం తెలిసిందేనన్నారు. కొందరు కావాలని అడ్తిదారులను తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని, ఏ సమస్య ఉన్నా.. చాంబర్ ఆఫ్ కామర్స్ లేదా అడ్తి సెక్షన్ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పీడీపీఎస్ విధానాన్ని అడ్తిదారులు స్వాగతిస్తున్నట్లు మార్కెటింగ్‌శాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళుతున్నామని చెప్పారు. పీడీపీఎస్ సిస్టం ఇప్పటికిప్పుడు వచ్చింది కాదన్నారు. గత పదేళ్లగా ప్రభుత్వం, అధికారులు దీనిపై విశ్లేషించి తీసుకువచ్చిన స్కీం అని ఆయన పేర్కొన్నారు. సీసీఐకి జిన్నింగ్ మిల్లులు, తగినంత సిబ్బంది, గోదాములు లేవన్నారు. సీసీఐ ఇక్కడ ప్రాసెస్ చేయలేదని, రైతులు, అడ్తిదారులకు, గుమస్తాలకు, దడువాయిలకు ఏ ఒక్కరికీ అన్యాయం జరుగకుండా దీర్ఘంగా ఆలోచించి పీడీపీఎస్‌ను తీసుకువస్తున్నారని తెలిపారు. అడ్తిదారులందరు స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో చాంబర్ ప్రతినిధులు, అడ్తిదారులు పాల్గొన్నారు.

రైతుల్ని మోసగిస్తే సహించం

(5వ పేజీ తరువాయి)

వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాలకు చెందిన 671 మంది రైతులకు రూ.3.80 కోట్ల విలువైన చెక్కులను ఆయన అందజేశారు.

మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌కు నెలవు అయిన కర్రెగుట్టలను టూరిజం హబ్‌గా మారుస్తే ఏజెన్సీ మండలాలు అభివృద్ధి చెందుతాయని, ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. రైతులు ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలన్నారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చేందుకు మంత్రి తుమ్మల, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకర ఎంతో కృషి చేశారని కొనియాడారు. విత్తన కంపెనీలతో మాట్లాడి రైతులకు తాను నష్టపరిహారం ఇప్పించానన్నారు. జిల్లాలో ఇసుక లారీలతో సమస్యలు ఎక్కువ అయ్యాయని, దీనిపై పోలీసులు ఉన్నతాధికారులతో చర్చించామని అన్నారు. ఇసుక, ఎర్ర మట్టి దందాలతో బీఆర్ఎస్ నేతలు బీజీగా ఉన్నారని, ప్రజా సమస్యలు వారికి పట్టవని మండిపడ్డారు. దందాలు మానుకోకపోతే శిక్ష తప్పదని హెచ్చరించారు. పోలీసు రాజ్యం అని చెప్తున్న కేటీఆర్‌కు సవాల్ చేస్తున్నాని ఎంత మంది మీద ములుగు జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు కేసులు పెట్టామని చెప్పాలని సవాల్ విసిరారు. సొంత చెల్లి ఫోన్ ట్యాపింగ్ చేయించిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిటీ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్‌మ్యాన్డ్ వర్కర్స్‌ను ఆర్టిజన్‌లుగా గుర్తించాలి

327 యూనియన్ నాయకులకు వినతి

రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తమను ఆర్టిజన్‌లుగా గుర్తించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని 327 యూనియన్ సెక్రెటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్‌ను అన్‌మ్యాన్డ్ వర్కర్స్ కోరారు. సోమవారం ఆయనను కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. విధి నిర్వహణలో మరణించిన అన్‌మ్యాన్డ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు కుటుంబానికి కోటి రూపాయాల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రాబోయే జేఎల్ఎంలో వెయిటేజీ మార్కులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఒత్తిడి తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుర్రి సుధాకర్, కార్యదర్శి నందిపాటి వెంకన్న, డేగ రవి, వెంకన్న, పాండే, గంగన్న, రంగన్న, బిక్షపతి, భద్రు, రఫీ, నరేశ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయం సవాలే!

(5వ పేజీ తరువాయి)

ప్రతి జిల్లా కో పీసీసీ పరిశీలకుడిని నియమించింది. వరంగల్ జిల్లాకు ఆమీర్ అలీఖాన్, హనుమకొండ జిల్లాకు కోమటిరెడ్డి వినయ్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లాకు పోట్ల నాగేశ్వర్‌రావు, జనగామ జిల్లాకు అద్దంకి దయాకర్, భూపాలపల్లి జిల్లాకు ఇనగాల వెంకట్రామిరెడ్డి, ములుగు జిల్లాకు కొండేటి మల్లయ్యలను నియమించారు. ఇక జూన్ 29వ తేదీన పార్లమెంట్ నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌చార్జిలను అధిష్టా నం నియమించింది. వరంగల్ పార్లమెంట్ స్థానానికి చిట్ల సత్యనారాయ ణ, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి పోట్ల నాగేశ్వరావును అధిష్టానం నియమించింది. అయితే మహబూబాబాద్ జిల్లా పరిశీలకుడిగా, మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా పోట్ల నాగేశ్వర్‌రావునే రెండు పదవుల్లో నియమించ టం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పార్టీ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్న నాయకులు సంస్థాగత ఎన్నికలపై దృష్టి పెట్టారు. ఆయా నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించి, గ్రామ, మండల బ్లాక్ స్థాయిలో ఎన్నికలు నిర్వహించేందుకు కార్యచరణ సిద్ధం చేశారు.

తాజాగా పార్టీ ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించింది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఖ మ్మం జిల్లాకు చెందిన మంత్రి పొం గులేటి శ్రీనివాస్‌రెడ్డిని నియమించిన అధిష్ఠానం, తాజాగా పార్టీ ఉమ్మడి వ రంగల్ జిల్లా ఇన్‌చార్జిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన అడ్లూరి లక్ష్మణ్‌కు బాధ్యతలు అప్పగించింది. ఇద్దరు మం త్రులు ఒకరు పార్టీ తరుపున, మరొకరు ప్రభుత్వం నుంచి ఇన్‌చార్జిలుగా ఉండ టం ఉమ్మడి వరంగల్ అభివృద్ధికి కూడా కలిసి వస్తుందనే టాక్ వినబడుతోంది.

తెరపైకి మంత్రి అడ్లూరి

ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జిలుగా ఇద్దరు మంత్రులకే అవకాశం ఇవ్వగా, మిగతా వారంతా పార్టీ సీనియర్ నేతలే ఉన్నారు. ఇద్దరు మంత్రులు కూడా పూర్వ కరీంనగర్‌కు చెందిన వారే కావటం విశేషం. వీరిలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లా పార్టీ ఇన్‌చార్జిగా నియమించగా, మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను రాష్ట్రానికి రెండో రాజధానిగా పిలిచే ఉమ్మడి వరంగల్ జిల్లాకు పార్టీ ఇన్‌చార్జిగా నియమించారు. ఈ రెండు జిల్లాలు పార్టీకి కీలకం కావటంతో పార్టీ ఇన్‌చార్జిలుగా మంత్రులను నియమించారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

అసంతృప్తులు, వర్గవిభేదాలతో ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ పార్టీ అట్టుడుకుతోంది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీ, మేయర్‌తో పాటు పార్టీ కీలక నేతల మధ్య విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో నేతలను సమన్వయం చేసుకుని, పార్టీ ఎన్నికలను పూర్తి చేయటం మంత్రి అడ్లూరికి సవాల్‌గా మారనుందనే చర్చ జరుగుతోంది. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సొంత పార్టీ ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ సంఘం విచారణలో ఉంది. తమ ఫిర్యాదుపై వెనక్కి తగ్గేందుకు ఎమ్మెల్యేలు ససేమిరా అంటున్నారు. క్రమశిక్షణ సంఘం వద్దకు వచ్చి ఫిర్యాదుపై చర్చించాలలని చైర్మన్ మల్లు రవి ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తున్నారు. అయితే రేపు, మాపు అంటు తప్పిస్తున్న ఎమ్మెల్యేలు ఎట్టకేలకు ఈ నెల 9వ తేదీ లేదా 10న రవిని కలిసేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మంత్రులు, ఎమ్మెల్యేలను సమన్వయం చేయటం ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న మంత్రి అడ్లూరికి సవాల్‌గా మారనుందనే టాక్ వినబడుతోంది. అంతేకాకుండా ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మంత్రులతో పాటు సీనియర్ నేతలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, దొంతిమాధవరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, బలరామ్‌నాయక్ తదితరులు ఉన్నారు. వీరిని సమన్వయం చేయటం అడ్లూరికి సవాలే అనే టాక్ ఉంది.

నగర అభివృద్ధికి రూ.149.29 కోట్లు

(5వ పేజీ తరువాయి)

సద్దుమణిగింది. క్వాలిటీ కంట్రోల్ అధికారుల తీరు బాగా లేదని, కాంట్రాక్టర్లు నాసి రకం పనులు చేస్తున్నా బిల్లులు చెల్లిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని రాజేందర్‌రెడ్డి మేయర్‌కు సూచించారు. చెత్తను తరలించే వాహనాలు షెడ్డుకు వస్తే రిపేర్లలో జాప్యం జరుగుతుందని, ప్రభుత్వ స్థలాలు కబ్జాకాకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజావాణిలో సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్ల తన వద్దకు వస్తున్నారని అన్ని వింగ్‌ల అధికారులను హెచ్చరించాలని మేయర్‌కు సూచించారు. విలీన గ్రామాల అభివృద్ధికి సరిపడా నిధులు విడుదల చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కోరారు.

నిరసనలు, నినాదాల మధ్య..

కౌన్సిల్ సమావేశంలో ఇరు పక్షాలు నినాదాలు చేస్తుండగా మేయర్ సుధారాణి 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టాంప్ డ్యూటీ నిధులు, ప్రత్యేక బడ్జెట్‌ను కలుపుకుని పలు అభివృద్ధి పనులకు రూ. 149.29 కోట్లతో ప్రతిపాదించారు. మెజారిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. కొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు తమ డివిజన్‌లలో నెలకొన్న సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రతిపక్ష కార్పొరేటర్ల డివిజన్ల అభివృద్ధిపై ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని చెప్పే ప్రయత్నం చేస్తున్నా తమకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్, ఆర్ఐల తీరు అధ్వానంగా ఉందని కార్పొరేటర్లు చెప్పుకొస్తుండగా మేయర్ అన్నీ తానై ముందుపడి నడిపించారు. కాగా ఎజెండా అంశాలు తమకు నచ్చలేదని కొందరు బీఆర్ఎస్ ప్రతిపక్ష కార్పొరేటర్లు కౌన్సిల్‌ను బహిష్కరించి బయటకు వచ్చారు. భద్రకాళి చెరువు పూడికతీతతో పాటు పలు డివిజన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులలో అవినీతి జరిగిందని ఆరోపించారు. అయితే 14 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లలో 9 మంది కౌన్సిల్‌ను బైకాట్ చేసి బయటకు రాగా, మరో ఐదుగురు మాత్రం కౌన్సిల్ పూర్తి అయ్యే వరకు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఆ ఐదుగురు కార్పొరేటర్లు కొద్ది రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంటారనే వ్యాఖ్యలు వినిపించాయి.

కొత్త కౌన్సిల్ హాల్ ప్రారంభం..

వరంగల్ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పాత కౌన్సిల్ హాల్ రెనోవేషన్ తర్వాత సోమవారం కొత్త కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు ఎమ్మెల్యేలు, మేయర్ కొత్త హాల్‌ను రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రెనోవేషన్ తర్వాత కౌన్సిల్ హాల్ అందరికీ సౌకర్యంగా ఉందని కార్పొరేటర్లు సంతోషం వ్యక్తం చేశారు.

అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోంది..

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని, గతంలో లేని పనులకు టెండర్లు పిలిచి రింగ్ మాస్టర్లుగా అవతారం ఎత్తి కోట్ల రూపాయలు కమిషన్ల పేరుతో మెక్కారని ఆరోపించారు. గతంలో కేటీఆర్‌ను పెట్టి అట్టహాసం చేశారని.. ఎక్కడైనా ఒక్క రూపాయి అభివృద్ధి జరిగిందా చూపించాలని, మేం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించి కోట్ల రూపాయల నిధులు తెచ్చామని అన్నారు. 20 ఏండ్లు వెనక్కి పోయిన నగరాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ముప్పై యేండ్లు ముందుకు తీసుకొచ్చిందన్నారు. రూ.200 కోట్లతో కేయూలో 15 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కట్టిస్తుంటే ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారని విమర్శించారు.

ప్రత్యేక వాటర్‌బోర్డు కోసం ప్రయత్నిస్తాం..

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వరంగల్ నగరానికి ప్రత్యేక వాటర్‌బోర్డు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. ఆటోనగర్‌లోని 7 డివిజన్‌లను కలుపుకుని శ్మశాన వాటికకు కేటాయించిన నిధులు సరిపోవడం లేదని, మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పట్టణ ప్రణాళిక అధికారులు చురుకుగా వ్యవహరించాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది క్రమశిక్షణతో పని చేయాలని అన్నారు.



సమావేశాన్ని బహిష్కరించి బయటకు వచ్చిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు



కౌన్సిల్ హాల్‌కు వస్తున్న ఎమ్మెల్యేలు, మేయర్, కార్పొరేటర్లు

యువతే ఈ దేశ భవిష్యత్తు

వారి చేతుల్లోనే వికసిత్ భారత్
- జ్ఞానం సద్వినియోగంతోనే సత్ఫలితాలు
- సైన్స్ రంగంలో ఐఐసీటి విజయాలు విప్లవాత్మకం
- సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస రెడ్డి



పీహెచ్‌డీ పట్టాలు అందుకుంటున్న స్కాలర్లు

హనుమకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నేటి ప్రపంచంలో జ్ఞాన సముపార్జన ఒక్కటే సరిపోదని, దానిని ఏ మేరకు ఎలా ఉపయోగించాలన్నది కూడా ముఖ్యమని సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత డి.శ్రీనివాసరెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం 23వ స్నాతకోత్సవం క్యాంపస్‌లోని ఆడిటోరియంలో సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరెడ్డి స్నాతకోపన్యాసం చేశారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే సృజనాత్మకత, కమ్యూనికేషన్, వాస్తవిక ప్రాపంచిక నైపుణ్యాలు అవసరమని అన్నారు. మనం ఏ రంగంలో ఉన్నమనేదికాదు.. భిన్నంగా ఆలోచించడం, ఆలోచనలను ఇతరులతో స్పష్టంగా పంచుకోవడం, వారితో కలిసి ప్రతిభావంతంగా పని చేయడం ముఖ్యమని.. అప్పుడే మరింత ముందుకు వెళ్లగలమని అన్నారు. యజమానులు డిగ్రీలను చూసి ఉద్యోగులను నియమించుకోవడం కాకుండా వారు ఆలోచనాపరులా కాదా, సమస్యను పరిష్కరించగలరా లేదా, టీమ్ ప్లేయర్లా కాదా అనేది చూడాలన్నారు. మనలోని సాంకేతికత, ఆటోమేషన్, ప్రతిభ, విస్పష్టమైన ఆలోచనా ధోరణి మిగతావారికన్నా భిన్నంగా, ప్రత్యేకంగా నిలబెడుతాయని శ్రీనివాస రెడ్డి అన్నారు. భారత దేశం ఒక కొత్త శక్తితో, సరికొత్త ఆకాంక్షలతో ముందుకు వెళుతోందన్నారు. వందవ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా ఎదగడానికి మన కంటూ వికసిత్ భారత్-2047 అనే స్పష్టమైన జాతీయ స్వప్నదర్శనం ఉందన్నారు. అయితే ప్రభుత్వ విధానాల వల్ల మాత్రమే ఈ కల సాకారం కాదని, యువ పౌరుల శక్తి, సృజనాత్మకతపైనే ఇది ఆధారపడి ఉందని అన్నారు. యువత ఈ దేశ భవిష్యత్తు మాత్రమే కాదని, వారు ఈ దేశ స్థితిని, గతిని మార్చగల శక్తిమంతులని అన్నారు.

సైన్స్ అంటే కొత్తవాటిని కనుగొనడానికి ఉద్దేశించింది మాత్రమే కాదు ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను అది పరిష్కరిస్తుంది, ఎందరి జీవితాలనో మార్చివేస్తుంది. కొత్త భవిష్యత్తును నిర్మిస్తుంది అన్నారు. ఇండియాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటి) ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు. చౌకయిన మందుల తయారీ, కోవాక్సిన్ బయోడీగ్రేడబుల్ శానిటరీ న్యాప్కిన్స్, కంపోస్టబుల్ ప్లాస్టిక్, ఏజీఆర్ టెక్నాలజీ ఐఐసీటీ సాధించిన విప్లవాత్మక విజయాల్లో కొన్ని అన్నారు. సైన్సు, కొత్త ఆవిష్కరణల పట్ల ఆసక్తి ఉన్నవారిని తమ సంస్థ ఆహ్వానిస్తోందన్నారు. ఇంటర్న్‌షిప్స్, ఫెల్లోషిప్స్ అందజేయడతో పాటు పరిశోధన అవకాశాలను కల్పిస్తుందన్నారు. ప్రపంచ వాస్తవిక సవాళ్ల మొదలుకొని కాలుష్య రహిత ఎనర్జీ, చౌకయిన వైద్యం వరకు ఎటువంటి సమస్యలనైనా పరిష్కంచే యజ్ఞంలో తమతో చేయి కలపాల్సిందిగా ఐఐసిటీ డైరెక్టర్ పిలుపునిచ్చారు. తాము చదువుకున్న విద్యాలయాన్ని వదిలివేళ్లే విద్యార్థులు దాని పట్ల కృతజ్ఞతతో ఉండాలని, నైతిక విలువలకు కట్టుబడాలని, కుటుంబాన్ని, తమ మూలాలను మరవరాదని ఉద్బోధించారు. యువతే ఈ దేశ భవిష్యత్తు, వికసిత్ భారత్ సాకారానికి చేయూతలు అని గుర్తు చేశారు. యువత నిత్యాన్వేషిగా ఉండాలని, మార్పును ఆస్వాదించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అనేక మంది ఇంగ్లీష్ రాకపోవడం ఒక లోటుగా భావిస్తున్నారనీ, కానీ భాష మన ఆలోచనలు పంచుకోవడానికి ఒక సాధనం మాత్రమేనని, మనం ఏం చెబుతున్నామని కాదనీ, మనం ఏం చేసి చూపిస్తున్నామనేది ముఖ్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన తాను కూడా ఇంగ్లీష్ రాక మొదట్లో ఇబ్బందిపడ్డానని, కానీ దానిని అధిగమించేందుకు చాలా శ్రమ పడ్డానన్నారు. మాస్టర్ డిగ్రీ చేసేప్పుడు పేపర్‌బాయ్‌గా పని చేసిన రోజులను గుర్తు చేసుకున్నారు.



తెలుగు స్కాలర్ దివ్యాంగులు శ్యాం ప్రసాద్ కు డాక్టరేట్ పట్టాను ఇస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, వీసీ ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం



స్క్రీన్‌ల వద్ద ఫోటోలు తీసుకుంటున్న డాక్టరేట్ అభ్యర్థుల కుటుంబ సభ్యులు

కేయూ ప్రస్థానం ఆదర్శనీయం

- ఉన్నత విద్యావ్యాప్తిలో కీలక భూమిక
- స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేశ్ వర్మ

హనుమకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యావాప్తిలో కాకతీయ విశ్వవిద్యాలయం కీలక భూమిక పోషిస్తోందని గవర్నర్, కేయూ చాన్సలర్ కూడా అయిన జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. కేయూ 23వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. 50 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన కాకతీయ విశ్వవిద్యాలయం ఉత్తర తెలంగాణలో ఉన్నత విద్యలో సంస్కరణాత్మక ప్రస్థానానికి శ్రీకారం చుట్టిందన్నారు. జాతీయ విద్యావిధానం అమలులో కేయూ కీలక భూమిక పోషిస్తోందని ప్రశంసించారు. స్నాతకోత్సవం అనేది ఒక ఉత్సవం మాత్రమే కాదని పట్టాలు అందుకున్న విద్యార్థులు విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టేందుకు పడే భవిష్యత్ బాట అని అన్నారు. పరిశోధన, అభివృద్ధి అనేది ప్రయోగశాలకే పరిమితం కారాదని, వాస్తవిక జీవనంలో ప్రజల మౌలిక అవసరాలను తీర్చే, వారి జీవితాల్లో విప్లవాత్మక మార్పు తీసుకురాగలిగే ఆలోచనలకు కేంద్రంగా ఉండాలని అన్నారు. యువత ఈ రోజు సైన్స్ రంగంలో సరికొత్త మైలురాళ్లను నాటుతున్నారన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇందులో ఎంతో వాస్తవ ముందని అన్నారు. పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డి) ప్రయోగశాలల్లోనే కాకుండా నిజజీవితంలో సేవ చేయడానికి, ప్రజల జీవితంలో మార్పులు తీసుకురావడానికి ఉద్దేశించినదిగా ప్రతి ఒక్కరు భావించాలన్నారు.

కాకతీయ విశ్వవిద్యాలయం 2023లో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడం పట్ల, 2024లో ఎన్ఐఆర్ ప్రకటించిన టాప్ 151-200 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ విశ్వవిద్యాలయం ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల జాతీయ స్థాయిలో 84వ ర్యాంకును, యూఐ గ్రీన్ మెట్రిక్స్‌లో మూడో స్థానంలో నిలవడం, తెలంగాణలోనే నెంబర్ వన్‌గా ఉండడం గర్వకారణం అని ప్రశంసలు కురిపించారు. జాబ్ ఓరియంటెడ్ కోర్సులను ప్రవేశపెట్టడం, క్రీడలు, సంస్కృతిని పెంపొందించడంలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఉన్నత విద్యాప్రమాణాలను నిలబెట్టడంలో, విద్యారంగంలో ఎదురవుతున్న నూతన సవాళ్లను ఎదుర్కోవడంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తోందన్నారు.

పరిశోధనలు, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

ఈ ఏడాది గోల్డెన్ జూబ్లీ వేడుకలు • వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో వీసీ ప్రతాప్‌రెడ్డి సమాలోచనలు



పీహెచ్‌డీ పట్టాలు చూపుతున్న స్కాలర్లు

కేయూ క్యాంపస్ జూలై 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతిష్ఠాత్మకమైన కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తోందని వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కేయూ ఆడిటోరియంలో సోమవారం జరిగిన 23వ స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది కాకతీయ యూనివర్సిటీ 50 ఏళ్ళ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లోకి ప్రవేశిస్తోందన్నారు. న్యూఢిల్లీలోని యూజీసీ, అసోషియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ)తో పాటు ఇతర సంస్థల సహకారంతో వర్సిటీ అకాడమిక్‌గా ముందుకు సాగుతోందని చెప్పారు. కేయూ నుంచి 387 మంది పీహెచ్‌డీ డిగ్రీలు, 564 మంది బంగారు పతకాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. న్యాక్ అక్రిడేషన్‌లో 3.27 సీజీపీఏ స్కోర్ సాధించినట్లు పేర్కొన్నారు. గ్రీన్ మెట్రిక్ ర్యాంకులో అత్యున్నత స్థానం పొందినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది కేయూ గతంలో కన్నా రూ. 50 కోట్లు పెంచిందన్నారు. ఇటీవల రుసా 2.0 కింద రూ.50 కోట్లు కేటాయించిందన్నారు. వర్సిటీలో కె.హబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆగస్టులో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహిస్తామన్నారు.

ఈ ఏడాది వర్సిటీ 50 వసంతాల పండుగను పురస్కరించుకుని గోల్డెన్ జూబ్లీ అకాడమిక్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తామని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి ప్రకటించారు. పీవీ నరసింహరావు నాలెజ్జ్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. వెయ్యి మంది ఉండేందుకు నూతనంగా మహిళ వసతి గృహాలను నిర్మిస్తామన్నారు. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సెంటీనరీ బ్లాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెకానికల్ లర్నింగ్, డేటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, పబ్లిక్ హెల్త్‌తో పాటు ఇతర అంశాలను అందుబాటులోకి తెస్తామన్నారు. కేయూ ఎన్‌సీసీ విద్యార్థులు న్యూఢిల్లీ పబ్లిక్ పరేడ్‌కు ఎంపికయ్యారని తెలిపారు. కేయూలో అలుమ్ని విద్యార్థుల సహకారం గొప్పదన్నారు.



స్నాతకోత్సవంలో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టరేట్ పొందిన అభ్యర్థులు

సందడిగా స్నాతకోత్సవం

కేయూ క్యాంపస్ జూలై 7(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం కన్నుల పండువగా సాగింది. డాక్టరేట్‌లు పొందిన విద్యార్థులందరూ తెల్లదుస్తులు ధరించి ఆడిటోరియంలోకి వచ్చారు. విభాగాల వారీగా సీట్లలో కూర్చున్నారు. ఆడిటోరియం వద్ద వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంతోపాటు పాలక మండలి సభ్యులు, అకాడమిక్ సెనెట్ సభ్యులందరూ పుష్పగుచ్ఛాలు అందచేసి గవర్నర్‌కు స్వాగతం పలికారు. ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత ఆడిటోరియంలోకి లయబద్ధమైన చప్పుళ్ళ మధ్య స్టేజీ మీదకు చేరుకున్నారు. డాక్టరేట్‌లు సాధించిన అభ్యర్థులతో వీసీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పా లక మండలి సభ్యులు, డీన్‌లు బి. సురేశ్ లాల్, నిమ్మ సుదర్శన్, కె.అనితారెడ్డి, బాలు చౌహన్, సుకుమారి, చిర్ర రాజు, పు ల్లూరి సుధాకర్, గాదె సమ్మయ్య, జి.హన్మంతు, శ్రీనివాస్, మంచాల సదానందం, ఎస్.రాంనాథ్‌కిషన్, కట్ల రాజేందర్ పాల్గొన్నారు.



బంగారు పతకం పొందిన విద్యార్థిని ముద్దాడుతున్న తల్లి



పీహెచ్‌డీ పట్టా అందుకున్న ఆనందంలో సెల్ఫీ

గిరిజన బిడ్డకు నాలుగు బంగారు పతకాలు

- ఎల్‌ఎల్‌బీలో నాలుగు విభాగాల్లో ప్రతిభ
- ఆర్థిక ఇబ్బందులను అధిగమించిన హరిభూషణ్

రఘునాథపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పేదరికంలో పుట్టినా.. పట్టుదలతో చదివి ఏకంగా నాలుగు బంగారు పతకాలను అందుకుని శభాష్ అనిపించుకున్నాడు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గిద్దబండతండాకు చెందిన గిరిజన బిడ్డ బానోతు హరిభూషణ్ నాయక్ నాలుగు బంగారు పతకాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా కేయూలో జరిగిన 23వ స్నాతకోత్సవంలో సోమవారం అందుకున్నారు. బానోతు భిక్షపతి నాయక్-జమున బాయి దంపతుల నాల్గవ కుమారుడు హరిభూషణ్. పేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటునే ఐదు సంవత్సరాల న్యాయ విద్యను అత్యుత్తమంగా పూర్తి చేశాడు. ఎల్ఎల్‌బీ కోర్సులో మొత్తం ప్రతిభ, ఫ్యామిలీ లా (పేపర్ 1 అండ్ 2), లా ఆఫ్ ఎవిడెన్స్, హిందూ లా సబ్జెక్టులలో మొత్తం నాలుగవ బంగారు పతకాలను సాధించి ఔరా అనిపించాడు. హరిభూషణ్ నాయక్ మాట్లాడుతూ పేదరికం ఉన్నత చదువులకు అడ్డు కాదని, కష్టపడి చదివితే సాధ్యం కానిది ఏది లేదన్నారు. ఈ విజయం నా కుటుంబానికి.. నా తండాకు అంకితమన్నారు.



గవర్నర్ చేతులమీదుగా బంగారు పతకాలను అందుకున్న హరిభూషణ్‌నాయక్

స్నాతకోత్సవంలో ఉల్టా .. పల్టా...

- ప్రతిజ్ఞ లేకుండానే కార్యక్రమం మొదలు
- షెడ్యూల్‌లో పేర్కొన్నదానికి భిన్నం
- పట్టభద్రుల్లో కానరాని ఉత్సాహం

హనుమకొండ, జూలై7 (ఆంధ్రజ్యోతి): స్నాతకోత్సవం అంటే నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తు.చ తప్పకుండా టైమ్ ప్రకారం జరుగుతుంది. అలా జరిగేలా ముందుగానే అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. ఇదంతా ఒక ప్రక్రియ. కానీ సోమవారం జరిగిన కాకతీయ విశ్వవిద్యాలయం23వ స్నాతకోత్సవం ఇందుకు భిన్నంగా జరిగింది. ముందుగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా కాస్త అటు.. ఇటుగా జరిగింది. నిర్దేశిత షెడ్యూల్ కన్నా గవర్నర్ 20నిముషాలు ఆలస్యంగా స్నాతకోత్సవం జరిగే హాల్‌లోకి ప్రవేశించారు. అది అటుంచితే షెడ్యూల్ ప్రకారం గవర్నర్ స్నాతకోత్సవం ప్రొసీడింగ్స్‌కు అనుమతిచ్చిన తర్వాత పట్టభద్రులతో ముందుగా ప్రతిజ్ఞ చేయించాలి. ఆ తర్వాత వైస్‌చాన్సలర్ నివేదిక సమర్పించాలి. తదనంతరం ముఖ్య అతిథి స్నాతకోత్సవ ప్రసంగం, అనంతరం చాన్సలర్ (గవర్నర్) ప్రసంగం ఉంటుంది. కానీ ఇందుకు భిన్నంగా చాన్సలర్ స్నాతకోత్సవం ప్రొసీడింగ్స్‌కు అనుమతిచ్చిన తర్వాత తొలుత పట్టభద్రులతో ప్రతిజ్ఞ చేయించకుండానే వైస్‌చాన్సలర్ నేరుగా నివేదిక సమర్పించారు. ఆ తర్వాత ముఖ్య అతిథి ప్రసంగించారు. పట్టభద్రులతో ప్రతిజ్ఞ చేయించలేదన్న విషయం గుర్తుకు వచ్చినట్లున్నది. అప్పుడు వారితో ప్రతిజ్ఞ చేయించిన మీదట గవర్నర్ తన సందేశం ఇచ్చారు. దీంతో స్నాతకోత్సవానికి హాజరైనవారు ఇదేం తీరు అంటూ విస్తుపోయారు.

నీరసం.. నిరుత్సాహం

స్నాతకోత్సవంలో పట్టాలు, పతకాలు అందుకున్నవారిలో ఎవరూ అంతగా ఉత్సాహంగా కనిపించలేదు. ఎట్టకేలకు అందుకున్నాం అన్నట్టు నిరుత్సాహంగా తీసుకొని వెళ్లిపోయారు. ఈ పట్టాలు, పతకాలన్నీ 2020 నుంచి 2025 మధ్య కాలం నాటివి. ఈ పట్టాలు, పతకాలు ప్రదానం చేయడానికి దాదాపు అయిదేళ్లు పట్టింది. పట్టభద్రుల్లో చాలా మంది ఎక్కడెక్కడో ఉద్యోగాల్లో స్థిరపడిపోయారు. వారిలో సగం మంది స్నాతకోత్సవానికే రాలేదు. ఈ అయిదేళ్లలో పిహెచ్‌డి పట్టాలు పొందినవారు 579 మంది కాగా వీరిలో 161 కాన్వొకేషన్ కాక ముందుకే తీసుకున్నారు. ఇక మిగిలిన 418 మందిలో ప్రత్యక్షంగా వచ్చి తీసుకున్నది 387 మంది. ఇక బంగారు పతకాల విషయానికి వస్తే 2015-16 నుంచి 2020-21 వరకు అంటే ఆరేళ్ళ నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం 564 బంగారు పతకాలు. 373 మంది విద్యార్థులకు వీటిని ప్రదానం చేశారు.

వరి నారుమళ్లు.. యాజమాన్య పద్ధతులు

- జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు
- సస్యరక్షణచర్యలు తప్పనిసరి అంటున్న వ్యవసాయాధికారులు

పొడి వరి నారుమడి



కాటారం, జూలై 7(ఆంధ్రజ్యోతి):వానాకాలం సీజన్‌లో వరి సాగుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతాంగం నారుమళ్లను సిద్ధం చేసి వడ్లు అలుకుతున్నారు. బోర్ల కింద సన్న రకాలైన ఎంటీయూ-1224, 1281, 1282, బీపీటీ, తెలంగాణ సోనా, ఎంటీయూ 1010, జేజీఎల్, సాంబ మసూరిలతో పాటు పలు ప్రైవేట్ సీడ్స్‌కు సంబంధించిన వివిధ వెరైటీలతో కూడిన స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రకాలైన వరి వంగడాలను వేసుకోవడానికి రైతాంగం సిద్ధమైంది. అయితే నాణ్యమైన వరి విత్తనాల ఎంపికతో పాటు నారు మడిలో మంచి యాజమన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను చేపడి తేనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండలంలో సుమారు 13వేల ఎకరాల్లో వరి సాగు కానున్న నేపథ్యంలో వానాకాలం వరి నారుమళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను మండల వ్యవసాయాధికారి పూర్ణిమ రైతులకు ఇలా అవగాహన కల్పిస్తున్నారు.

దీనికోసం చేయాల్సిన యాజమాన్య పద్ధతి..

ఎకరాకు 30-40 కిలోల వరి విత్తనాలు అవసరమవుతాయి. 20 సెంట్ల విస్తీర్ణంలో విత్తనాలు వేసుకోవాలి. 1.5 మీటర్ల వెడల్పుతో ప్లాట్స్ లాగా చేసుకొని విత్తనాన్ని వేయాలి. విత్తనం వేసే ముందు కిలో విత్తనానికి 3-4 గ్రాముల కాప్టన్ లేదా థైరంతో విత్తన శుద్ధి చేసుకోవాలి. దుక్కిలోనే హెక్టర్‌కు 1 టన్ను పశువుల ఎరువు లేదా సేంద్రీయ ఎరువు వేసుకోవాలి. మూడు కిలోల బాస్వరం ఇచ్చే ఎరువు, రెండు కిలోల పోటాష్‌ను వేయాలి. ఈ పద్ధతిలో ముఖ్యంగా ఐరన్ మరియు పోటాషియం లోపం కనిపిస్తుంది. దీనిని నివారించుకోవడానికి సూక్ష్మపోషకాలను పిచికారి చేసుకోవాలి.



మ్యాట్ మీద నారును చుడుతున్న రైతులు (ఫైల్)

వరి నారుమడులు సాధారణంగా మూడు రకాలు:-

1) పొడి నారుమడి 2) బురద నారుమడి 3) మ్యాట్‌పై నారుమడి

మండలంలో ముఖ్యంగా పొడినారుమడి, బురద నారుమళ్లనే ఎక్కువగా ఉపయోగిస్తారు.పొడి నారుమడి అనగా...పొడి దుక్కిలోనే పొడి వడ్ల గింజలను వెదజల్లి మట్టిని కప్పడం జరుగుతుంది. వర్షపు నీటి ఆధారంతో, బోరు బావుల ద్వారా నీటిని అందించడంతో నారు మొలుస్తుంది. ఈ పద్ధతిని ముఖ్యంగా చెరువుల, కుంటలు, కాలువల కింద, మొదట నీటి వసతి లేకుండా వర్షపు నీటిపైనా ఆధారపడే ప్రదేశాల్లో ఉపయోగిస్తారు.

బురద నారుమడి అనగా..

ఈ పద్ధతిలో దుక్కిని నీటితో తడిపి బురదలాగా చేయడం జరుగుతుంది. వడ్లను 24 గంటల పాటు నీటిలో నానబెట్టి తీసిన అనంతరం మరో 24 గంటల పాటు మండె కట్టి తర్వాత చిన్నగా మొలకెత్తిన వడ్ల గింజలను(స్ప్రౌడ్స్)దమ్ము చేసిన మడిలో వెదజల్లుతారు. బోరు బావుల కింద, నీటి వసతి గల భూముల్లో ఈ పద్ధతిని సాగు చేయాలి.

వరి నారుమళ్లల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలి

- ఎస్ఎంఎస్ పూర్ణిమ, ఏవో కాటారం



నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని నారు పోసుకుని సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి, వడ్లను ముందే విత్తనశుద్ధి చేసుకుంటే పలు రోగాలు, తెగుళ్లను నివారించుకోవచ్చు. నారుమళ్లలో సరైన విధంగా ప్లాట్స్‌ను తయారుచేసుకుని విత్తనాలు చల్లుకోవాలి.

దీని కోసం పాటించాల్సిన యాజమన్య పద్ధతులు

ఎకరాకు 20-25 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. 20 సెంట్ల విస్తీర్ణంలో మొలకలు వేసుకోవాలి. హెక్టార్‌కు ఒక టన్ను సేంద్రీయ ఎరువు లేదా 25 కిలోల డీఏపీ ఎరువు వేసుకోవాలి. ఒక కిలో విత్తనాలకు ఒక లీటర్ నీటిలో ఒక గ్రాము కార్బండీజం మందుతో విత్తన శుద్ధి చేసుకోవాలి. ఇందులో 2.5 మీటర్ల వెడల్పుగా బెడ్స్‌ను ఏర్పాటు చేసుకొని మొలకలను చల్లుకోవాలి. సూక్ష్మ పోషకాల లోపం కనిపించదు. ఏ నారు మడిలోనైనా పీకి నాట్లు వేసే వారం రోజుల ముందు 3జీ కార్బోఫ్యూరాన్ గుళికలను వేసుకుంటే పలురకాల రోగాలను నివారించుకోవచ్చునని ఏవో సూచించారు.

మ్యాట్‌పై నారుమడి..

ప్యాడీ ట్రాన్స్‌ప్లాంటర్(వరి నాటు యంత్రం)తో నాట్లు వేయడం కోసం నారుమడిని మ్యాట్లపై వేయడం జరుగుతుంది. యంత్రంలో బిగించడానికి అనుగుణంగా పొలంలో సన్నపాటి మందం గల మ్యాట్లను పరిచి వాటిపై ఎరువులతో కూడిన మట్టిని వేసి నారును పెంచుతారు. నారు పెరిగిన తర్వాత మ్యాట్లను చుట్టి యంత్రాల్లో పెట్టి నాట్లు వేస్తారు. దీని కోసం రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

కాజీపేటలో రైల్వే జీఎం తనిఖీ



తనిఖీ చేస్తున్న రైల్వే జీఎం సందీప్ మాథూర్

కాజీపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే జంక్షన్‌ను దక్షిణ మధ్య రైల్వే జోన్ ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ సోమవారం తనిఖీ చేశారు. కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ రవీందర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ముందుగా బల్లార్షా స్పెషల్ రైలులో సికింద్రాబాద్ ఉన్నతస్థాయి అధికారులతో కలిసి రైలు పట్టాలు, గేట్లు, బ్రిడ్జిలు, రైల్వే స్టేషన్లు, విండో తనిఖీ చేసుకుంటూ కాజీపేటకు చేరుకున్నారు. కాజీపేట రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అమృత్ భారత్ పథకం పనులను అధికారులు ఆయనకు వివరించారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.



స్టూడెంట్ కౌన్సిల్ విద్యార్థులతో సుందర్‌రాజ్‌యాదవ్

విద్యార్థుల చేతుల్లో దేశ భవిష్యత్

కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్

మడికొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందని కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్ అన్నారు. సోమవారం మడికొండలోని మాస్టర్జీ పాఠశాల స్టూడెంట్ కౌన్సిల్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు తదితర కార్యక్రమాల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. కౌన్సిల్‌లో ఎన్నికైన హెడ్ గర్ల్ ముక్తి, హెడ్ బాయ్ మల్లేశ్వర్, ఇతర విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షీలో, వైస్ ప్రిన్సిపాల్ శిరీష, ఏవో రమేష్, సుధాకర్, మహేష్, సంగీత, మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.

'నేచర్ సైంటిఫిక్' బోర్డులో నిట్ ప్రొఫెసర్లకు స్థానం


సంజయ్ కుమార్ పాండా


రాకేశ్ కుమార్

హనుమకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన నేచర్ సైంటిక్ రిపోర్ట్స్ ఎడిటోరియల్ బోర్డులో వరంగల్ ఎన్ఐటీకి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లకు స్థానం లభించింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ సంజయ్ కుమార్ పాండా, ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ రాకేశ్ కుమార్ ఈ బోర్డులో నియమితులయ్యారు. వీరి నియామకం పట్ల నిట్ అధ్యాపక వర్గం హర్షం వ్యక్తం చేసింది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ నియామకం పరిశోధన, విద్యాబోధనరంగంలో వారు చేసిన కృషికి గుర్తింపుగా అభివర్ణించారు. బోర్డులో నియామకంతోవీరికి సముచిత స్థానం దక్కినట్లయిందని పేర్కొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

హనుమకొండ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో సోమవారం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పీడీజీ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా విరాళాలు ఇవ్వడంలో రోటరీ క్లబ్ దేశంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ పీడీజీ శరత్‌బాబు మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ విభిన్నమైన సేవా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడిగా బేతి రవీందర్‌రెడ్డి, కార్యదర్శిగా గంగోజుల నరేష్, కోశాధికారిగా మిర్యాల రాజ్‌కుమార్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ సందసాని నరేష్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ క్రిష్ణమూర్తి స్మారక పతకం ప్రదానం

కెమిస్ట్రీలో మెరిట్ విద్యార్థులకు అందజేత


ప్రొఫెసర్ క్రిష్ణ మూర్తి (ఫైల్

హనుమకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ ఏ. కృష్ణమూర్తి స్మారక పతకాన్ని 2021 సంవత్సరానికి గాను మహ్మద్ నజియా అందుకున్నారు. సోమవారం జరిగిన కేయూ 23వ స్నాతకోత్సవంలో నజియా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా స్వీకరించారు. ప్రొఫెసర్ కృష్ణమూర్తి కాకతీయ విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగంలో సుదీర్ఘకాలం పని చేసి 2001లో రిటైర్ అయ్యారు. 2014లో ఆయన కన్నుమూశారు. ఆయన స్మారకార్థం 2016లో బంగారు పతకాన్ని ప్రవేశపెట్టినట్టు వరంగల్ ఎన్ఐటీలో పని చేస్తున్న ఆయన కుమారుడు ప్రొఫెసర్ వేణు వినోద్ తెలిపారు. ఎంఎస్సీ (కెమిస్ట్రీ)లో 2016లో మొదటి సారి సముద్రాల లక్ష్మిచంద్రమౌనిక, 2017లో మహ్మద్ సోఫీ, 2018లో నిమ్మల హారతి, 2019లో శెట్టి సంధ్య, 2020లో బత్తుల శ్రావణి, 2021లో మహ్మద్ నజియా ఈ పతకాలను అందుకున్నారు. 2022 నుంచి 2025 వరకు మరో నలుగురికి ఈ పతకాల ప్రదానం జరగాల్సి ఉంది. తర్వాత జరిగే స్నాతకోత్సవాల్లో వీటిని ప్రదానం చేస్తారు.

నేడు కేయూకు సెలవు

కేయూ క్యాంపస్ జూలై 7, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 8న సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం వర్సిటీ క్యాంపస్‌లో 23వ కాన్వకేషన్ జరిగిందని, దీని దృష్ట్యా వర్సిటీకి 8న మంగళవారం సెలవు ప్రకటించినట్లు స్పష్టం చేశారు. బోధన, బోధనేతర ఉద్యోగులు, స్కాలర్లు, విద్యార్థులు గమనించాలని కోరారు.

పనిగంటలు పెంచే జీవోను రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్

హనుమకొండ కలెక్టరేట్, జూలై7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిగంటల పరిమితిని 8 నుంచి 10గంటలకు పెంచుతూ జారీ చేసిన 282 జీవో ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో జీవో కాపీలను దహనం చేశారు. కార్మిక వ్యతిరేక చర్యలు ఉపసంహరించుకోవాలని, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్, సీఐటీయూ జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యూ ధర్నా

విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ ఫీజు రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిఎలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సోమవారం పీడీఎస్‌యూ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, ఇప్పటికైనా వెంటనే ఫీజు రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, లేదంటే రాబోయే రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అలువాల నరేష్, వి.కావ్య, వినయ్, వంశీ, శ్రీజ, సాధన తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట జీవో కాపీలు దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

మంద కృష్ణ జన్మదినం


ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు


కేక్‌కట్ చేస్తున్న రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, డైరెక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ తదితరులు

వరంగల్ లీగల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని మాదిగ లాయర్స్ ఫెడరేషన్(ఎంఎల్ఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం న్యాయవాదులు ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేసి సంబరాలు చేసుకున్నారు. అదే విధంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజును కూడా ఘనంగా నిర్వహించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల ఎంఎల్ఎఫ్ అధ్యక్షుడు కొంగర పూర్ణచందర్, గోవింద్ నాగభూషణం నేతృత్వంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ బైరపాక జయాకర్, ప్రత్యేక ఆహ్వానితులుగా హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు పులి సత్యనారాయణ, వలుస సుధీర్ కుమార్, ఉపాధ్యక్షుడు మైదం జైపాల్, ఎంఎల్ఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల అనిల్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంతపూరి రమేష్, ఉపాధ్యక్షుడు ముఖేష్, స్పోర్ట్స్ సెక్రటరి మల్లేశ్, కార్యవర్గ సభ్యులు మహేందర్, న్యాయవాదులు అల్లం నాగరాజు, కె. కృష్ణ, సాల్మన్ రాజ్, రవీందర్, జిలుకర శ్రీనివాస్, ప్రభాకర్, చంద్రకాంత్, ఇ . మహేందర్, సురేందర్, శ్రీనివాస్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కేయూలో..

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో సోమవారం ఎమ్మార్పీఎస్ అవిర్భావంతో పాటు ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేయూ మొదటి గేటు వద్ద జరిగిన సంబురాల్లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. మంద కృష్ణ పోరాట పటిమ గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి, మంద భాస్కర్, డాక్టర్ వడ్డేపల్లి మధు, జీడీ రమేశ్, పాలమాకుల కొమురయ్య, పులి శ్రీనివాస్, మంద నరేశ్, రాణా ప్రతాప్, కల్లపల్లి ప్రశాంత్, రాకేశ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రేటర్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఇమ్మడి రాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అలాగే మంద కృష్ణ మాదిగ జన్మదినోత్సవం సందర్భంగా కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బొడ్డు దయాకర్ మాదిగ, కాంగ్రెస్ 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీమగాని యాదగిరి గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింత రమేష్ గౌడ్ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ నేత నలుబాల దామోదర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నేతలు ఇమ్మడి వెంకటేష్, కందుకూరి రాజ్‌కుమార్, దేవునూరి శంకర్, ఇమ్మడి రాజేంద్రప్రసాద్, డాక్టర్ వీరస్వామి, ఇమ్మడి శ్రీనివాస్, ఇమ్మడి పవన్ తదితరులు పాల్గొన్నారు.

న్యూశాయంపేటలో..

న్యూశాయంపేట (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఆ పార్టీ అధినేత మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను సోమవారం న్యూశాయంపేట జంక్షన్‌లో జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ పార్టీ జెండా ఎగురవేశారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు కందుకూరి సోమన్న, చిప్పలపల్లి సోమశేఖర్, మంద ఇద్దయ్య, జన్ను దినేష్, గద్దల సుకుమార్, దూడల శ్రీనివాస్, కామగోని బాలకిషన్ గౌడ్, సారంగం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకులగూడెంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రధాన కార్యదర్శి పి. పున్నంచందర్ ఆధ్వర్యంలో న్యాయవాది మాచర్ల మహేశ్‌చంద్ర జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుదాస్, రాజు, క్రిష్టఫర్, సునీల్, సందీప్, ప్రశాంత్, కరుణాకర్, కుమారస్వామి, అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కాజీపేట చౌరస్తాలో మంద కృష్ణ మాదిగ జన్మదినం, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారు సురేంద్ర మాదిగ, చిన్నరాజయ్య మాదిగ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కుమ్మరి శ్రీనివాస్, స్వరాజ్, మహేశ్, వెంకటస్వామి, కిరణ్, రాజ్‌కుమార్, సతీష్, నాగరాజు, కుమార్, శ్రీనివాస్, కుమార్, రాజ్‌కుమార్, జయాకర్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండలో..

బాలసముద్రం (ఆంధ్రజ్యోతి): మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఇన్‌చార్జి మంద రాజు మాదిగ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. అలాగే మంద కృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంఈఎఫ్ జాతీయ నేతలు కుమ్మరి రాజన్న మాదిగ, ఎల్తూరి దిలీప్‌తో పాటు బి. దయాకర్ మాదిగ కేక్ కట్ చేసి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆకారపు మురళి, తోట శ్రీనివాస్, మునిగాల రవి, కరుణాకర్, కార్తీక్, సంపత్, నెల్సన్, రాజు, వీరేందర్, సుమలత, సుజాత, రమ, సదానందం మాదిగలు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఉన్నతాధికారులు


గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న మేయర్, కమిషనర్, సీపీ

వరంగల్ కార్పొరేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేయూలో సోమవారం జరిగిన స్నాతకోత్సవానికి హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, నగర మేయర్ గుండు సుధారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్ఐటీ అతిథి గృహంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని వారు గవర్నర్‌ను కోరారు. వరంగల్ క్రైం: కేయూ స్నాతకోత్సవానికి హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సోమవారం నిట్ అతిథి గృహంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసింగ్ పనివిధానాన్ని గవర్నర్ అడిగి తెలుసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన 55 మందిని సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాలాచారి ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. సీతారెడ్డి తెలిపారు. మిగితా 52 మందికి రూ. 55,200జరిమానా విధించారని అన్నారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండావాహనం నడిపిన 20 మందికి రూ.12,200జరిమానా విధించారని సీఐ తెలిపారు.

పెట్టుబడిదారుల ఏజెంట్ ప్రధాని మోదీ

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


వేయి స్తంభాల ఆలయం ముందు నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పెట్టుబడిదారులకు ఏజెంట్‌గా వ్యవహరిస్తూ, కార్మికుల పొట్టకొట్టడానికి 4లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం హనుమకొండ వేయి స్తంభాల ఆలయం నుంచి కలెక్టరేట్ వరకు చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. లేబర్ కోడ్‌లను ప్రధాని మోదీ వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న ఏకశిల పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న కార్మిక మహా ప్రదర్శనలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పలయ్య, రాగుల రమేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కూర వెంకట్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కు రాజుగౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సారంగపాణి, నాయకులు బొట్ల చక్రపాణి, గొడుగు వెంకట్, ధర్మరాజు, పూర్ణచందర్, వీరన్న, షైముదా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న ఏకైక అతిపెద్ద సంఘం, ఏ రాజకీయ పార్టీ భావజాలానికి దగ్గర లేని సంఘం పీఆర్‌టీయూ అని, సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి కోరారు. వరంగల్‌లోని ఆకుతోట కన్వెన్షన్ హాలులో సోమవారం జరిగిన పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తన ను గెలిపించిన ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగ, ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లా శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి, పల్లి శ్రీహరి, ఈదునూరి రవీందర్‌రెడ్డి, లక్కిరెడ్డి మహేందర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 నుంచి 13వరకు గద్వాల జిల్లా ఉత్తనూర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర (అంతర్ జిల్లాల) స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్టును సోమవారం ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డోలి సాంబయ్య తెలిపారు. కాజీపేట ఫాతిమానగర్ లోని మాన్‌ఫర్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-18బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు అంతర్ జిల్లాల స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని సాంబయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తాళ్లపెల్లి రాజు, పీఈటీలు విజయ్‌కుమార్, సునిలా, కోచ్‌లు ఎండీ. ఇర్ఫాన్, యశ్వంత్, సీనియర్ క్రీడాకారులు సాగర్, సందీప్ పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే...

బాలుర విభాగంలో : అక్షిత్, శ్రీవైభవ్, మాషూక్, రెహన్, షాహిద్, షహన్, సాత్విక్, భువన్ ఆద్య, మసూద్, అభినవ్, రిషి, హర్ష ఎంపికయ్యారు. బాలికల విభాగంలో: మేరి హసిని, యుక్తి, తేజస్వి, వేలిక, మీనాక్షి, శరన్, సహస్ర, భార్గవి, పూర్విక, యోగస్విని సుదీక్ష, సహస్రపటేల్ ఉన్నారు. వీరు అంతర్ జిల్లాల స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

ఆవిష్కరణలకు అటల్ ల్యాబ్‌లు దోహదపడాలి

జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి


సమావేశంలో పాల్గొన్న సైన్స్ జిల్లా అధికారి శ్రీనివాసస్వామి

హసన్‌పర్తి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మక ఆవిష్కరణలకు అటల్ థింకరింగ్ ల్యాబ్‌లు దోహదపడాలని సైన్స్ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో హనుమకొండ జిల్లాలోని 13పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలకు మంజూరైన అటల్ థింకరింగ్ ప్రయోగశాలల నిర్వహణ కోసం ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. వారికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం హెచ్ఎం సుమాదేవి అధ్యక్షతన సోమవారం ప్రారంభమైంది. కోర్సు డైరెక్టర్‌గా సైన్స్ జిల్లా అధికారి, అటల్ థింకరింగ్ నోడల్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి హాజరై మాట్లాడారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం కోసం ఈ ప్రయోగశాలలు ఉపయోగపడుతాయన్నారు. కోర్సు డైరెక్టర్ బండారు మన్మోహన్ మాట్లాడుతూ ఒక్కో పాఠశాలలో రూ.10 లక్షల వ్యయంతో అటల్ థింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్రీ య బండార్ హైదరాబాద్ రీసోర్స్ సభ్యులు బొక్క సతీష్, ఈర్ల అన్వేష్, ఈర్ల సుధీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉమ్మడి జిల్లా జేఏసీ చైర్మన్ మల్లయ్య



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ చందా మల్లయ్య

వడ్డేపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని బీసీ, ఎస్సీ ఎస్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ చైర్మన్ చందా మల్లయ్య అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ ఆయా గ్రామాల నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించాలని కోరారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మాదిరిగా బీసీ విద్యార్థులందరికీ ఉన్నత చదువుల్లో ర్యాంకులతో సంబంధం లేకుండా 10 వేల లోపు ర్యాంకు నిబంధన తొలగించి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులందరికి ఉచిత భోజనం, వసతి, వైద్యం అందించాలన్నారు. సమావేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వరంగల్ ఉమ్మడి జిల్లా జేఏసీ కోఆర్డినేటర్లు పొదిల సాయిబాబా, మేకల సుమన్, గుగులోత్ రాజన్న, మందపెల్లి రవీందర్, సురేష్, రత్నాకర్, ఏసోబు, క్రాంతి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మీకు తెలుసా?

అరచేతుల్లో ఆరోగ్యం

అరచేతుల ఉష్ణోగ్రత పేగుల ఆరోగ్యాన్ని సూచిస్తుందని వైద్యులంటున్నారు. వెచ్చని, చల్లని అరచేతులు భిన్నమైన ఆరోగ్య పరిస్థితులకు అద్దం పడతాయని వైద్యులు భావిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

చేతుల ఉష్ణోగ్రత, శరీరంలోని రక్తప్రవాహం, శరీర వేడి నియంత్రణ సామర్థ్యం, నాడీ వ్యవస్థ సంతులనం లాంటి కీలకమైన వివరాలను అందిస్తుందని చెన్నైలోని శ్రీ బాలాజీ మెడికల్ సెంటర్ డైటీషియన్, దీపాలక్ష్మి పేర్కొంటున్నారు. పేగుల్లో నివసించే సూక్ష్మక్రిములు శరీర తాపమనాన్ని నియంత్రిస్తూ ఉంటాయి. కాబట్టి యాంటీ బయాటిక్స్‌తో ఆ సూక్ష్మజీవుల మోతాదు అస్తవ్యస్థమైనప్పుడు, ఆ ప్రభావం శరీర ఉష్ణోగ్రతను హెచ్చుతగ్గులకు లోను చేస్తోందని అంటున్నారామె. పేగుల ఆరోగ్యం, నాడీ వ్యవస్థల పనితీరు మెరుగ్గా ఉన్నప్పుడు అరచేతులు వెచ్చగా ఉంటాయి. ఒకవేళ అరచేతులు చల్లగా ఉంటే, రక్తప్రవాహం మెరుగ్గా లేదనీ, ఒత్తిడి విపరీతంగా ఉందనీ, శరీరం మెరుగ్గా పని చేయడం లేదనీ అర్థం చేసుకోవాలి. ఈ ప్రత్యక్ష లక్షణాలు పేగుల్లోని ఉపయోగకరమైన సూక్ష్మజీవుల మోతాదును కనిపెట్టడానికి పనికొస్తాయి. కాబట్టి వాటిని పెంచుకునే ఆహార నియమాలను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని అంటున్నారామె.



పరిశోధన

పొట్ట కొవ్వుతో సోరియాసిస్ ముప్పు

పొట్ట భాగంలో కొవ్వు పేరుకు పోవడం వలన దీర్ఘకాలిక చర్మ సంబంధిత వ్యాధి సోరియాసిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని యూకే పరిశోధకులు కనుగొన్నారు. అందుకు సంబంధించిన వివరాలు తెలుసుకుందాం..



పొట్ట భాగంలో కొవ్వుకూ, సోరియాసిస్‌కూ మధ్య ఎంతో దగ్గరి సంబంధం ఉందనీ, సోరియాసిస్‌కు బెల్లీ ఫ్యాట్ ఓ ప్రధాన కారణమని పరిశోధకులు తాజాగా కనిపెట్టారు. ఇందుకోసం నడుము, కటి నిష్పత్తి, పొత్తికడుపు కొవ్వు నిష్పత్తి, నడుము చుట్టుకొలత, పొట్ట చుట్టూరా ఉన్న మొత్తం కొవ్వు కణజాలాలతో పాటు శరీరంలోని 25 వేర్వేరు శరీరావయవాల్లోని కొవ్వు పరిమాణాలను పరిశీలించారు. ప్రత్యేకించి నడుము చుట్టూరా కొవ్వు ఎక్కువగా ఉన్న వారికీ సోరియాసిస్‌కూ దగ్గరి సంబంధం ఉన్నట్టు ఈ ప్రయోగం ద్వారా పరిశోధకులు కనిపెట్టారు. సోరియాసిస్‌కు జన్యు మూలాలు కూడా లేకపోలేదు. అయినప్పటికీ పొట్ట దగ్గర కొవ్వు కలిగిన వారికి ఈ ముప్పు ఎక్కువగా ఉంటోంది. మరీ ముఖ్యంగా మహిళలకు ఈ ముప్పు మరింత ఎక్కువ. అలాగే బాడీ మాస్ ఇండెక్స్ ద్వారా ఊబకాయం ఏ స్థాయిలో ఉందో అంచనా వేయగలుగుతున్నప్పటికీ, దీని ద్వారా సోరియాసిస్ ముప్పును కచ్చితంగా అంచనా వేయలేమని కూడా పరిశోధకులు పేర్కొంటున్నారు. అయితే సోరియాసిస్ ముప్పు విషయంలో, శరీరంలో కొవ్వు పేరుకున్న ప్రదేశం కీలకంగా మారుతుందనీ, నడుము చుట్టూరా పేరుకున్న కొవ్వు సోరియాసిస్ ముప్పును పెంచుతుందని తామీ ప్రయోగం ద్వారా కనిపెట్టినట్టు పరిశోధకులు పేర్కొంటున్నారు.

యాంటీ ఏజింగ్



బాలీవుడ్ నటి షెఫాలీ షా మరణంతో, యాంటీ ఏజింగ్ చికిత్సలు ప్రశ్నార్థకంగా మారాయి. ఈ చికిత్సల్లో భాగంగా తీసుకునే ఇంజెక్షన్లు, పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కాస్మటిక్ క్లినిక్స్ ఏ మేరకు సురక్షితం? వైద్యులేమంటున్నారో తెలుసుకుందాం!

యవ్వన చికిత్సలు ఆచితూచి

సౌందర్య చికిత్సలన్నీ ప్రమాదకరమైనవి కావు. నిజానికి తగిన అర్హతలు, అనుభవం, సామర్థ్యం ఉన్న వైద్యుల పర్యవేక్షణలో ఈ చికిత్సలతో అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చు. పైబడే వయసుతో ముఖంలో చోటుచేసుకునే మార్పులను సరిదిద్దడానికి పలు రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. యాంటీ ఏజింగ్‌లో భాగంగా 'గ్లూటాథయాన్' అనే ఇంజెక్షన్‌తో వైటెనింగ్ ట్రీట్మెంట్ తీసుకోవడంతో పాటు, యాంటీఆక్సిడెంట్లు కూడా తీసుకోగలిగితే, ఫలితం మెరుగ్గా ఉంటుంది. వీటితో పాటు ముఖం మీద వృద్ధాప్య ఛాయలను దూరం చేయడం కోసం స్కిన్ హైడ్రేషన్, ఫిల్లర్స్, కొల్లాజెన్ స్టిమ్యులేటర్స్, బొటాక్స్ లాంటివి అందుబాటులో ఉన్నాయి. అయితే ఇవన్నీ పరిమితి మేరకు వాడుకున్నప్పుడే సహజసిద్ధ ఫలితం సొంతమవుతుంది. ఉదాహరణకు గ్లుటాథయాన్ తీసుకున్నప్పుడు, చర్మం తెల్లబడడంతో పాటు, నునుపుదనం పెరుగుతుంది. అయితే వైద్యులు సూచించిన మోతాదుకు మించి తీసుకుంటే, కచ్చితంగా దుష్ప్రభావాలను భరించవలసి ఉంటుంది.

గ్లూటాథయాన్ సురక్షితమే!

ఈ మందు మాత్రలు, ఇంజెక్షన్ల రూపంలో దొరుకుతుంది. అయితే మాత్రలతో పోలిస్తే, ఇంజెక్షన్లు మెరుగైన ఫలితాన్నిస్తాయి. ఇంజెక్షన్ కూడా సెలైన్ ద్వారానే ఇవ్వవలసి ఉంటుంది. ఈ ఇంజెక్షన్ ప్రభావం నాలుగు నుంచి ఐదు వారాల పాటు ఉంటుంది. తర్వాత కూడా నెలకు ఒకటి లేదా రెండు ఇంజెక్షన్లు తీసుకోగలిగితే, అదే ఫలితం మరికొంత కాలం కొనసాగుతుంది. వీటిని తీసుకోవడం మానేస్తే, రెండు మూడు నెలల్లో పూర్వపు స్థితికి చేరుకుంటారు. కాబట్టి యవ్వనంగానే కనిపించాలని కోరుకునే వారు, వైద్యుల పర్యవేక్షణలో వాళ్లు సూచించినంత కాలం ఈ ఇంజెక్షన్లు తీసుకోవచ్చు. వీటిని క్రమం తప్పక తీసుకున్నప్పుడు, రెండు నుంచి మూడు రెట్లకు చర్మపు రంగు మెరుగుపడుతుంది. 16 ఏళ్లు దాటిన యువతులు, 17 ఏళ్లు దాటిన యువకులు ఈ ఇంజెక్షన్లు తీసుకోవచ్చు. అయితే గ్లూటాథయాన్ ఇంజెక్షన్లను సరిపడా మోతాదులో, సరైన పద్ధతిలో తీసుకోలేకపోతే, ఫలితం ఉండదు. ఈ ఇంజెక్షన్ ఇవ్వడానికి కూడా కొన్ని నియమాలు పాటించాలి. దీని కంటే ముందు శరీరాన్ని సిద్ధం చేయడం కోసం, 45 నిమిషాల పాటు విటమిన్ సి, విటమిన్ బి6 లాంటి పోషకాలతో ఐవి అందించి, ఆ తర్వాతే గ్లూటాథయాన్‌ను సెలైన్ ద్వారా ఇవ్వవలసి ఉంటుంది. అప్పుడు మాత్రమే ఆ ఔషధాన్ని శరీరం శోషించుకుని, సమర్థంగా వినియోగించుకోగలుగుతుంది. అలాగే సెలైన్‌ను ముదురు రంగు వస్త్రంతో కప్పవలసి ఉంటుంది. లేదంటే ఔషధ ప్రభావం సన్నగిల్లుతుంది.

పలు రకాల చికిత్సలతో...

పైబడే వయసు సూచనలను తగ్గించుకుని, యవ్వనంగా కనిపించడం కోసం సమతులాహారం తీసుకోవడంతో పాటు కంటి నిండా నిద్రపోవాలి. అయినప్పటికీ వాతావరణ కాలుష్యం, శరీరంలోకి చేరుకునే రసాయనాల వల్ల 30 ఏళ్లకే చర్మం రంగు తగ్గడం,



ఎగుడుదిగుడుగా మారడం లాంటి మార్పులు చోటు చేసుకుంటూ ఉంటాయి. చర్మం బిగుతుగా ఉన్నప్పుడే యవ్వనంగా కనిపిస్తాం. కాబట్టి అందుకోసం చర్మ తత్వం ఆధారంగా మాయిశ్చరైజర్ వాడుకోవచ్చు. అలాగే చర్మం మీద మృత పొర తొలగకపోయినా, చర్మం నిర్జీవంగా కనిపిస్తుంది. కాబట్టి ఆ పొర తొలగిపోవడం కోసం విటమిన్ ఎ కలిగిన రెటినాల్‌ను మూడు నుంచి ఆరు నెలల పాటు వాడుకుంటే ఫలితం ఉంటుంది. అలాగే పైబడే వయసులో వేధించే మరొక సమస్య, మంగు. మంగులో, మెలాస్మా సమస్య సర్వసాధారణం. దీన్ని తొలగించడం కోసం లేజర్‌తో పాటు, ముఖ చర్మంలోకి ఇంజెక్షన్లు, పైపూత మందులు వాడుకోవచ్చు. వీటిలో పైపూత మందులు అంతగా ప్రభావాన్ని కనబరచవు. కంటి కింద నలుపు, వలయాలకు పిగ్మెంట్ కారణమైతే, అందుకు తగిన చికిత్సను వైద్యులు ఎంచుకుంటారు. కొందరికి సన్నని గీతలు ఏర్పడి చర్మం కుంచించుకుపోయి, ఆ కారణంగా కంటి కింద నలుపు ఏర్పడుతుంది. కాబట్టి ఆ ప్రదేశంలోని చర్మం ఉబ్బినట్టు కనిపించడం కోసం బూస్టర్లను అందించవలసి ఉంటుంది. ఈ బూస్టర్లు, శరీరంలోని నీటిని పీల్చుకుని ఉబ్బినట్టుగా మారి చర్మపు నలుపు తగ్గుతుంది.

సాగిన చర్మం కోసం...

సాగిన చర్మాన్ని పైకి లాగి, బిగుతును పెంచే చికిత్సలు కూడా ఉన్నాయి. ఇందుకోసం థ్రెడ్స్ ఉపయోగిస్తారు. ప్రస్తుతం చర్మంలోకి చొప్పించి, వాటిని అలాగే వదిలేసే థ్రెడ్స్ కూడా అందుబాటులోకొచ్చాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి కాబట్టి చర్మం బిగుతును సంతరించుకుంటుంది. డీప్ ప్లేన్ ఫేస్‌లిఫ్ట్, ఎండోస్కోపీ ఫేస్ లిఫ్ట్ అనే ఆధునిక చికిత్సలు కూడా ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. వీటితో మచ్చలు తక్కువ, ప్రభావం ఎక్కువ. ఈ ప్రభావం దీర్ఘ కాలం పాటు నిలిచి ఉంటుంది. కొద్ది మేరకు ముఖ చర్మం సాగిన వారికి ఈ చికిత్సతో అద్భుతమైన ఫలితం సాధించవచ్చు. ఎక్కువ సాగిన వారికి వరుస చికిత్సలు అవసరమవుతాయి. చర్మం ఉపరితలం అడుగున చేసే చికిత్సల తదనంతరం నాలుగైదు రోజుల పాటు చర్మాన్ని రుద్దుకోకుండా ఉండాలి. అలాగే సన్‌స్క్రీన్ వాడుకోవాలి. లేజర్ చికిత్స తీసుకున్నప్పుడు ఏడు నుంచి పది రోజుల పాటు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ క్రీమ్స్, మాయిశ్చరైజర్లు వాడుకోవాలి. థ్రెడ్ లిఫ్ట్ చికిత్స తదనంతరం ఐదు నుంచి ఏడు రోజులు చర్మాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఫేస్ లిఫ్ట్ సర్జరీ తదనంతరం మూడు నుంచి ఐదు వారాల పాటు జాగ్రత్తగా ఉండాలి.

చర్మపు బిగుతు

చర్మపు బిగుతును తాత్కాలికంగా పెంచే మిషన్లు కూడా అందుబాటులో ఉన్నాయి. రేడియో ఫ్రీక్వెన్సీ, మైక్రో నీడ్లింగ్ ఈ కోవకు చెందినవే! ఇవి చర్మపు కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి, నునుపును పెంచుతాయి. దాంతో చర్మం సాగే తత్వం కొంత కాలం పాటు వాయిదా పడుతుంది.

చవక బేరం ప్రమాదమే!

ఆన్‌లైన్‌లో ఒక వస్తువు కొనేటప్పుడు రివ్యూలు చదివి, ఒకటికి నాలుగు వెబ్‌సైట్లు చూసి, నమ్మకం కుదిరిన తర్వాతే కొనుగోలు చేస్తూ ఉంటాం. అలాంటప్పుడు శరీరంలో అత్యంత ముఖ్య భాగమైన ముఖాన్నే వాళ్ల చేతుల్లో పెట్టేటప్పుడు, ఇంకెంత జాగ్రత్తగా ఉండాలో ఎవరికి వారు ఆలోచించుకోవాలి. సౌందర్య చికిత్సల విషయంలో రాజీ పడిపోవడం సరి కాదు. చవకలో దొరికే చికిత్సల ప్రభావం తక్కువగా ఉండడమే కాకుండా, వాటిలో ఉపయోగించే ముడి పదార్థాలు నాసిరకానికి చెందినవి కావడంతో, దుష్ప్రభావాలు తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. కాబట్టి చికిత్స అందించే అర్హతలు, అదనపు శిక్షణ, అనుభవం, పరిజ్ఞానం ఉన్న డెర్మటాలజిస్టులు, ప్లాస్టిక్ సర్జన్‌లను మాత్రమే ఎంచుకోవాలి.

ఆరోగ్యంగా ఉంటే, యవ్వనంగా కనిపిస్తాం! కాబట్టి సహజసిద్ధంగా ఆరోగ్యంగా ఉంచే ఆహారశైలి, జీవనశైలి అనుసరించాలి. సమతులాహారం, వ్యాయామం చర్మాన్ని యవ్వనంగా ఉంచుతాయి. శాకాహారులు యవ్వనంగా కనిపించడమే కాకుండా, ఎక్కువ కాలం జీవిస్తారని అధ్యయనాల్లో రుజువైంది. కాబట్టి మాంసాహారాన్ని పరిమితం చేయాలి. పీచు ఎక్కువగా తీసుకోవాలి. అలాగే చర్మ రక్షణ చేపట్టాలి. అందుకోసం ఉపయోగించే ఉత్పత్తులు నాణ్యమైనవి అయి ఉండాలి. చవక ఉత్పత్తులకు బదులుగా సురక్షితమైన ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి. రాత్రివేళ చర్మాన్ని శుభ్రపరుచుకుని, మాయిశ్చరైజర్లతో తేమగా ఉంచుకోవాలి. సన్‌స్క్రీన్స్‌తో ఎండ నుంచి చర్మాన్ని రక్షించుకోవాలి.

డాక్టర్ సుధాకర్ ప్రసాద్
సీనియర్ కన్సల్టెంట్ కాస్మటాలజీ అండ్ ప్లాస్టిక్ సర్జరీ,
అపోలో హాస్పిటల్స్, జూబ్లీహిల్స్,
హైదరాబాద్.



వానాకాలం వెతలు

ఊపిరితిత్తులు ఇలా సురక్షితం

వానాకాలంలో ఊపిరితిత్తుల సమస్యలు విజృంభించడం సహజం. అయితే అప్రమత్తంగా వ్యవహరిస్తూ, సమర్థమైన మందులను ఎంచుకోగలిగితే, ఊపిరితిత్తుల వ్యాధులకు అడ్డుకట్ట వేయొచ్చు అంటున్నారు వైద్యులు.

వానాకాలంలో ఎక్కువగా వైరల్ ఇన్‌ఫెక్షన్లు విజృంభిస్తాయి. అయితే అలర్జీ తత్వం ఉన్న వాళ్లు, ఉబ్బసం ఉన్న వాళ్లలో ఈ కాలం ఆ రుగ్మతలు తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. అలాగే ఈ కాలంలో చోటుచేసుకునే వాతావరణ మార్పుల వల్ల, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి అయిన సిఒపిడి రోగుల్లో ఆ సమస్య మరింత తీవ్రమవుతూ ఉంటుంది. అలాగే రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్న వారు, మధుమేహం, అధిక రక్తపోటు, మూత్రపిండాల మార్పిడి రోగులు, కీమోథెరపీ తీసుకుంటున్న క్యాన్సర్ రోగులు, తీవ్రమైన గుండెజబ్బులున్న వారు... ఇలా ఇతరత్రా ఆరోగ్య సమస్యలున్న వారికి వైరల్ ఇన్‌ఫెక్షన్ ప్రభావం ఊపిరితిత్తుల మీద అధికంగా ఉంటుంది. ఫలితంగా ఇన్‌ఫెక్షన్ శ్వాసనాళానికే పరిమితమవకుండా, ఊపిరితిత్తుల్లోకి కూడా ప్రయాణించి, వైరల్ న్యుమోనియా తలెత్తుతుంది.

వైద్యులను ఎప్పుడు కలవాలి?

వానాకాలంలో దగ్గులు, జలుబులు సర్వసాధారణం. ఇవి మూడు నుంచి ఐదు రోజుల పాటు వేధిస్తాయి. అయితే ఉన్న వాటికి కొత్త లక్షణాలు తోడైనప్పుడు వెంటనే అప్రమత్తం కావాలి. అవేంటంటే...



- లక్షణాలు ఐదు రోజులకు మించి కొనసాగినా...
- క్రమేపీ లక్షణాల తీవ్రత పెరుగుతున్నా
- విపరీతమైన నీరసం ఆవరించినా
- కళ్లు తిరుగుతున్నా
- విపరీతమైన డీహైడ్రేషన్‌కు గురైనా
- రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గినా
- గుండె వేగం పెరిగినా

అలాగే సిఒపిడి, ఉబ్బసం ఉన్న వారికి అప్పటికే ఉన్న లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. పిల్లికూతలు, కొన్ని అడుగులు నడకకే ఆయాసం అనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను కలవాలి.

వ్యాక్సిన్లతో అడ్డుకట్ట

ఫ్లూ వ్యాక్సిన్: ఫ్లూతో ఊపిరితిత్తుల శక్తి సన్నగిల్లే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రతి ఏడాదీ ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవాలి

న్యూమోకోకల్ వ్యాక్సిన్: ప్రివెనార్ 13, న్యుమోవ్యాక్స్ 23 అనే రెండు రకాల ఫ్లూ వ్యాక్సిన్లు ఉంటాయి. 65 ఏళ్లు పైబడిన వాళ్లు, 50 ఏళ్లు పైబడి, దీర్ఘకాలిక జబ్బులున్న వారు ఈ వ్యాక్సిన్లను తప్పనిసరిగా తీసుకోవాలి. ఫ్లూ వ్యాక్సిన్‌ను ఏడాదికోసారి, న్యూమోకోకల్ వ్యాక్సిన్‌ను ఐదేళ్లకోసారి తీసుకోవాలి.

డిపిటి వ్యాక్సిన్: సిఒపిడి రోగులు ఈ వ్యాక్సిన్ వేసుకోవడం మంచిదనే మార్గదర్శకాలు తాజాగా విడుదలయ్యాయి.

షింజిల్స్ వ్యాక్సిన్: సిఒపిడి రోగులు, రోగనిరోధకశక్తి తగ్గిపోయిన వారు హెర్పిస్ జోస్టర్ ఇన్‌ఫెక్షన్ తిరిగి ప్రేరేపితమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి దాన్ని నియంత్రించడం కోసం షింజిల్స్ వ్యాక్సిన్ తీసుకోవాలి.



సమర్థమైన చికిత్సలున్నాయి

మునుపటితో పోలిస్తే, ప్రస్తుతం చికిత్సా ప్రక్రియలు మరింత పురోగతి సాధించాయి. మునుపు లక్షణాల ఆధారంగా మందులను సూచించేవారు. కానీ ఇప్పుడు జబ్బు తీవ్రతను అంచనా వేసి చికిత్సను నిర్ధారించడం కోసం ఎక్స్ రే, సిటి స్కాన్‌లు, ఊపిరితిత్తుల పనితీరును అంచనా వేయడానికి పల్మొనరీ ఫంక్షన్ పరీక్ష అందుబాటులోకొచ్చాయి. అలాగే ఇన్‌ఫెక్షన్ రకాన్ని తెలుసుకోవడం కోసం ఊపిరితితుల్లోని కఫాన్ని సేకరించి పరీక్షించే బ్రాంకోస్కోపీ పరీక్ష కూడా ఇప్పుడు అందుబాటులో ఉంది. అలాగే సిఒపిడి రోగులకు కొత్త మందులు కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. ఆక్సిజన్ మోతాదు తగ్గిపోయిన వారికి ఇంట్లోనే వాడుకునే వీలుండే లాంగ్ టర్మ్ ఆక్సిజన్ థెరపీ, బైపాప్ సపోర్ట్ పరికరాలు కూడా అందుబాటులోకొచ్చాయి. అలాగే ఇంతకు ముందు తాత్కాలికంగా తక్షణ ప్రభావాన్ని కనబరిచే ఇన్‌హేలర్లు మాత్రదే దొరికేవి. కానీ ఇప్పుడు దీర్ఘకాలం పాటు పని చేసే ఇన్‌హేలర్లు దొరుకుతున్నాయి. ఈ ఇన్‌హేలర్‌ను రోజుకు ఒక్కసారి పీల్చినా, దాని ప్రభావం ఎక్కువ సమయం పాటు పని చేయడమే కాకుండా, ఊపిరితిత్తుల సామర్థ్యం కూడా పెరుగుతుంది.

నియంత్రణ ఇలా...

వానాకాలంలో ఊపిరితిత్తుల సమస్యలకు అడ్డుకట్ట వేయడం కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

- ముందు నుంచి ఊపిరితిత్తుల వ్యాధులున్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు జనసమ్మర్ద ప్రదేశాల్లో, కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో మాస్క్ ధరించాలి
- చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి
- జలుబు, దగ్గు ఉన్నప్పుడు మాస్క్ పెట్టుకోవడం ద్వారా వ్యాధి ఇతరులకు సోకకుండా నియంత్రించవచ్చు
- ధూమపానం మానేయాలి
- ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి
- ప్రాణాయామం లాంటి శ్వాస వ్యాయామాలు చేయాలి
- రోజుకు కనీసం 20 నుంచి 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.

డాక్టర్ జి.ఐ.సుస్మిత రెడ్డి
కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మొనాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరు.



అధ్యయనం

రీసైకిల్డ్ ప్లాస్టిక్‌తో ప్రమాదం...

రీసైకిల్ చేసిన ప్లాస్టిక్‌లో ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం చూపించే విష రసాయనాలు ఉన్నాయని తాజా అధ్యయనంలో తేలింది. ఆ వివరాలివీ...



ప్లాస్టిక్ వాడడం మంచిది కాదని అందరికీ తెలుసు. అయినా ప్లాస్టిక్ వాడకం తగ్గడం లేదు. ఈ వస్తువుల వాడకం తీవ్రస్థాయికి చేరడంతో ప్లాస్టిక్ ఉత్పత్తిని తగ్గించడం కోసం రీసైక్లింగ్ విధానాన్ని వాడుకలోకి తీసుకొచ్చారు. అయితే ప్లాస్టిక్‌లోని 80 రకాల రసాయన సమ్మేళనాలు, విష పదార్థాలు రీసైకిల్ ప్రక్రియలో మరింత విషపూరితంగా మారి ఆ ఉత్పత్తులలోకి చేరతాయనే ఒక అధ్యయనం, జోర్నల్ ఆఫ్ హజార్డస్ మెటీరియల్స్‌లో తాజాగా ప్రచురితమైంది. రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ ఉత్పత్తులు ఆ విష రసాయనాలను నీటిలోకి విడుదల చేస్తున్నాయనీ, ఆ రసాయనాలు ఊబకాయాన్నీ, క్యాన్సర్ల ముప్పునూ పెంచుతాయనీ పరిశోధకులు పేర్కొంటున్నారు. అలాగే హార్మోన్ల స్రావాలను తీవ్రంగా ప్రభావితం చేయడంతో పాటు పిల్లల్లో ఎదుగుదలను నిరోధించడం, శరీరం శక్తిని ఖర్చు చేసే వేగాన్ని దెబ్బ తీయడం, పునరుత్పత్తి వ్యవస్థను నిర్వీర్యం చేయడం లాంటి ముప్పులను పెంచుతాయని పరిశోధకులు కొన్ని ప్రయోగాల ద్వారా కనిపెట్టడం జరిగింది. ఇందుకోసం వారు ప్రపంచంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి సేకరించిన రీసైకిల్డ్ ప్లాస్టిక్ పెల్లెట్స్‌ను 48 గంటల పాటు నీళ్లలో నానబెట్టారు. ఆ తర్వాత జెబ్రాఫిష్ లార్వేను ఐదు రోజుల పాటు ఆ నీళ్లకు బహిర్గతం చేశారు. ఈ ప్రయోగంలో, ఆ లార్వేలోని లిపిడ్ మెటబాలిజం, అంతఃస్రావ గ్రంథుల పనితీరుల్లో అవకతవకలు చోటు చేసుకోవడాన్ని వాళ్లు గమనించడం జరిగింది. కాబట్టి ప్లాస్టిక్, రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ వాడకానికి వీలైనంత దూరంగా ఉండడం ఉత్తమం.

అప్రమత్తం

డెంగుకు గురి కాకుండా...

వానలు ఊపందుకున్నాయి. వాటితో పాటే దోమలు కూడా. మరీ ముఖ్యంగా డెంగు దోమలు ఈ కాలంలో ఉధృతంగా పెరిగిపోతాయి. కాబట్టి వాటి బెడద లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

ఈడిస్ ఈజిప్టై అనే దోమ ప్రధానంగా డెంగూ వైరస్‌ను వ్యాప్తి చేస్తుంది. ఈ వైరల్ ఇన్‌ఫెక్షన్.. విపరీతమైన జ్వరం, భరించలేనంత తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులతో వేధిస్తుంది. కాబట్టి ఈ వైరస్ వ్యాప్తికి తోడ్పడే దోమలు ఇంటి పరిసరాల్లో లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకోసం....

- పూల తొట్లు, వాటి సాసర్లు, పాత టైర్లు, బక్కెట్లు, నీళ్లు నిల్వ ఉండే వీలుండే పాత్రలన్నిటినీ ఖాళీ చేయాలి. అలాగే డ్రెయిన్లు, గట్టర్లలో అవరోధాలు ఏర్పడి, నీరు నిల్వ ఉండిపోకుండా చూసుకోవాలి.
- పొడవు చేతుల చొక్కాలు, ప్యాంట్లు ధరిస్తూ, సాధ్యమైనంత మేరకు శరీరాన్ని కప్పి ఉంచే ప్రయత్నం చేయాలి.
- దోమ తెరలు వాడుకోవాలి. కిటికీలు, తలుపులకు స్క్రీన్స్ బిగించుకోవాలి.



- మరీ ముఖ్యంగా దోమలు విజృంభించే సాయంకాలం వేళ తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి.
- ప్రతి కుటుంబం వారంలో ఒక రోజు పరిసరాల్లో నీళ్లు నిల్వ ఉండే వీలుండే కంటికి కనిపించని ప్రదేశాల కోసం గాలించే పనికి పూనుకోవాలి.
- కూలర్ల ట్రేలు, రిఫ్రిజిరేటర్ల డ్రిప్ ప్యాన్లలో నీళ్లు లేకుండా చూసుకోవాలి. గార్డెన్, బాల్కనీల్లో వదిలేసిన ఖాళీ సీసాలు, డబ్బాలను తొలగించాలి.

కొత్త వైన్ పరిశ్రమ

(మొదటి పేజీ తరువాయి)

అమ్మకాలు జరిగాయి. మొత్తం 2,67,245 కార్టన్ల వైన్ విక్రయిస్తే.. అందులో కేవలం 8,725 కేసులు మాత్రమే స్థానిక కంపెనీలవి. ఈ నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ వైనరీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. నాలుగు రోజుల క్రితం వైన్ తయారీ పరిశ్రమ ఏర్పాటుపై మంత్రి జూపల్లి సమక్షంలో ఉన్నతాధికారులతో సమావేశం జరిగినట్లు తెలిసింది. ఎక్సైజ్ శాఖ పంపిన నివేదికను పరిశీలించాక..వైనరీ ఏర్పాటుకు త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ఇవీ లెక్కలు..

రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏడాదికి 8 లక్షల బల్క్ లీటర్ల సామర్థ్యం కలిగిన ఒకే ఒక వైన్ తయారీ పరిశ్రమ ఉంది. అయితే.. ఏటా స్థానికంగా పెరుగుతున్న వైన్ వినియోగానికి తగ్గట్లుగా రాష్ట్రంలో వైన్ ఉత్పత్తి కావడంలేదు. ఎక్సైజ్‌శాఖ లెక్కల ప్రకారం.. 2021-22లో వైన్ విక్రయాల ద్వారా రూ.201 కోట్ల విలువైన 1.87లక్షల వైన్ కేసులు (ఒక కేసు అంటే లీటర్ బాటిళ్లు 12) విక్రయించగా ఇందులో కేవలం 16,205 కేసులు మాత్రమే స్థానికంగా తయారయ్యాయి. మిగిలిన సరుకంతా విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్నదే. ఇక 2022-23లో 2.35 లక్షల కేసులు (రూ.260 కోట్లు).. 2023-24లో 2.41 లక్షల వైన్ కేసులు (రూ.275 కోట్లు) అమ్ముడయ్యాయి. ఈ ఏడాదిలో వైన్ వినియోగం భారీగా పెరిగింది. రాష్ట్రంలోనే వైన్ తయారీ పరిశ్రమలు స్థాపిస్తే.. వైన్ ఉత్పత్తి పెరగడమేకాకుండా స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని, ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరుగుతోందని ఆబ్కారీ శాఖ అధికారులు భావిస్తున్నారు. ద్రాక్ష, ఆపిల్, అరటి, ఉసిరి, పైనాపిల్ వంటి పండ్లతో వైన్ తయారీకి అవకాశం ఉండటంతో భవిష్యత్తులో ఆయా పండ్ల తోటల సాగు విస్తీర్ణం కూడా పెరుగుతుందని అంచనా. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు కేంద్రం భారీగా రాయితీలు ఇస్తుండటంతో వైన్ తయారీ పరిశ్రమల ఏర్పాటుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 700ఎకరాలకు పైగా ద్రాక్షతోటలు ఉండటంతో ఆ ప్రాంతాన్ని.. కొత్తగా వైన్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసుకునేందుకు అనువైనదిగా ఎక్సైజ్‌శాఖ ఇప్పటికే గుర్తించింది. కొత్తగా వైనరీని స్థాపించడానికి ఆసక్తి కలిగిన పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు కోరింది. దీంతో బ్లూసీల్, ఈరియా, బగ్గా కంపెనీలు ఆసక్తి చూపుతూ దరఖాస్తు చేశాయి. దీనిపై ప్రభుత్వం పరిశీలించిన తర్వాత.. త్వరలోనే ఒక వైన్ తయారీ పరిశ్రమకు ఆమోదం లభించనుంది.

భట్టితో ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల భేటీ

- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు ప్రత్యామ్నాయాలపై చర్చ..
- కొత్తగా ఎస్బీఐ ఎడ్యుకేషన్ ఎపెక్స్ బ్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదన

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సర్కారు ముందు ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు కొత్త ప్రతిపాదన ఉంచాయి. ప్రతి ఏటా దాదాపు రూ.2,500 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్న నేపథ్యంలో.. కొత్తగా ఎస్బీఐ ఎడ్యుకేషన్ ఎపెక్స్ బ్యాంక్ ఏర్పాటు చేసి, దీని ద్వారా ఉన్నత విద్యాసంస్థల ఆర్థిక లావాదేవీలన్నీ నిర్వహించాలని కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులు కోరారు. సోమవారం డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్కతో జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఎన్. రమేశ్‌బాబు మాట్లాడుతూ ఆ బ్యాంకు నిధుల వడ్డీలతోనే చెల్లించవచ్చన్నారు. తమ ప్రతిపాదనపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని, సీఎస్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారని ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు తెలిపాయి. ఆ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని వెల్లడించాయి.

అర్ధరాత్రి.. అమానుషం

- ఇద్దరికి గర్భవిచ్ఛిత్తి చేసిన వైద్యులు
- ఆడపిల్లలు కాబట్టే అబార్షన్లు
- భువనగిరిలో ఐదుగురిపై కేసు నమోదు

భువనగిరి టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి అమానుష ఘటన వెలుగుచూసింది. పట్టణానికి చెందిన గాయత్రి ఆస్పత్రిలో లింగనిర్ధారణ పరీక్షలు చేసి ఇద్దరికి అబార్షన్లు చేసినట్లుగా సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు ఆస్పత్రిపై దాడులు చేశారు. అక్కడున్న డస్ట్ బిన్‌లో మృత శిశువుల పిండాలను గుర్తించారు. ఈ ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రి నిర్వాహకులైన హిరేకార్ శివకుమార్, అతని భార్య గాయత్రి, ల్యాబ్ నిర్వాహకుడు దంతూరి పాండు గౌడ్‌తో పాటు అబార్షన్లు చేయించుకున్న ఇద్దరు మహిళలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు శివకుమార్‌ను, దంతూరి పాండుగౌడ్‌ను సోమవారం రాత్రి భువనగిరి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు. వైద్యుడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా, ల్యాబ్ నిర్వాహకునికి బెయిల్‌పై విడుదలయ్యాడు. ఎస్‌వోటీ పోలీసుల సమాచారం మేరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం ఆస్పత్రి, ల్యాబ్‌లో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రి, ల్యాబ్ నిర్వహణ ఉందని ప్రాథమికంగా తేల్చారు. ల్యాబ్‌ను పోలీసులు సీజ్ చేయగా.. ఆస్పత్రి, ల్యాబ్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ పూర్తిస్థాయి దర్యాప్తు జరిగాక తదుపరి చర్యలుంటాయని తెలిపారు.

భువనగిరి మండలంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు మహిళలకు ఆడ పిల్లలే పుడతారని ల్యాబ్ నిర్వాహకులు లింగనిర్ధారణ పరీక్ష ద్వారా నిర్ధారించారు. ఇద్దరికీ 5 నెలలు కాగా, ఆడపిల్లలు వద్దనుకుని గాయత్రి ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. దీంతో ఆ ఇద్దరికి ఆదివారం అర్ధరాత్రి దాటాక వైద్యులు గర్భవిచ్ఛిత్తి చేశారు. ఒక్కో అబార్షన్‌కు రూ.46 వేలు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

అప్పుడు 'స్వాతి'... ఇప్పుడు గాయత్రి ఆస్పత్రి

గాయత్రి ఆస్పత్రి నిర్వాహకులైన దంపతులు శివ, గాయత్రి విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. నిబంధనల ప్రకారం వారు భారత్‌లో నిర్వహించే ఎఫ్‌ఎంజీఈ పరీక్షలో ఉత్తీర్ణులైతేనే వైద్యవృత్తి చేయడానికి, ఎంబీబీఎస్ విద్యార్హతను పేర్కొనడానికి అర్హులు. కానీ ఇవేమీ లేకుండానే స్వాతి ఆస్పత్రి పేరిట తొలుత రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే ఆ ఆస్పత్రిలో చేసిన శస్త్రచికిత్సలతో వేర్వేరు సందర్భాల్లో ఇద్దరు మహిళలు మృతి చెందడంతో అధికారులు దాన్ని సీజ్ చేశారు. అయితే అదే ఆస్పత్రిని గాయత్రిగా మార్చి ఇదే తరహా వ్యవహారం కొనసాగిస్తున్నారని తెలుస్తోంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నయనతార డాక్యుమెంటరీపై మరో కేసు



సినీ నటి నయనతార డాక్యుమెంటరీకి వ్యతిరేకంగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. విఘ్నేష్ శివన్-నయనతారల వివాహ డాక్యుమెంటరీ గత ఏడాది నవంబరులో 'నెట్‌ఫ్లిక్స్'లో విడుదలైన విషయం తెలిసిందే. తొలుత ఈ డాక్యుమెంటరీ ట్రైలర్ విడుదల సమయంలో, అందులో 'నానుం రౌడీ దాన్' చిత్రంలోని మూడు నిమిషాల షూటింగ్ ఫుటేజీ ఉంది. ఈ వ్యవహారంపై నటుడు ధనుష్‌కు చెందిన వండర్ బార్స్ సంస్థ రూ.10 కోట్ల నష్టపరిహారం కోరుతూ కేసు వేసింది. ఈ కేసు హైకోర్టు విచారణలో ఉంది. తాజాగా డాక్యుమెంటరీకి వ్యతిరేకంగా మద్రాసు హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. 'చంద్రముఖి' చిత్రంలోని కొన్ని దృశ్యాలు డాక్యుమెంటరీలో అనుమతి లేకుండా వినియోగించారని, అందుకు రూ.5 కోట్లు నష్టపరిహారం చెల్లించాలంటూ కాపీ రైట్స్ కలిగిన ఏబీ ఇంటర్నేషనల్ పిటిషన్ దాఖలుచేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన హైకోర్టు..రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని డాక్యుమెంటరీ రూపొందించిన డార్క్ స్టూడియో, నెట్‌ఫ్లిక్స్ సంస్థలను ఆదేశించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)


'సత్యభామ' అందర్నీ అలరిస్తుంది

- మాళవిక మనోజ్

హీరో సుహాస్ తాజాగా నటించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. రామ్ గోధల దర్శకత్వంలో హరీష్ నల్ల నిర్మించారు. ఈ చిత్రంతో మాళవిక మనోజ్(జో ఫేమ్) తెలుగులో కథానాయికగా పరిచయం అవుతున్నారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా మాళవిక పాత్రికేయులతో మాట్లాడుతూ 'ఈ చిత్రంలో నా పాత్ర ఎంతో ఆధునికంగా ఉంటుంది. సత్యభామ అనే పాత్రలో కనిపిస్తాను. అందర్నీ అలరించే పాత్ర నాది. నా రియల్ లైఫ్‌కు ఎలాంటి పోలిక లేని పాత్ర సత్యభామ. తెలుగులో నటించడం చాలా సంతోషంగా ఉంది. నాకెప్పుడూ వైవిధ్య భరితమైన పాత్రల్లో నటించాలని ఉంటుంది. సాధారణంగా అన్ని సినిమాల్లో ఉండే ప్రేమ సన్నివేశాలు ఈ సినిమాలోనూ ఉన్నాయి. అయితే ఇందులోని సన్నివేశాల్లో కొత్త అనుభూతి ఉంటుంది. తప్పకుండా అందరూ ఎంజాయ్ చేస్తారు. అన్ని పాటలు నా మనసుకు హత్తుకున్నాయి. గ్లామరస్ రోల్స్ చేయాలా? వద్దా? అనే నిబంధన పెట్టుకోలేదు. ఇప్పటి వరకూ కథ నచ్చి, సౌకర్యంగా అనిపించిన పాత్రలు మాత్రమే చేశాను. నాకు నచ్చని క్యారెక్టర్స్‌ని నేను చేయను' అని అన్నారు.



బాక్సాఫీస్‌కు తుపాను




విజయ్ దేవరకొండ కథానాయకుడిగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న చిత్రం 'కింగ్‌డమ్'. సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, టీజర్, ఫస్ట్ సింగిల్ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ నెల 31న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా ఓ యాక్షన్ ప్రోమో విడుదల చేసి "ఇది కేవలం సినిమా కాదు. మేము ప్రేమతో నిర్మించిన గొప్ప ప్రపంచం. త్వరలోనే బాక్సాఫీస్ తుపానుకు ఈ చిత్రం నాంది పలుకుతుంది" అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: జోమోన్.టి.జాన్, సంగీతం: అనిరుధ్ రవిచందర్.

'కాంతార' ప్రీక్వెల్ సిద్ధం



కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'కాంతారా చాప్టర్-1'. గతంలో వచ్చిన 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్‌గా వస్తోంది. సోమవారం రిషబ్ శెట్టి పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా పోస్టర్‌ని విడుదల చేసింది. 'ఇతిహాసాలు పుట్టిన చోట గర్జనలు ప్రతిధ్వనిస్తాయి. 'కాంతార'తో లక్షలాది మందిని కదిలించిన కళాఖండానికి ప్రీక్వెల్‌గా ఇది రానుంది. ఈ గొప్ప చిత్రం వెనుక ఉన్న మార్గదర్శక శక్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు. అక్టోబరు 2న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. పురాణానికి నాంది. హృదయాన్ని కదిలించే కథకు తిరిగి మరోసారి స్వాగతం' అంటూ చిత్రబృందం పోస్టర్ కింద రాసుకొచ్చింది.

పల్లెటూరి మొనగాడు



హీరో రవితేజ సోదరుని కుమారుడు మాధవ్ 'మారెమ్మ' అనే సినిమాతో కథానాయకునిగా పరిచయం అవుతున్నారు. మంచాల నాగరాజ్ దర్శకత్వంలో మోక్ష ఆర్ట్స్ బేనర్‌పై మయూర్ రెడ్డి బండారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు సంబంధించిన టైటిల్ పోస్టర్‌ని చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పోస్టర్‌లో మాధవ్ గళ్ల చొక్కా, లుంగీ ధరించి, మెడలో టవల్‌తో ఓ పల్లెటూరి హీరోగా కనిపిస్తున్నారు. పోస్టర్ బ్యాక్‌డ్రాప్‌లో ఉన్న గేదె అతని బలం, ఆధిపత్యాన్ని సూచిస్తోంది. మాధవ్ పొడవాటి కర్రను పట్టుకొని ఏదైనా సవాలును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపించారు. కాగా, సినిమాను గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ప్రశాంత్ అంకిరెడ్డి సినిమాటోగ్రఫీ, ప్రశాంత్ ఆర్ విహారి సంగీతం అందిస్తున్నారు.

రెగ్యులర్ షూటింగ్ షురూ!



విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న చిత్రం ఇటీవలె ప్రారంభమైన సంగతి తెలిసిందే. సోమవారం నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించారు మేకర్స్. విజయ్ సేతుపతి, సంయుక్తతో పాటు ప్రధాన పాత్రధారులు ఇందులో పాల్గొంటున్నారు. ఇందుకోసం ఓ భారీ సెట్‌ను నిర్మించి సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరిజగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోళ్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది.

ఫాంటసీ వినోదం



కార్తిక్‌రాజు, నోయల్, మిస్తీ చక్రవర్తి హీరో హీరోయిన్లుగా రూపుదిద్దుకున్న చిత్రం 'దీర్ఘాయుష్మాన్ భవ' పూర్ణానంద్ దర్శకత్వంలో వంకాయలపాటి మురళీకృష్ణ నిర్మించారు. ఈ నెల 11న నట్టీస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తరఫున నిర్మాత నట్టి కుమార్ విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను దామోదర ప్రసాద్, ప్రోమోస్ ను నటుడు ఓ కల్యాణ్, పాటలను జబర్దస్త్ ఆర్.పి ఆవిష్కరించారు. అన్ని ఎమోషన్స్ ఉన్న సినిమా ఇదనీ, ప్రేక్షకులు ఆదరించాలనీ కోరారు. దర్శకుడు పూర్ణానంద్ మాట్లాడుతూ 'ఫ్యామిలీ ప్యాక్ చిత్రమిది. అందరినీ ఆహ్లాద పరిచే కామెడీ ఉంది. సోషియో ఫాంటసీ చిత్రంగా మలిచాం' అన్నారు. నిర్మాత నట్టి కుమార్ మాట్లాడుతూ 'చిన్న సినిమాల సమస్యలను తీర్చేందుకు పరిశ్రమతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పూనుకోవాలి. చిన్న సినిమాకు రెండున్నర గంటల షోను కేటాయించాలి. మల్టీప్లెక్స్‌లో పేదవాడు కూడా చూసే విధంగా ఆక్యుపెన్సీలో 20 శాతం టికెట్ రేట్లను 75 రూపాయలుగా నిర్ణయించాలి' అని కోరారు.

బై లా ప్రకారమే ఎన్నికలు జరగాలి



- మెమొరాండం సమర్పించిన నిర్మాతలు

"తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఎన్నుకున్న ప్రస్తుత కమిటీ గడువు ఈ నెలలోనే ముగియనుంది. వెంటనే ఎలక్షన్లు జరగడానికి వీల్లేకుండా ప్రస్తుత అసోసియేషన్‌లోని కొందరు సభ్యులు ఎన్నికలను వాయిదాకు ప్రయత్నిస్తున్నారు" అని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఫిల్మ్ ఛాంబర్‌లో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్, బసిరెడ్డి ఆధ్వర్యంలో ఓ సమావేశం నిర్వహించారు. బై లా ప్రకారమే ఎన్నికలు జరగాలని నాలుగు సెక్టార్స్‌కు చెందిన 60 మంది నిర్మాతలు మెమొరాండం సమర్పించారు.

అందుకే వాయిదా: దామోదర ప్రసాద్

ఈ విషయంపై ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్ వివరణనిచ్చారు. "సాధారణంగా ఈ నెలాఖరుకు ఎన్నికలు జరగాలి. అయితే ముఖ్యమైన సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. అలాగే కొన్ని పనులు మధ్యలోనే ఉన్నాయి. అందుకే ఈసీ మీటింగ్‌లో మరో ఏడాది పాటు గడువును పొడిగించాలని కోరాను. ఈసీ మీటింగ్ పెట్టినప్పుడు అందరూ రావాలి. వారి అభిప్రాయాలు చెప్పాలి' అని పేర్కొన్నారు.



రాముడి పారితోషికం ఎంత?

రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్న 'రామాయణ' చిత్రం ఫస్ట్ లుక్ ఇటీవల విడుదలై అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ఇందులో వీఎఫ్ఎక్స్ వర్క్ అద్భుతంగా ఉండబోతుందని ఈ సినిమా గ్లింప్స్ చూడగానే అందరికీ అర్థమైంది. మరో విషయం ఏమిటంటే రూ. 1600 కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ చిత్రం ఇది. ఈ సినిమాలో రాముడిగా నటిస్తున్న రణబీర్ కపూర్ పారితోషికం ఎంతో తెలుసా?.. రూ .150 కోట్లు. రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న 'రామాయణ' కోసం ఆయన అడిగిన పారితోషికం ఇచ్చి వర్క్ చేయించుకుంటున్నారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఇక సీతగా నటిస్తున్న సాయిపల్లవికి రెండు భాగాలకు కలిపి రూ. 12 కోట్లు ఇస్తున్నారు. రావణుడిగా నటిస్తున్న యశ్ ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామి కనుక ఖర్చులకు తప్ప పారితోషికంగా ఏమీ తీసుకోవడం లేదు.

అప్పుడు రాముడు.. ఇప్పుడు దశరథుడు

రామానంద సాగర్ రూపొందించిన 'రామాయణ్' సీరియల్‌లో అరుణ్ గోవిల్ శ్రీరాముడిగా, దీపిక సీతగా నటించి కోట్లాది మంది హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారు. 1987లో ఆ సీరియల్ వచ్చింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత 'రామాయణ' చిత్రంలోనూ అరుణ్ గోవిల్ నటిస్తున్నారు. ఈసారి ఆయన దశరథుడి పాత్ర చేస్తుండడం గమనార్హం.

యధార్థ కథ ఆధారంగా..



దర్శకుడు బాలాజీ ముత్యాల దర్శకత్వంలో పృథ్వీరాజు, గోలీసోడా మధు ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'మిస్టర్ సోల్జర్'. 'ఫ్రమ్ మిలిటరీ మాధవరం' అనేది ఉపశీర్షిక. వీఆర్ఎమ్ పట్నాయక్, యూఎస్ఎన్ పట్నాయక్ నిర్మిస్తున్నారు. వచ్చే నెలలో చిత్రం విడుదలవుతోందని మేకర్స్ తెలిపారు. ఓ యదార్థ కథ ఆధారంగా చిత్రాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు.



మార్కెట్లోకి టాటా ఏస్ ప్రో

పెట్రోల్, బై-ఫ్యూయల్, ఎలక్ట్రిక్ వేరియంట్లలో లభ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టాటా మోటార్స్ మార్కెట్లోకి సరికొత్త తేలికపాటి వాణిజ్య వాహనం (ఎల్‌సీవీ) టాటా ఏస్ ప్రో తీసుకువచ్చింది. సోమవారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ పినాకీ హల్దార్ ఈ చిన్న కార్గో ట్రక్‌ను విడుదల చేశారు. ఈ ఎల్‌సీవీ ప్రారంభ ధర రూ.3.99 లక్షలు. పెట్రోల్, బై-ఫ్యూయల్ (సీఎన్‌జీ ప్లస్ పెట్రోల్), ఎలక్ట్రిక్ వేరియంట్లలో ఇది అందుబాటులో ఉంటుందని హల్దార్ తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వ్యాపార అవసరాలకు తగ్గట్టుగా ఆధునిక ఫీచర్లతో ఈ వాహనాలను తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. 2005లో టాటా ఏస్‌ను కంపెనీ మార్కెట్లోకి తీసుకువచ్చినప్పటి నుంచి వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తూ వస్తోందన్నారు. 694 సీసీ ఇంజన్‌తో పెట్రోల్ వేరియంట్‌ను తీసుకురాగా బై-ఫ్యూయల్ వేరియంట్‌ను సీఎన్‌జీ మోడ్ సహా 5 లీటర్ల పెట్రోల్ బ్యాకప్ ట్యాంక్‌తో రూపొందించినట్లు ఆయన చెప్పారు. కాగా 14.4 కిలోవాట్ బ్యాటరీతో కూడిన ఎలక్ట్రిక్ వేరియంట్ ఒకసారి చార్జింగ్‌తో 155 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు. ఎలక్ట్రిక్ వేరియంట్ ధర రూ.6.5 లక్షల నుంచి రూ.6.8 లక్షల మధ్యన ఉండగా బై-ఫ్యూయల్ వేరియంట్ ధరలు రూ.4.99 లక్షల నుంచి రూ.5.99 లక్షల మధ్యన ఉన్నాయని హల్దార్ తెలిపారు.


వింటేజ్ కాఫీ రూ.215 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రిఫరెన్షియల్ పద్ధతిలో ఈక్విటీ షేర్లు, కన్వర్టబుల్ వారంట్ల జారీ ద్వారా రూ.215.76 కోట్ల సమీకరణకు బోర్డు సభ్యుల నుంచి ఆమోదం లభించిందని హైదరాబాద్‌కు చెందిన వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్ లిమిటెడ్ (వీసీబీఎల్) సోమవారం వెల్లడించింది. అయితే, ఈ ఇష్యూకు షేర్ హోల్డర్లతో పాటు ఇతర అనుమతులు ఇంకా రావాల్సి ఉందని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఇష్యూ ద్వారా సమీకరించనున్న నిధులను 5,000 ఎంటీపీఏ సామర్థ్యంతో ఫ్రీజ్ డ్రైడ్ కాఫీ ప్లాంట్ ఏర్పాటుకు ఉపయోగించనున్నట్లు తెలిపింది. అంతేకాకుండా ప్రీమియం కాఫీ విభాగంలో మెరుగైన మార్కెట్ వాటాను దక్కించుకునేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొంది. కాగా, కంపెనీకి చెందిన స్ప్రే డ్రైడ్ అండ్ అగ్లోమెరాటెడ్ కాఫీ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతమున్న 6,500 ఎంటీపీఏ నుంచి 2026 మార్చి చివరికల్లా 11,000 ఎంటీపీఏకు పెరగవచ్చని వీసీబీఎల్ అంచనా వేస్తోంది.

డెరివేటింగ్ ట్రేడింగ్‌లో

91% మందికి నష్టాలే

సెబీ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఈక్విటీ డెరివేటివ్ ట్రేడింగ్‌లో దాదాపు 91 శాతం మంది వ్యక్తిగత మదుపరులు నష్టాలే చవిచూశారు. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లోనూ ఇదే జరిగిందని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ సోమవారం విడుదల చేసిన అధ్యయన నివేదికలో వెల్లడించింది. 2023-24లో వ్యక్తిగత మదుపరులు ఈక్విటీ డెరివేటివ్ ట్రేడింగ్‌లో రూ.74,812 కోట్ల వరకు నష్టపోగా.. 2024-25లో నష్టాలు మరో 41 శాతం పెరిగి రూ.1,05,603 కోట్లకు చేరాయని సెబీ తాజా నివేదిక తెలిపింది. అంతేకాదు, 2023-24తో పోలిస్తే, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ)లో ట్రేడింగ్ నెరిపే వ్యక్తిగత మదుపరుల సంఖ్య కూడా 20 శాతం తగ్గిందని నివేదిక పేర్కొంది. రెండేళ్ల క్రితం మాత్రం ట్రేడర్ల సంఖ్య 24 శాతం పెరిగింది. ఈక్విటీ ఇండెక్స్ డెరివేటివ్ ట్రేడింగ్ నియమావళిని బలోపేతం చేసేందుకు 2024 అక్టోబరు 1న చర్యలు చేపట్టిన అనంతరం సెబీ ఈ అధ్యయనం జరిపింది. అన్ని విభాగాల ఇన్వెస్టర్లను విశ్లేషించిన నియంత్రణ మండలి.. గత ఏడాది డిసెంబరు నుంచి 2025 మే మధ్యలో వ్యక్తిగత మదుపరుల ట్రేడింగ్‌పైన మాత్రం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఆ విశ్లేషణలో దాదాపు 91 శాతం మంది వ్యక్తిగత ఇన్వెస్టర్లు ఈక్విటీ డెరివేటివ్‌ల్లో నష్టపోయారని తేలింది. సమీక్షా కాలంలో ఇండెక్స్ ఆప్షన్స్ టర్నోవర్ వార్షిక ప్రాతిపదికన ప్రీమియం టర్నోవర్‌లో 9 శాతం, నోషనల్ టర్నోవర్‌లో 29 శాతం తగ్గింది.

రెండేళ్ల క్రితంతో పోలిస్తే మాత్రం ఇండెక్స్ ఆప్షన్స్ లావాదేవీలు మాత్రం ప్రీమియం టర్నోవర్‌లో 14 శాతం, నోషనల్ టర్నోవర్‌లో 42 శాతం పెరిగింది. ఈక్విటీ డెరివేటివ్ విభాగంలో వ్యక్తిగత మదుపరుల టర్నోవర్ ప్రీమియం టర్నోవర్‌లో 11 శాతం తగ్గిందని సెబీ విశ్లేషణలో వెల్లడైంది. ఒడుదుడుకులున్నప్పటికీ, ఈక్విటీ డెరివేటివ్స్‌లో, ముఖ్యంగా ఇండెక్స్ ఆప్షన్స్‌లో ట్రేడింగ్ భారీగానే జరుగుతోందని సెబీ గుర్తించింది.

డెరివేటివ్ ట్రేడింగ్‌పై మరింత నిఘా

డెరివేటింగ్ ట్రేడింగ్ మార్కెట్‌పై నిఘా పెంచనున్నట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే సోమవారం తెలిపారు. నియంత్రణాధికారాల కంటే మెరుగైన నిఘా, నిబంధనల అమలు ద్వారానే తప్పు చేసినవారిపై చర్యలు చేపట్టగలమన్నారు. నిఘా పెట్టడం వల్లే జేన్ స్ట్రీట్‌పై చర్యలు తీసుకోగలిగామని.. నియంత్రణ మండలితో పాటు ఎక్స్ఛేంజీలు ఈ విభాగ ట్రేడింగ్‌పై నిఘా పెంచనున్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే, జేన్ స్ట్రీట్ మోసపూరిత ట్రేడింగ్ వ్యూహాల తరహాలో మార్కెట్లో ఇతర రిస్కులేమీ కన్పించడం లేదని పాండే అన్నారు. డెరివేటివ్ ట్రేడింగ్‌లో అక్రమ పద్ధతుల్లో వేల కోట్ల రూపాయలు ఆర్జించిన అమెరికా ట్రేడింగ్ కంపెనీ జేన్ స్ట్రీట్ గ్రూప్‌ను సెక్యూరిటీ మార్కెట్ నుంచి నిషేధిస్తూ సెబీ గత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, రూ.4,843 కోట్ల అక్రమ లాభాలను తిరిగి తమ ఎస్క్రో ఖాతాలో జమ చేయాలని నియంత్రణ మండలి ఆదేశించింది.

క్యాప్‌జెమిని గూటికి డబ్ల్యూఎన్ఎస్

డీల్ విలువ రూ.28,380 కోట్లు

ప్యారిస్ (ఫ్రాన్స్): డిజిటల్ బిజినెస్ ప్రాసెస్ సర్వీసెస్ (బీపీఎస్) కంపెనీ డబ్ల్యూఎన్ఎస్‌ను 330 కోట్ల డాలర్లకు (సుమారు రూ.28,380 కోట్లు) కొనుగోలు చేస్తున్నట్లు ఫ్రాన్స్‌కు చెందిన ఐటీ కంపెనీ క్యాప్‌జెమినీ సోమవారం ప్రకటించింది. ఇందుకు ఇరు కంపెనీల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ ఒప్పందం పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. డబ్ల్యూఎన్ఎస్‌కు చెందిన ఒక్కో షేరుకు క్యాప్‌జెమినీ 76.50 డాలర్లు చెల్లించనుంది. డబ్ల్యూఎన్ఎస్ షేరు గత 90 రోజుల సగటు ట్రేడింగ్ ధరతో పోలిస్తే 28 శాతం అధికమిది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత వ్యాపార కార్యకలాపాల్లో క్యాప్‌జెమినీ అగ్రగామిగా ఎదిగేందుకు ఈ డీల్ దోహదపడనుంది. ఎందుకంటే, డబ్ల్యూఎన్ఎస్ ఏజెంటిక్ ఏఐ, అటానమస్ ఏఐ ఏజెంట్ల ద్వారా బీపీఎస్ సేవలందిస్తోంది. మార్కెట్లో ఏజెంట్ ఏఐ, అటానమస్ ఏఐ ఏజెంట్ల సేవలకు గిరాకీ శరవేగంగా పెరుగుతోంది. కాగా, అంతర్జాతీయంగా కార్యకలాపాలు సాగిస్తున్న క్యాప్‌జెమినీ.. హైదరాబాద్ సహా భారత్‌లోని పలు నగరాల్లో కార్యాలయాలను కలిగి ఉంది. డబ్ల్యూఎన్ఎస్ విషయానికొస్తే, చెన్నైకి చెందిన కేశవ్ ఆర్ మురుగేశ్ లండన్ కేంద్రంగా 1990లో ఈ కంపెనీని ప్రారంభించారు. డబ్ల్యూఎన్ఎస్‌కు భారత్ రెండో కేంద్రంగా ఉంది. చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నంలోనూ కార్యాలయాలను కలిగి ఉంది. ఈ కంపెనీ షేర్లు న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో ట్రేడవుతున్నాయి.

జీఎంఆర్ ఏరో టెక్నిక్‌తో ఆకాశ ఎయిర్ ఒప్పందం

» బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు నిర్వహణ సేవలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీఎంఆర్ ఏరో టెక్నిక్‌తో ఆకాశ ఎయిర్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఆకాశ ఎయిర్‌కు చెందిన బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు బేస్ మెయింటెనెన్స్ సేవలను అందించనున్నట్లు మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాలింగ్ (ఎంఆర్ఓ) సేవల సంస్థ జీఎంఆర్ ఏరో టెక్నిక్ వెల్లడించింది. మూడేళ్ల పాటు ఈ సేవలందించేందుకు గాను ఆకాశ ఎయిర్‌తో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసినట్లు జీఎంఆర్ ఏరో టెక్నిక్ తెలిపింది. హైదరాబాద్‌లోని జీఎంఆర్ ఏరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్క్‌లో ఉన్న తమ అత్యాధునిక ఎంఆర్ఓ కేంద్రంలో ఈ సేవలను అందించనున్నట్లు జీఎంఆర్ తెలిపింది. దేశంలోని ప్రముఖ విమానయాన సంస్థలకు విశ్వసనీయ భాగస్వామిగా పెరుగుతున్న తమ స్థానానికి ఇది దర్పణమని జీఎంఆర్ ఏరోటెక్నిక్ ప్రెసిడెంట్ అశోక్ గోపీనాథ్ అన్నారు. తమ సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణా సామర్థ్యం, కస్టమర్ ప్రధాన వైఖరికి ఇది ఒక పరీక్ష అని పేర్కొన్నారు. విమానాల భద్రత, విశ్వసనీయతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తామని, జీఎంఆర్ ఏరోటెక్నిక్‌తో తమ భాగస్వామ్యం దీన్ని మరింత సుస్థిరం చేస్తుందని ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీస్ బెల్సన్ కోటిన్హో అన్నారు. 2022లో ప్రారంభమైన ఆకాశ ఎయిర్ ప్రస్తుతం 23 దేశీయ, 5 అంతర్జాతీయ గమ్యాలకు సర్వీసులు నడుపుతోంది. లీప్-1బీ ఇంజన్లతో కూడిన 226 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు ఆర్డర్లు జారీ చేసింది.

శాట్‌కామ్ సేవల్లోకి అనంత్ టెక్నాలజీస్!

4 టన్నుల జియో ఉపగ్రహ ప్రయోగంపై ఫోకస్

హైదరాబాద్‌కు చెందిన అనంత్ టెక్నాలజీస్.. శాట్‌కామ్ సేవల్లోకి ప్రవేశించాలని భావిస్తోంది. స్థానికంగా తయారు చేసిన ఉపగ్రహం సహాయంతో ఈ సేవలందించాలని చూస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే దేశీయంగా అభివృద్ధి చేసిన ఉపగ్రహం సాయంతో ఒక దేశీయ కంపెనీ సేవలందించటం ఇదే తొలిసారి అవుతుంది. ఈ సేవలతో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్, జెఫ్ బెజోస్‌కు చెందిన అమెజాన్ క్విపర్, యూటెల్‌శాట్‌కు చెందిన వన్ వెబ్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలతో అనంత్ టెక్నాలజీస్ పోటీ పడనుందని కంపెనీ వ్యవస్థాపకుడు, సీఎండీ పావులూరి సుబ్బారావు ఎకనామిక్ టైమ్స్ పత్రికకు తెలిపారు. తమ కంపెనీ ఇప్పటికే అంతరిక్ష పరిజ్ఞానంలో ప్రభుత్వంతో కలిసి పని చేస్తోందన్నారు. 2028 నాటికి అంతరిక్షం నుంచి బ్రాడ్‌బ్యాండ్ సేవలందించేందుకు ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్) నుంచి ఈ కంపెనీ ఇప్పటికే అనుమతి సాధించింది. అలాగే నాలుగు టన్నుల బరువు గల జియో స్టేషనరీ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించే యోచనలో ఉంది. ఈ ప్రాజెక్టుపై కంపెనీ రూ.3,000 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ జియో కమ్యూనికేషన్ ఉపగ్రహం వినియోగదారులకు 100 గిగాబైట్ల సామర్థ్యాన్ని అందించగలుగుతుంది. అలాగే కంపెనీ ఉపగ్రహ ఆపరేటర్‌గా కూడా వ్యవహరిస్తున్నందు వల్ల డిమాండ్ ఆధారంగా భవిష్యత్తులో మరిన్ని ఉపగ్రహాలను ప్రయోగించవచ్చు. ఇప్పటివరకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మాత్రమే ఉపగ్రహాలు నిర్మించి, ప్రయోగించి, ఆపరేట్ చేయగలుగుతోంది. అంతరిక్ష సంస్కరణల్లో భాగంగా ఈ రంగంలోకి ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వం ప్రవేశం కల్పించింది.

జియోబ్లాక్‌రాక్ రూ.17,800 కోట్ల సమీకరణ

కంపెనీ ఏర్పాటు తర్వాత తొలిసారిగా ప్రారంభించిన 3 కొత్త ఫండ్ ఆఫర్ల ద్వారా మొత్తం రూ.17,800 కోట్లు సమీకరించినట్లు జియోబ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రకటించింది. గత నెల 30న కంపెనీ ఓవర్‌నైట్ ఫండ్, లిక్విడ్ ఫండ్, మనీ మార్కెట్ ఫండ్లను విడుదల చేసింది.

ఆద్యంతం ఊగిసలాటలే... సూచీలు అక్కడక్కడే..

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం పరిమిత శ్రేణిలోనే కదలాడినప్పటికీ, ఆద్యంతం లాభనష్టాల మధ్య ఊగిసలాటలకు లోనయ్యాయి. సెన్సెక్స్ చివరికి 9.61 పాయింట్ల అతి స్వల్ప లాభంతో 83,442.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఏమార్పు లేకుండా 25,461.30 వద్ద ముగిసింది. భారత ఎగుమతులపై అమెరికా ప్రకటించిన అదనపు సుంకాలు ఈ నెల 9 నుంచి అమలులోకి రానున్నాయి. పైగా, అమెరికా-భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాకపోవడంతో మార్కెట్ మదుపరులు కొత్త పెట్టుబడుల విషయంలో వేచి చూసే ధోరణిని కనబరిచారు. ఆసియా మార్కెట్లో బలహీన ట్రెండ్, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు మళ్లీ తరలిపోతుండటం వంటి అంశాలూ మన సూచీలపై ఒత్తిడి పెంచాయని ఈక్విటీ విశ్లేషకులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 12 మాత్రమే రాణించాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	570
వరంగల్	562	గోదావరి	535
చిత్తూరు	633	విశాఖపట్నం	560
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	102
వరంగల్	100	గుంటూరు	107
కరీంనగర్	100	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	105
కర్నూలు	100	నెల్లూరు	110
విశాఖపట్నం	86	అనంతపురం	110
గోదావరి	102		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,290 ▼	90,100 ▼	1,20,000 ▼
విజయవాడ	99,600 ▼	93,500 ▼	1,11,000 ▲
విశాఖపట్నం	99,770 ▲	90,100 ▼	1,20,000 ▼
రాజమండ్రి	98,290 ▼	90,100 ▼	1,10,300 ▼
ప్రొద్దుటూరు	96,900 ▼	89,150 ▼	1,08,500 ▲
ముంబై	96,596 ▼	88,482 ▼	1,06,531 ▼

కష్టాల కడలిని దాటి..

'ఆకాశ'మే హద్దుగా ఎదిగి



(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఎడ్జ్‌బాస్టన్‌లో టెస్టు విజయం కోసం భారత జట్టు దశాబ్దాలపాటు ఎదురుచూసింది. అయితే బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై పది వికెట్లు పతనం చేయడం ద్వారా ఇంగ్లండ్‌ను కట్టడి చేసిన పేసర్ ఆకాశ్ దీప్ ఈ గెలుపు సంబరాలకు ప్రధాన కారకుల్లో ఒకడు. స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినివ్వడంతో తుది జట్టులోకి వచ్చిన ఆకాశ్ చిరస్మరణీయ ప్రదర్శనతో అబ్బురపర్చాడు. బర్మింగ్‌హామ్ టెస్టుకు ముందు అతడు 7 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీశాడు. దీంతో ఆకాశ్‌కు బదులు అర్ష్‌దీప్‌కు చాన్స్ ఇవ్వాలన్న చర్చలు కూడా జరిగాయి. అయితే కోచ్, కెప్టెన్.. ఆకాశ్‌పై నమ్మకముంచి తుదిజట్టులో చోటు కల్పించారు. ఆ ఇద్దరి నమ్మకాన్ని నిలబెడుతూ ఆకాశ్ ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో అద్భుతంగా బౌలింగ్ చేసి అందరి ప్రశంసలు అందుకున్నాడు. అయితే బిహార్ నుంచి బర్మింగ్‌హామ్ వరకు ఎదిగిన ఆకాశ్ విజయం వెనుక ఎన్నో కష్టాలు, ఒడిదుడుకులు, సవాళ్లున్నాయి.

సీక్రెట్‌గా క్రికెట్ ఆడేస్తూ..

బిహార్‌లోని రోహ్‌తాస్ జిల్లా డెహ్రి గ్రామంలో జన్మించిన ఆకాశ్ కుటుంబానికి క్రీడా నేపథ్యం లేదు. వాస్తవానికి ఈ రాష్ట్రంలో క్రికెట్‌కు పెద్దగా ఆదరణ కనిపించదు. ఇక బ్యాట్, బంతి పడితే భవిష్యత్ ఉండదని టీచర్‌గా పనిచేసిన ఆకాశ్ తండ్రి కూడా అతడిని ప్రోత్సహించలేదు. కొడుకు బాగా చదువుకుని ఉద్యో గం చేస్తే చాలనుకున్నాడు. ఆ గ్రామంలో బాలురు క్రికెట్ ఆడితే పెద్ద తప్పుగా పరిగణిస్తుంటారు. మిగతా తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఆకాశ్‌తో కలవనిచ్చేవారు కాదట. అతడు క్రికెట్ ఆడడం తప్ప ఏమీ చేయడని, మీ చదువులు కూడా పాడవుతాయని హెచ్చరించేవారు. అందుకే ఆకాశ్ ఎవరికంటా పడకుండా క్రికెట్ ఆడాల్సి వచ్చేది.

బిహార్‌లో ఉంటే ఎదగలేమనుకున్న ఆకాశ్ బెంగాల్‌లోని దుర్గాపూర్‌కు మకాం మార్చాడు. అప్పటిదాకా బ్యాటర్‌గా ఉన్న అతను పేసర్‌గా శిక్షణ తీసుకుంటూ స్థానిక క్లబ్‌లకు ఆడాడు. కెరీర్ గాడిలో పడుతున్న దశలో ఆకాశ్ జీవితంలో ఊహించని విషాదాలు చోటు చేసుకున్నాయి. ఆరు నెలల వ్యవధిలోనే ఆకాశ్ తండ్రి, సోదరుడు అనారోగ్యంతో మరణించారు. దాంతో కుటుంబ బాధ్యతల కోసం అతను స్వస్థలానికి తిరిగిరాక తప్పలేదు. క్రికెట్‌వైపు మనసు లాగుతున్నా, కుటుంబ పరిస్థితుల రీత్యా అతను మూడేళ్ల ఆటకు దూరం కావాల్సి వచ్చింది. ఈ దశలో ఆకాశ్ పడిన వేదన అంతాఇంతా కాదు. ఎట్టకేలకు సుదీర్ఘకాలం తర్వాత కోల్‌కతా వెళ్లి అరుణ్ లాల్ శిక్షణలో రాటుదేలి బెంగాల్ జట్టులో చేరాడు. 2019లో రంజీల్లో అరంగేట్రం చేసి 35 వికెట్లు తీశాడు. జట్టును రన్నరోగా నిలిపాడు. ఇక తమ నెట్ బౌలర్‌గా ఉన్న ఆకాశ్ ప్రతిభను గమనించి ఆర్‌సీబీ 2021 ఐపీఎల్ వేలంలో రూ. 20 లక్షలకు తీసుకుంది. అప్పటి నుంచి 2024 వరకు ఆ జట్టుకే ఆడిన అతను వెనుదిరిగి చూడలేదు. అందుకే ఈ ఏడాది వేలంలో లఖ్‌నవూ జట్టు ఆకాశ్‌పై రూ. 8 కోట్లు వెచ్చించింది. చక్కటి ప్రదర్శనతో సెలెక్టర్లను ఆకట్టుకున్న ఆకాశ్ గతేడాది ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపికయ్యా డు. రాంచీలో జరిగిన నాలుగో టెస్టుతో అరంగేట్రం చేసి 3 వికెట్లతో ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం కెరీర్‌లో 8 టెస్టులు ఆడిన ఆకాశ్ పరిమిత ఓవర్లలో ఇంకా ప్రాతినిధ్యం వహించలేదు. అయితే బుమ్రాపై పనిఒత్తిడి భారం అధికంగా ఉన్న నేపథ్యంలో ఆకాశ్ మున్ముందు ఇదే రీతిన చెలరేగితే భారత పేస్ దళం మరింత బలపడినట్టే.

ఆరు నెలల వ్యవధిలో తండ్రి, సోదరుడిని కోల్పోయి..

నా గురించి ఆందోళన వద్దు..

ఆకాశ్‌దీప్ సోదరి జ్యోతి



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో ఆకాశ్ దీప్ పది వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. తన ప్రదర్శనను.. కేన్సర్‌తో బాధపడుతున్న సోదరికి అంకితం ఇస్తున్నట్టు మ్యాచ్ అనంతరం ఆకాశ్ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందుకు అతడి సోదరి జ్యోతి స్పందిస్తూ.. 'నా సోదరుడి ప్రదర్శనకు గర్విస్తున్నా. ఇంగ్లండ్ టూర్‌కు వెళ్లే ముందు ఆకాశ్‌ను ఎయిర్‌పోర్టులో కలిశా. నా ఆరోగ్యం గురించి ఆందోళన చెందవద్దని, దేశం కోసం ఆడాలని సూచించా. ప్రస్తుతం నాకు కేన్సర్ మూడో దశలో ఉంది. మరో ఆరు నెలలు చికిత్స తీసుకున్నాక పరిస్థితి ఏమిటనేది చెబుతామని డాక్టర్లు తెలిపారు' అని వివరించింది. అయితే తనకు కేన్సర్ ఉందంటూ ఆకాశ్ వెల్లడించిన విషయం తనకు తెలియదని ఆమె పేర్కొంది.

స్పోర్ట్స్

400 వద్దనుకున్నాడు

ముల్డర్ @367*

లారా రికార్డుకు 33 పరుగుల దూరంలో ఇన్నింగ్స్ డిక్లేర్



2 టెస్టుల్లో రెండో వేగవంతమైన ట్రిపుల్ సెంచరీ చేసిన ఆటగాడిగా ముల్డర్. 297 బంతుల్లో ముల్డర్ మూడొందల మార్క్‌ను అందుకొన్నాడు. 2008లో చెన్నైలో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో సెహ్వాగ్ 278 బంతుల్లోనే త్రిశతకం బాదాడు.

బులవాయో: టెస్టు క్రికెట్‌లో వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా (400 నాటౌట్) అరుదైన రికార్డును అధిగమించాలనేది ప్రతి క్రికెటర్ చిరకాల స్వప్నం. కానీ, ఆ రికార్డుకు కేవలం 33 పరుగుల దూరంలోనే ఉన్నా వద్దనుకున్నాడు. దక్షిణాఫ్రికా తాత్కాలిక కెప్టెన్ వియాన్ ముల్డర్ (334 బంతుల్లో 49 ఫోర్లు, 4 సిక్స్‌లతో 367 నాటౌట్) చరిత్ర సృష్టించే అరుదైన అవకాశాన్ని కాదనుకుని నిస్వార్థంగా ఆలోచించి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. జింబాబ్వేతో జరుగుతున్న రెండో టెస్టులో ఆటకు రెండో రోజు నిన్నటి స్కోరు 465/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన దక్షిణాఫ్రికా 626/5 వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్ ముల్డర్ త్రిశతకం పూర్తి చేసుకోవడంతోపాటు జోరు మీదున్నాడు. ఈ క్రమంలో లారా క్వాడ్రపుల్ సెంచరీ రికార్డును బద్దలుకొడతాని అందరూ భావించారు. కానీ, 33 పరుగుల దూరంలో ఉండగా దక్షిణాఫ్రికా అనూహ్యంగా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అయితే, సౌతాఫ్రికా తరఫున అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్‌గా హషీమ్ ఆమ్లా (311)ను ముల్డర్ వెనక్కినెట్టాడు. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో 170 రన్స్‌కే కుప్పకూలిన జింబాబ్వే ఫాలో ఆన్‌లో పడింది. సీన్ విలియమ్స్ (83 నాటౌట్)కు సహకారం అందలేదు. స్పిన్నర్ ప్రినెలన్ సుబ్రయన్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 456 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే సోమవారం ఆట ఆఖరికి 51/1 స్కోరు చేసింది.

టెస్టుల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్లు

లారా	400*	2004లో ఇంగ్లండ్‌పై
హేడెన్	380	2003లో జింబాబ్వేపై
లారా	375	1994లో ఇంగ్లండ్‌పై
జయవర్దనె	374	2006లో సౌతాఫ్రికాపై
ముల్డర్	367*	2025లో జింబాబ్వేపై



లారా

జొకో 16వ సారి..

క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశం ● వింబుల్డన్

లండన్: ఏడుసార్లు చాంపియన్ నొవాక్ జొకోవిచ్ వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో ఆరో సీడ్ జొకోవిచ్ 1-6, 6-4, 6-4, 6-4తో 11వ సీడ్ అలెక్స్ డిమినార్‌పై గెలిచాడు. ఈ వేదికపై జొకో క్వార్టర్స్ చేరడం ఇది 16వసారి. మరో ప్రీక్వార్టర్‌ఫైనల్లో 22వ సీడ్ కొబోలీ 6-4, 6-4, 6-7 (7), 7-6 (2)తో సిలిచ్‌కు చెక్ పెట్టాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో డిఫెండింగ్ చాంప్ అల్కారజ్ 6-7 (7), 6-3, 6-4, 6-4తో 14వ సీడ్ రుబ్లేవ్‌పై పోరాడి గెలిచాడు. మరో మ్యాచ్‌లో నోరీ 6-3, 7-6 (4), 6-7 (9), 6-7 (7), 6-3తో జారీని చిత్తు చేశాడు. మహిళల సింగిల్స్‌లో అన్‌సీడెడ్ బెలిండా బెన్సిక్ 7-6 (4), 6-4తో 18వ సీడ్ అలెగ్జాండ్రోవాకు షాకిచ్చి క్వార్టర్స్‌కు చేరింది. ఇతర రౌండ్-16 మ్యాచ్‌ల్లో 13వ సీడ్ అనిసిమోవా 6-2, 5-7, 6-4తో 30వ సీడ్ ఎస్‌సోకోవాపై, 19వ సీడ్ సంసనోవా 7-5, 7-5తో బౌజాస్‌పై విజయంతో ముందంజ వేశారు.

ప్రీక్వార్టర్స్‌లో భాంబ్రీ జోడీ ఓటమి: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యుకీ భాంబ్రీ/రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ జోరుకు ప్రీక్వార్టర్స్‌లో బ్రేక్ పడింది. రౌండ్-16 పోరులో స్పెయిన్, అర్జెంటీనా జంట గ్రానోలెర్స్/జెబలోస్ 6-4, 3-6, 7-6 (4)తో భాంబ్రీ ద్వయంపై నెగ్గింది. మిక్స్‌డ్ డబుల్స్ రౌండ్-16 మ్యాచ్‌లో భాంబ్రీ/జియాంగ్ (చైనా) జంట 6-7 (8), 3-6తో మార్సెలో (ఎల్‌సాల్వెడార్)/జాంగ్ (చైనా) జోడీ చేతిలో ఓటమి పాలైంది.

సిరీస్ ఆసీస్ వశం

రెండో టెస్టులోనూ విండీస్ ఓటమి

సెయింట్ జార్జ్ (గ్రెనడా): వెస్టిండీస్‌తో రెండో టెస్టులో ఆస్ట్రేలియా 133 పరుగులతో గెలిచింది. దీంతో 3 టెస్టుల సిరీస్‌ను ఆసీస్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో సొంతం చేసుకొంది. ఆసీస్ నిర్దేశించిన 277 పరుగుల ఛేదనలో విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 143 రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ రోస్టన్ చేజ్ (34) టాప్ స్కోరర్. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 243 పరుగులకు ఆలౌటైంది. స్మిత్ (71), గ్రీన్ (52) రాణించారు. షమర్ జోసెఫ్ 4 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 286, విండీస్ 253 రన్స్ చేశాయి.

ఆసియా వెయిట్ లిఫ్టింగ్‌లో భవానికి పసిడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ యువ లిఫ్టర్ రెడ్డి భవాని స్వర్ణ పతకం కొల్లగొట్టింది. కజకిస్థాన్‌లోని ఆస్తానాలో జరుగుతున్న ఈ పోటీల్లో 48 కిలోల విభాగంలో భవాని మొత్తంగా 159 కిలోల బరువెత్తి విజేతగా నిలిచింది. క్లీన్ అండ్ జెర్క్‌లో 90 కిలోలు, స్నాచ్‌లో 69 కిలోల బరువెత్తి వీటిలో కూడా వ్యక్తిగత స్వర్ణాలు సాధించింది. విజయనగరం జిల్లాలోని కొండకరకం గ్రామం భవాని స్వస్థలం.

ఆఖరి వన్డే చేజారింది..

యువ భారత్‌పై ఇంగ్లండ్ గెలుపు

వర్సెస్టర్: భారత్ అండర్-19 జట్టుతో సోమవారం జరిగిన ఆఖరి వన్డేలో ఇంగ్లండ్ ఏడు వికెట్లతో గెలుపొందింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఇప్పటికే సొంతం చేసుకోగా..ఆధిక్యాన్ని 2-3కి ఆతిథ్య జట్టు తగ్గించింది. తొలుత భారత్ 50 ఓవర్లలో 210/9 స్కోరుకే పరిమితమైంది. అంబరీష్ (66) అర్ధ శతకం చేయగా, వైభవ్ సూర్యవంశీ (33) మోస్తరుగా రాణించాడు. అలెక్స్, రాల్ఫీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఇంగ్లండ్ అండర్-19 31.1 ఓవర్లలో 211/3 స్కోరు చేసి నెగ్గింది. బెన్ మాయెస్ (82 నాటౌట్), డాకిన్స్ (66) హాఫ్ సెంచరీలు సాధించారు. నమన్ పుష్పక్ రెండు వికెట్లు తీశాడు.

ఐసీసీ సీఈఓగా సంజోగ్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సీఈఓగా సంజోగ్ గుప్తా నియమితుడయ్యాడు. సంజోగ్ పేరును ఐసీసీ చైర్మన్ జైషా సోమవారం అధికారికంగా ప్రకటించాడు. ప్రస్తుతం సంజోగ్ జియోస్టార్‌లో స్పోర్ట్స్ అండ్ లైవ్ ఎక్స్‌పీరియన్స్ విభాగానికి సీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. 2010లో స్టార్ ఇండియాలో జర్నలిస్టుగా చేరిన సంజోగ్ అంచెలంచెలుగా ఎదిగాడు. కొత్త క్రికెట్ వ్యూహాలను రూపకల్పన చేయడంలో, క్రీడా సంబంధిత వ్యాపార రంగంలో సంజోగ్‌కు అపార అనుభవముందని జైషా తెలిపాడు. ఇక, ఈ పోస్టుకు 25 దేశాల నుంచి 2,500 దరఖాస్తులు రాగా, వడపోత అనంతరం 12 మందితో తుది జాబితాను తయారు చేసి, వారి నుంచి సంజోగ్‌ను ఎంపిక చేశామన్నాడు.

అక్బరుద్దీన్ కాలేజీకి నోటీసులు ఇవ్వరేం?

» గరీబోళ్ల ఇళ్ల మీదకే హైడ్రాను పంపిస్తారా: సంజయ్



జగిత్యాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ సల్కం చెరువు భూమిలో అక్రమంగా నిర్మించిన అక్బరుద్దీన్ కాలేజీ జోలికి వెళ్లబోమని, ఒకవేళ చర్యలు తీసుకుంటే అన్యాయం జరుగుతుందని హైడ్రా కమిషనర్ చెప్పడం మూర్ఖత్వమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమా..? సంబంధిత అధికారి నిర్ణయమా..? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అక్బరుద్దీన్ ఒవైసీకి కొమ్ములున్నాయా..? ఎందుకు మినహాయింపు ఇవ్వాలి..? అని ప్రశ్నించారు. సోమవారం జగిత్యాల జిల్లా భీమారం మండలం వెంకట్రావుపేటలో సంజయ్ మీడియాతో మాట్లాడారు. మూసీ పరీవాహక ప్రాంతంలో గుడిసెలు, చిన్న ఇళ్లు కట్టుకుని జీవిస్తున్న వేలాది మంది పేదల నివాసాలను ప్రభుత్వం కూల్చివేసిందని.. వాళ్లు మనుషులు కాదా..? వాళ్ల ప్రాణాలకు విలువ లేదా..? అని నిలదీశారు. అక్బరుద్దీన్ కాలేజీ భవనానికి నోటీసులెందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములను కబ్జా చేసిన వారికి మద్దతు పలుకుతున్నారని మండిపడ్డారు. తీవ్రవాదులతో సంబంధాలున్న వాళ్లకు ఉద్యోగాలిస్తుంటే వత్తాసు పలుకుతారని.. ఇదేం పద్ధతి అని నిలదీశారు. ఒవైసీ ఆస్తులు, అరాచకాలకు హైడ్రా మినహాయింపు ఇచ్చిందా..? వాళ్లు ఏమైనా కబ్జాలు చేయొచ్చా..? సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని సంజయ్ డిమాండ్ చేశారు.

క్యాబినెట్ నింపితే కాంగ్రెస్‌లో కల్లోలమే

» ముస్లింలకు నేతృత్వం వహించేందుకు ఒవైసీ తహతహ

» అక్బరుద్దీన్ కాలేజీని వెంటనే కూల్చాలి: రాంచందర్‌రావు



హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్యాబినెట్‌లో పెండింగ్‌లో ఉన్న మూడు బెర్త్‌లు ఖాళీగా ఉన్నంత వరకే అధికార పార్టీలో ఐక్యత కనిపిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకత్వం తెలివైందని, మంత్రి పదవులు ఆశిస్తున్న నేతలను ఊరిస్తూ ఆశల పల్లకిలో ఊరేగిస్తోందని వ్యాఖ్యానించారు. మొన్న మూడు క్యాబినెట్ పదవులు ప్రకటించినప్పుడు కాంగ్రెస్‌లో ఎంత రచ్చ జరిగిందో చూశామని అన్నారు. మిగతా మూడింటిని భర్తీ చేసిన మరుక్షణం పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు రోడ్డున పడటం ఖాయమని, అందుకే అధినాయకత్వం వాటిని పెండింగ్‌లో పెట్టిందని అన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తమకు సవాల్ అని అన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ 25వేల ఓట్లు సాధించిందని, ఇప్పుడు సమీకరణాలు మారాయని అన్నారు. రాష్ట్ర బీజేపీ కొత్త కమిటీని 20 రోజుల్లో ఏర్పాటు చేస్తామని చెప్పారు. దేశవ్యాప్తంగా ముస్లిం సామాజిక వర్గానికి నాయకుడు లేడని, దీనిని గుర్తించే అసదుద్దీన్ ఒవైసీ ముస్లింలకు నేతృత్వం వహించేందుకు తహతహలాడుతున్నారని పేర్కొన్నారు. "పాతబస్తీ సల్కం చెరువు భూమిలో ఉన్న అక్బరుద్దీన్ కాలేజీని ఎందుకు కూల్చరు..? ప్రభుత్వ భూములను కబ్జా చేసినా, దాదాగిరీ చేసినా, కరెంట్ బిల్లులు కట్టకపోయినా, తీవ్రవాదులకు ఆశ్రయమిచ్చినా.. వాళ్లకు రక్షణ కల్పిస్తామంటే చూస్తూ ఊరుకోవాలా..? తక్షణమే అక్బరుద్దీన్ కాలేజీని కూల్చివేయాలి. లేకుంటే బీజేపీ ఆ పనిచేస్తుంది" అని హెచ్చరించారు.

ఖాజాగూడ టవర్ల నిర్మాణంపై బిల్డర్లకు నోటీసులు

» ప్రభుత్వ భూముల కబ్జాపై వివరణ ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఖాజాగూడ చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి భారీ టవర్లు నిర్మిస్తున్నారన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని సోమవారం హైకోర్టు ప్రైవేటు పార్టీలకు నోటీసులు ఇచ్చింది. టవర్లు నిర్మిస్తున్న సోహిని బిల్డర్స్, బెవర్లీహిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ సహా పలువురు ప్రైవేటు ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనిరుధ్ రెడ్డి (జడ్చర్ల), యెన్నం శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్), మురళీనాయక్ భూక్యా (మహబూబాబాద్), కూచుకుల్ల రాజేశ్‌రెడ్డి (నాగర్‌కర్నూల్) దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ జరిపింది. ఈ పిటిషన్‌పై గతంలో విచారణ చేపట్టిన ధర్మాసనం.. సర్వే నెంబర్లు, లొకేషన్ వివరాలతో మళ్లీ ఫిర్యాదు చేయాలని సూచించింది. ఆ మేరకు అన్ని వివరాలు సమర్పించడంతో ప్రైవేటుపార్టీలకు నోటీసులు పంపించింది. ప్రైవేటు ప్రతివాదులకు వ్యక్తిగతంగా నోటీసు అందజేయడానికి పిటిషనర్ల న్యాయవాది చిక్కుడు ప్రభాకర్‌కు అనుమతి ఇచ్చింది. నోటీసు ఇచ్చినట్లు ఆధారాలను కోర్టుకు రెండు వారాల్లో సమర్పించాలని ఆ న్యాయవాదిని ఆదేశించింది.విచారణ రెండువారాలకు వాయిదాపడింది.

ధిక్కరణ పిటిషన్‌లో సీఎస్ హాజరుకు ఆదేశాలు

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఓ కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో కోర్టుకు ప్రత్యక్షంగా హాజరు కావాలని ముగ్గురు ఐఏఎస్ అధికారులకు సోమవారం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి హోదాలో ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీధర్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ఎస్. శ్రీనివాసచారిలకు ఫారం-1 నోటీసులు జారీచేసింది. పార్ట్‌టైం స్వీపర్‌లకు రెగ్యులర్ వేతనాలు ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు కాకపోవడంపై ఎ.వి. హేమలత తదితరులు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కోర్టు ధిక్కరణ వ్యాజ్యంలో నోటీసులు జారీచేసినప్పటికీ ప్రతివాదులైన ముగ్గురు ఐఏఎస్‌ల తరఫున ఎవరూ ప్రాతినిధ్యం వహించలేదు. దీంతో ఆగ్రహించిన జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం.. ఈనెల 24న ఆ అధికారులు ప్రత్యక్షంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

రోస్టర్ విధానంతో మాలలకు అన్యాయం

» మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

పంజాగుట్ట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కారణంగా విద్య, ఉద్యోగ రంగాల్లో మాల సామాజికవర్గం తీవ్రంగా నష్టపోతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వల్ల గ్రూప్-3లోని మాలలతో పాటు మరో 25మాల ఉప కులాలకు అన్యాయం జరుగుతోందన్నారు. రోస్టర్ విధానంతో ఎస్సీ రిజర్వేషన్ ఉన్నా మాల సామాజికవర్గంలోని వారికి ఉద్యోగాలలో అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. వెంటనే ఆ విధానాన్ని సరి చేయాలని కోరారు. ఈ అంశంపై కార్యాచరణ రూపొందించేందుకు 11న లక్డీకపూల్‌లోని వాసవి క్లబ్‌లో రాష్ట్రస్థాయి ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను చెన్నయ్య ఆవిష్కరించారు.

'సాదాబైనామా' సమస్య పరిష్కారమయ్యేనా?

» నేడు హైకోర్టు తీర్పు

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం అమల్లోకి వచ్చినా, సాదాబైనామా దరఖాస్తులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేకపోతోంది. హైకోర్టు స్టే విధించడంతో ఈ దరఖాస్తులను పరిష్కరించలేకపోతోంది. మంగళవారం సాదాబైనామాపై కోర్టు తీర్పు వస్తుందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. సాదాబైనామాల విషయంలో అనధికారిక భూ లావాదేవీలు జరగవచ్చన్న అనుమానంతో హైకోర్టు 2020 నవంబరు11న స్టే విధించింది. ఆ తీర్పులో 2020 అక్టోబరు 29 తర్వాత వచ్చిన సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనను ఆపాలని ఆదేశించింది. ఆ ఏడాది అక్టోబరు 12 నుంచి 28 మధ్య వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలనలోకి తీసుకోవచ్చని తెలిపింది. అయితే తుది తీర్పు ఇచ్చేదాకా వాటికి చట్టబద్ధత కల్పించవద్దని ఆదేశించింది. అప్పటి నుంచి అంటే దాదాపు నాలుగున్నరేళ్లుగా సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయి. దరఖాస్తుదారులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. భూభారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినా, కోర్టులో స్టే ఉండడంతో ఏమీ చేయలేకపోతోంది. స్టే తొలగించాలంటూ సర్కారు వేసిన పిటిషన్‌పై మంగళవారం తీర్పు రానుంది. దాని ఆధారంగా ఈ సమస్యపై తదుపరి నిర్ణయం తీసుకోనుంది.

బీసీ రిజర్వేషన్లకు జీవో!



(మొదటిపేజీ తరువాయి)


పరిస్థితే వస్తే.. అప్పుడు పార్టీ పరంగానైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలని భావిస్తోంది. కాగా స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లపై ప్రభుత్వం 30 రోజుల్లో తన బాధ్యతలు నెరవేర్చాలని హైకోర్టు జూన్ 23న ఆదేశించిన విషయం తెలిసిందే. అందులో ఇప్పటికే 15 రోజులు.. అంటే సగం సమయం అయిపోయింది. రిజర్వేషన్లు ఎంత శాతం అనేది ప్రభుత్వం తేల్చితేనే ఎన్నికలకు సంబంధించి తదుపరి ప్రక్రియ చేపట్టడానికి వీలవుతుంది. ఏయే వర్గాలకు ఎంత శాతం రిజర్వేషన్లు అనేది ప్రభుత్వం నిర్ణయిస్తే.. దాని ప్రకారం పంచాయతీ రాజ్ శాఖ క్షేత్రస్థాయిలో రిజర్వేషన్లు ఖరారు చేస్తుంది. గ్రామాల వారీగా, మునిసిపల్ వార్డుల వారీగా, జడ్పీటీసీ, ఎంపీటీసీల వారీగా ఎవరెవరికి ఏయే స్థానాలను రిజర్వ్ చేయాలనేది నిర్ణయిస్తుంది. ఇందుకుగాను పంచాయతీరాజ్ శాఖకు వారం రోజుల సమయం పడుతుంది. ఈ ప్రక్రియ నంతా నెల రోజుల్లో పూర్తిచేసి ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంది. అయితే ఇప్పటికే హైకోర్టు ఆదేశాలిచ్చి రెండు వారాలు కావడం, మరోవైపు పంచాయతీరాజ్ శాఖకు వారం రోజుల సమయం కావాల్సి ఉండటాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. రిజర్వేషన్ల శాతాన్ని తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వారం మాత్రమే గడువు ఉంది.

నేడు తెరుచుకోనున్న శ్రీశైలం గేట్లు!

192.53 టీఎంసీలకు నీటి నిల్వ.. కృష్ణమ్మకు పూజలు చేయనున్న ఏపీ సీఎం చంద్రబాబు

» మహారాష్ట్రలో భారీ వర్షాలతో ఎరుపెక్కిన గోదావరి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



ఎగువన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో సీజన్ ప్రారంభానికి ముందే వరద పోటెత్తడంతో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. మరోవైపు, శబరి, సీలేరు ఉపనదుల వరద ఉధృతి పెరగడంతో గోదావరి నీరు ఎరుపెక్కింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 18.20 అడుగులకు చేరుకుంది. ఇక, గత నెల మొదటి వారం నుంచే ఇన్‌ఫ్లో పెరగడంతో మంగళవారం ఉదయం శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు సతీ సమేతంగా ఉండవల్లి నుంచి నేరుగా హెలికాప్టర్‌లో నంద్యాలలోని సున్నిపెంటకు 11 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుని 11:50-12:10 గంటల మధ్య కృష్ణమ్మకు జల హారతి ఇచ్చి శ్రీశైలం గేట్లు ఎత్తుతారు. గతేడాది జూలై 29న శ్రీశైలం గేట్లు ఎత్తగా ఈ ఏడాది ముందస్తు వరదలతో 21 రోజులు ముందే గేట్లు తెరుచుకోనున్నాయి. జూలై మొదటి వారంలోనే గేట్లు ఎత్తడం గత పాతికేళ్లలో ఇదే తొలిసారి. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 192.53 టీఎంసీలకు చేరుకున్నాయి. గతేడాది 184 టీఎంసీలు ఉన్నప్పుడే గేట్లు తెరవగా ఈ ఏడాది ఎక్కువగా నీటిని నిల్వ చేశారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టుకు 1,71,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఇక శ్రీశైలం ఎగువన ఉన్న ఆలమట్టి ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా ప్రస్తుతం 88.24 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఈ ప్రాజెక్టుకు 1.11 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 1.15 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.93 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఇన్‌ఫ్లో 1.15 లక్షలు వస్తుండగా 30 గేట్ల ద్వారా 1.12 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. జూరాలకు 1.12 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 9.66 టీఎంసీలకు గాను 7.31 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. 12 గేట్లు, విద్యుదుత్పత్తి ద్వారా 1.10 లక్షల క్యూసెక్కులను శ్రీశైలానికి వదులుతున్నారు. ఇక కృష్ణా ఉపనది తుంగభద్రపై ఉన్న టీబీ డ్యాం పూర్తిస్థాయి సామర్థ్యం 105.79 టీఎంసీలు కాగా ప్రస్తుతం 76.71 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఇన్‌ఫ్లో 54,550 క్యూసెక్కులు వస్తుండగా, 61,884 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నాగార్జున సాగర్ పూర్తి నీటి సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 162.4 టీఎంసీలకు చేరుకున్నది. ఎగువన శ్రీశైలం నుంచి నీరు విడుదల చేయడంతో సాగర్ నీటిమట్టం రోజుకు రెండు అడుగుల చొప్పున పెరుగుతోంది. మరోవైపు, ఎడమకాల్వ ద్వారా 3,374క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350 క్యూసెక్కులతో కలిపి సాగర్ నుంచి మొత్తం 4724 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మేడిగడ్డ వద్ద నిలకడగా గోదావరి

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నదికి వరద పోటెత్తింది. శబరి, సీలేరు ఉప నదుల ప్రవాహం కలవడంతో 3,4 రోజుల్లో వరద మరింత పెరుగుతుందని కేంద్ర జల సంఘం, జల వనరులశాఖ అధికారులు తెలిపారు. మరోవైపు తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా ఉంది. సోమవారం బ్యారేజీలోకి 70,710 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీరాం సాగర్‌లోకి 5,178 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు 4488, ఎల్లంపల్లికి 962 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది.

జలవిద్యుత్తు జోరు

ముందే వర్షాలు కురవడంతో జలవిద్యుత్ జెన్‌కో సిరులు కురిపిస్తోంది. జూరాలలో 3.25మిలియన్ యూనిట్లు, లోయర్ జూరాలలో 3.57మిలియన్ యూనిట్లు, శ్రీశైలంలో 17.88మిలియన్ యూనిట్లు, సాగర్‌లో 2.11మిలియన్ యూనిట్లు, పులిచింతలలో 0.36మిలియన్ యూనిట్లు కలిపి ప్రతీరోజు 2.7 కోట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తవుతోంది. దీంతో తెలంగాణ జెన్‌కోకు రోజూ రూ.10కోట్లఆదాయం వస్తోంది.

కొన్ని జిల్లాలకు అతిభారీ వర్షాలు

రాష్ట్రంలో నేడు, రేపు కొన్నిజిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఇక బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ఇచ్చింది. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

గణపతిని చుట్టుముట్టిన బలగాలు?

» పీఎల్‌జీ కమాండర్ హిడ్మా కూడా అక్కడే??

» బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలి

» తెలంగాణ పౌరహక్కుల సంఘం డిమాండ్

చర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బీజాపూర్ దండకారణ్యంలోని నేషనల్ పార్క్‌పై పోలీసు బలగాలు పట్టు సాధించాయా? వచ్చే ఏడాది మార్చికల్లా నక్సలిజాన్ని అంతం చేస్తామని ప్రతినబూనిన కేంద్ర ప్రభుత్వం.. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో 25 వేల బలగాలను మోహరించిందా? మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతితోపాటు.. గెరిల్లా తంత్రాల్లో ఆరితేరిన పీఎల్‌జీ ఒకటో బెటాలియన్ కమాండర్ మాడ్వీ హిడ్మా, మరో అగ్రనేత దేవాను బలగాలు చుట్టుముట్టాయా? ఈ ప్రశ్నలకు అటు ఛత్తీస్‌గఢ్ పోలీసుల హెచ్చరికలు.. ఇటు పౌర హక్కుల నేతల ఆందోళనలు పరోక్షంగా ఔననే సమాధానం చెబుతున్నాయి. నిజానికి కేంద్ర బలగాలు ఈ ఏడాది మార్చి నుంచే తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో భారీ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో.. ఇక్కడి కేంద్ర బలగాలను సరిహద్దులకు తరలించారు. ఆ తర్వాత డీఆర్జీ బలగాలు మాత్రమే కూంబింగ్ కొనసాగించాయి. గత నెల నేషనల్ పార్క్‌లో అతిపెద్ద ఆపరేషన్‌ను నిర్వహించి, కేంద్ర బలగాల సహకారం లేకుండానే 17 మంది మావోయిస్టులను హతమార్చాయి. అయితే.. భారత్-పాకిస్థాన్ సరిహద్దులకు వెళ్లిన బలగాలు అంతేవేగంగా ఛత్తీస్‌గఢ్‌కు తిరిగి రావడం సాధ్యమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పౌరహక్కుల సంఘాల నేతలు మాత్రం 25 వేల కేంద్ర బలగాలతో నేషనల్ పార్క్‌ను చుట్టుముట్టారని ఆరోపిస్తున్నారు.

ఆపరేషన్‌ను ఆపాలి: గడ్డం లక్ష్మణ్

నేషనల్‌పార్క్ ఆపరేషన్‌ను వెంటనే ఆపేయాలని తెలంగాణ రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ అగ్రనేతలను బలగాలు చుట్టుముట్టాయనే సమాచారం అందుతోందన్నారు. హిడ్మా, దేవాను లక్ష్యంగా చేసుకుని, అడవిని చుట్టుముట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. నేషనల్ పార్క్‌ను పోలీసులు చుట్టుముట్టారని, అక్కడ గణపతి, హిడ్మా వంటి అగ్రనేతలు ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారని ప్రొఫెసర్ హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ మావోయిస్టులను లొంగిపోవాలని, లేదంటే చావుకు సిద్ధం కావాలని హెచ్చరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇప్పటికైనా కాల్పుల విరమణ ప్రకటించాలని కోరారు.

గ్రూప్-1 పిటిషన్లపై తీర్పు రిజర్వు

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో మూల్యాంకనం, సెంటర్ల కేటాయింపు సహా అనేక అక్రమాలు జరిగాయని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌లపై హైకోర్టు సోమవారం తీర్పు రిజర్వు చేసింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సురేందర్ రావు, విద్యాసాగర్, రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ టీజీపీఎస్సీ పారదర్శకంగా పరీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. మరోవైపు ఎంపికైన అభ్యర్థులు, టీజీ పీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాదులు డీ ప్రకాశ్‌రెడ్డి, ఎస్ నిరంజన్‌రెడ్డి వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి.. 'నాట్స్' 85 లక్షల విరాళం

» ఆస్పత్రి చైర్మన్ బాలకృష్ణకు అందజేత

» ముగిసిన నాట్స్ 8వ తెలుగు సంబరాలు

(టాంపా నుంచి కిలారు గోకుల్ కృష్ణ)

హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) రూ.85లక్షల (లక్ష డాలర్ల) విరాళం అందజేసింది. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం టాంపాలో నాట్స్ 8వ తెలుగు సంబరాల ముగింపు రోజైన ఆదివారం (ఈ నెల 6న) ఈ విరాళాన్ని ఆస్పత్రి చైర్మన్, సినీనటుడు నందమూరి బాలకృష్ణకు.. నాట్స్ సభల కన్వీనర్ గుత్తికొండ శ్రీనివాస్, బోర్డు చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్, అధ్యక్షుడు మందాడి శ్రీహరి, మాజీ అధ్యక్షుడు మదన్ పాములపాటి చేతులమీదుగా అందజేశారు. నందమూరి బాలకృష్ణ-వసుంధర దంపతులను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమను తాము తెలుసుకొని ప్రేమించడం నేర్చుకోవాలన్నారు. సినీ సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ బృందంతో కలిసి బాలకృష్ణ పాటలు పాడి అలరించారు. అనంతరం 'శక పురుషుడు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సినీ నటుడు వెంకటేశ్, నందమూరి రామకృష్ణ, అట్లూరి అశ్విన్, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ విచారణ: ఇక ప్రవీణ్ వంతు

(మొదటిపేజీ తరువాయి)



నుంచి పోటీ చేశారు. ఎన్నికల సమయంలో తన ఫోన్‌ను ప్రభుత్వం ట్యాప్ చేస్తోందంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ.. "నేను ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోవడం లేదు" అని బహిరంగంగా విమర్శించారు. ఈ ఫిర్యాదుపై ఇప్పుడు సిట్ ఆర్‌ఎస్పీ వాంగ్మూలాన్ని నమోదు చేయాలని నిర్ణయించింది. దీనిపై ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ సోమవారం ఎక్స్‌లో స్పందించారు. "కాంగ్రెస్ పార్టీ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దేశ భద్రతను బజారులో తాకట్టు పెట్టింది. మీ(కాంగ్రెస్) బాధ్యతారాహిత్యం వల్ల శత్రు దేశాలకు కూడా మన రహస్య వ్యవస్థల గురించి తెలిసిపోయింది" అని ఆరోపించారు. అప్పట్లో బీఎస్పీ నేతగా బీఆర్‌ఎస్‌ను నిందించిన ఆర్‌ఎస్పీ.. ఇప్పుడు బీఆర్‌ఎస్ నేతగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎక్స్‌లో పోస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. కాగా, ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు తన సెల్‌ఫోన్, ల్యాప్ ట్యాప్‌ను సిట్ అధికారులకు అప్పగించారు. సిట్ అధికారులు వాటిని సాంకేతికంగా విశ్లేషించించేందుకు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్(ఎఫ్ఎస్ఎల్)కు పంపించారు. అయితే ఫోన్ ట్యాపింగ్ జరిగిన సమయంలో ప్రభాకర్‌రావు రెండు సెల్‌ఫోన్లను ఉపయోగించినట్లు అధికారులకు సమాచారం ఉంది. ఒకటి అధికారిక నంబరు, మరొకటి వ్యక్తిగత ఫోన్ నంబరు. అయితే ఒక నంబరుకు సంబంధించిన సెల్‌ఫోన్‌ను మాత్రమే ఆయన సిట్‌కు అప్పగించారు.

పలువురి వాంగ్మూలాలకు కసరత్తు

ట్యాపింగ్ కేసులో పలువురు రాజకీయ నాయకులకు సిట్ నోటీసులు జారీచేసి, వారి వాంగ్మూలాలను నమోదు చేస్తోంది. ఈ క్రమంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నుంచి వాంగ్మూలం నమోదు చేసేందుకు తమ ఎదుట విచారణకు హాజరు కావాల్సిందిగా నోటీసులు జారీ చేసింది. నిజానికి ఆయన గత శనివారం సిట్ ఎదుట విచారణకు హాజరుకావాల్సి ఉన్నా.. పార్టీ కార్యక్రమాల్లో బిజీగా ఉండటంతో రాలేదు. ఈ నేపథ్యంలో ఆయన ఒకట్రెండ్రోజుల్లో సిట్ ఎదుట హాజరవుతారని సమాచారం. మరికొందరు రాజకీయ నేతలు, వారి అనుచరులను కూడా సిట్ విచారించనున్నట్లు తెలుస్తోంది. ఇదే కోవలో.. వ్యాపారవేత్తల ఫోన్లను ట్యాప్ చేసి, కోట్లలో ఎలక్టోరల్ బాండ్లు కొనిపించుకున్న ఉదంతంపై సిట్ ప్రత్యేక దృష్టిసారించింది. ఈ క్రమంలో అప్పట్లో ట్యాపింగ్ ముఠా బాధితులుగా ఉన్న వ్యాపారవేత్తలను విచారించనున్నట్లు సమాచారం.

ఫోన్ ట్యాపింగ్ కేసులో యెన్నంకు పిలుపు

మహబూబ్‌నగర్: ఫోన్ ట్యాంపింగ్ కేసులో ఈనెల 10 స్టేట్‌మెంట్ రికార్డ్‌కు హాజరుకావాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి అధికారుల నుంచి పిలుపు వచ్చింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌కు గురైందని ఎన్నికల అనంతరం ఆయన డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారణ వేగవంతమైన నేపథ్యంలో ఈనెల 10న ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ డివిజన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ముందు హాజరై స్టేట్‌మెంట్ ఇవ్వాలని అధికారులు సూచించారు.

నీళ్లు ఆంధ్రాకు.. నిధులు ఢిల్లీకి..!

» రేవంత్ పాలనలో జరుగుతున్నది ఇదే: హరీశ్



హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నీళ్లు ఆంధ్రాకు, నిధులు ఢిల్లీకి.. అన్నట్లుగా రేవంత్‌రెడ్డి పాలన సాగుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణకు నష్టం కలిగించే కార్యక్రమాల కోసమే సీఎం ఢిల్లీ వెళ్తారని.. ఇప్పుడు కూడా అందుకే వెళ్లారని, అంతకు మించి ఆయన చేసేదేమీ లేదని విమర్శించారు. సోమవారం మెదక్ జిల్లా కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల జీతాల నుంచి తల్లిదండ్రుల సంక్షేమం కోసం 10 శాతం ఇవ్వాలని సీఎం మాట్లాడినట్లుగా వార్తలు వస్తున్నాయన్నారు. అలాగైతే అడ్డదారిలో అధికారంలోకి వచ్చి, నయవంచన చేసిన ఆయనకు ఏం కోత పెట్టాలని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీలకు కేసీఆర్ ఇచ్చిన ట్రాక్టర్లకు డీజిల్ పోయకపోవడంతో అవి మూలన పడ్డాయన్నారు. ఊళ్లలో బల్బులు పెట్టేవాళ్లు కూడా లేరని, పాలన పడకేసిందని చెప్పారు. నిజం నిలకడ మీద తెలుస్తుందన్నట్లుగా.. కాంగ్రెస్ పాలన ప్రజలకు అర్థమైందన్నారు. కాళేశ్వరం నీళ్లు మెదక్‌కు కూడా వస్తాయని, మోటార్లు ఆన్ చేయాలని అడిగితే పిచ్చిగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. నిజం చెప్పే ధైర్యం లేక ఉత్తమ్ అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారన్నారు. మెదక్ అంటే కేసీఆర్‌కు చాలా ఇష్టమని, ఇక్కడ నాలుగు లైన్ల రోడ్లు, డివైడర్లు, అద్భుతంగా నిర్మించారని చెప్పారు. ఈ ప్రాంతంలో చిట్టచివరి ఆయకట్టు వరకు నీళ్లందేలా చేశారన్నారు. శ్రీశైలంలో వరద వచ్చి 36 రోజులు అయ్యింది అబద్ధమా? మోటార్లు ఆన్ చేయనిది అబద్ధమా? 65 శాతం నీటిని వినియోగించకుండా ఏపీకి వదిలింది అబద్ధమా? అని హరీశ్ ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు గేట్లు ఎత్తి కృష్ణా నీళ్లు తీసుకుపోతుంటే నువ్వు కల్వకుర్తి మోటార్లు ఆన్ చేయకుండా మోసం చేయడం అబద్ధం కాదా? అని నిలదీశారు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో గోదావరిలో లక్ష క్యూసెక్కులు వృథాగా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం కలిసి పనిచేద్దామని, రాష్ట్రవ్యాప్తంగా గులాబీ జెండాను ఎగరేద్దామని హరీశ్ పార్టీ నేతలకు పిలుపునిచ్చారు.

సీఎం సిగ్గున్నోడైతే..



(మొదటిపేజీ తరువాయి)

హామీలిచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి కర్రు కాల్చి వాత పెట్టాల్సిన సమయం వచ్చిందన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఇంతలా తిడుతున్న ముఖ్యమంత్రి చరిత్రలో ఎవరూ లేరని.. సిగ్గు, శరం ఉన్నోడయితే ఈపాటికి బకెట్ నీళ్లలో మునిగి ఆత్మహత్య చేసుకునే వాడని విమర్శించారు. ఆయనకు సిగ్గు, శరం లేదు కాబట్టే ప్రజలు ఎంత తిట్టినా పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీకి పోతే తమను చెప్పులు ఎత్తుకుపోయే దొంగల్లాగా చూస్తున్నారని ఏ ముఖ్యమంత్రి అయినా చెప్పుకుంటారా? అని నిలదీశారు. ఎన్టీఆర్, చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కేసీఆర్‌లాంటి గొప్ప ముఖ్యమంత్రులను చూసిన ప్రజలు రేవంత్‌రెడ్డిని చూసి 'ఛీ' అనుకుంటున్నారని చెప్పారు. నర్సింగ్ అనే బీఆర్‌ఎస్ కార్యకర్త ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెడితే పోలీసులు అక్రమంగా తీసుకెళ్లి తీవ్రంగా హింసించారన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా ముఖ్యమంత్రిని పొగడడమే పనిగా పెట్టుకోవాలా? ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? అని నిలదీశారు. హరీశ్ దగ్గర రేవంత్‌రెడ్డి శిష్యరికం చేశారని, అప్పట్లో హరీశ్ మంత్రి అయినపుడు ఇదే తెలంగాణభవన్ ముందు ఆయన డ్యాన్సులు కూడా చేశారని.. అలాంటి వ్యక్తి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను ఇష్టమొచ్చినట్టు మాట్లాడడం న్యాయమా? అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు 100 సీట్లు గెలుస్తామని సీఎం చెబుతున్నారని, అందుకే వంద కాదు వాని బొంద అని విమర్శించానని చెప్పారు. అధికార పార్టీ నేతలు ప్రతిపక్ష పార్టీలో చేరడమంటే సాధారణ విషయం కాదన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టేవరకు కష్టపడదామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మెదక్‌లో కొన్ని గాడిదలున్నాయని.. వాటి సంగతి బీఆర్‌ఎస్ కార్యకర్తలు చూసుకుంటారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్న పోలీసులు రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు. మంత్రి సీతక్క అనుచరుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న చుక్క రమేశ్ మృతికి నిరసనగా బీఆర్‌ఎస్ చేస్తున్న శాంతియుత ఆందోళనను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఎవరి ఆదేశాల మేరకు దౌర్జన్యంగా ఇళ్లలోకి దూరి 2 వేల మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలను అరెస్ట్ చేశారో ములుగు పోలీసులు చెప్పాలన్నారు. రమేశ్ ఆత్మహత్యకు కారణమైన సీతక్క అనుచరులపై కేసు నమోదు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

సిరిసిల్ల నియోజకవర్గంలో కేసీఆర్ కిట్లు అందిస్తా

తన జన్మదినం సందర్భంగా సిరిసిల్లలో 4910 మందికి కేసీఆర్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు కేటీఆర్ తెలిపారు. మాతా శిశు మరణాలను తగ్గించి, వారికి మంచి ఆరోగ్యాన్ని అందించేలా బీఆర్‌ఎస్ హయాంలో ఇచ్చిన కేసీఆర్ కిట్లను సీఎం రేవంత్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. అందుకే సిరిసిల్ల జిల్లాలో గత 18 నెలల్లో పుట్టిన ప్రతి శిశువుకు కేసీఆర్ కిట్‌ను అందిస్తానన్నారు.



రైతులకు చెక్కులను అందజేస్తున్న మంత్రులు సీతక్క, తుమ్మల

రైతు సంక్షేమానికి సర్కారు పెద్ద పీట

- రూ.1.05లక్షల కోట్లు ఖాతాల్లో వేసిన ఘనత సీఎందే
- బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు:తుమ్మల, సీతక్క

ములుగు/వాజేడు/మంగపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి రేవంత్ సర్కారు పెద్ద పీట వేస్తోందని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క అన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అన్ని సంక్షేమ పథకాలనూ రేవంత్‌రెడ్డి మాత్రమే సమర్థంగా అమలు చేస్తున్నారని చెప్పారు. రూ.1.05లక్షల కోట్లు రైతుల ఖాతాలో జమ చేసిన ఘనత సీఎం రేవంత్‌దేనని కొనియాడారు. సోమవారం ములుగు జిల్లాలో ఇరువురు మంత్రులు పర్యటించారు. ఒప్పంద వ్యవసాయంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన మొక్కజొన్న రైతులకు పరిహారం చెక్కులను వాజేడులో పంపిణీ చేశారు. వాజేడు, కన్నాయిగూడెం, వెంకటాపురం మండలాలకు చెందిన 671 మంది రైతులకు రూ.3.80కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మల, సీతక్క మాట్లాడారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుంటే బీఆర్ఎస్, విపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని మండిపడ్డారు. నష్టపోయిన రైతులకు చెక్కుల పంపిణీకి అడ్డు తగలొద్దని చెప్పినా బీఆర్ఎస్ నేతలు నిరసనలు చేయటం సిగ్గుచేటన్నారు. ఆపరేషన్ కగార్‌కు నిలయంగా మారిన కర్రెగుట్టలను టూరిజం హబ్‌గా మారుస్తామని హామీనిచ్చారు. కాగా, మంగపేటలో మోడల్ పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవనికి మంత్రి సీతక్క వస్తుండగా కమలాపురంలోని ఎస్సీ కాలనీవాసులు అడ్డుకున్నారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

కేంద్రంపై కలిసి కట్టుగా ఒత్తిడి తెస్తాం

- పామాయిల్ దిగుమతి సుంకం పెంచాల్సిందే: తుమ్మల

హైదరాబాద్,అశ్వాపురం, జులై 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో కలిసి పామాయిల్ దిగుమతులపై సుంకాలు పెంచాలన్న డిమాండ్‌పై కేంద్రంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు మేలు చేసే విధంగా కేంద్ర విధాన మార్పులు ఉండాలని అన్నారు. సోమవారం సాగుదారుల సమస్యలపై నలుగురు దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో ఆయన సంప్రదింపులు నిర్వహించారు.పామాయిల్ దిగుమతులపై ప్రస్తుత కస్టమ్స్ డ్యూటీని పెంచాలన్న అంశంపై ఈ చర్చలు జరిగాయి. కాగా, దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తమిళనాడు, కేరళ, కర్ణాటకలతో పాటు అరుణాచల్ ప్రదేశ్, అసోం, మిజోరం, నాగాలాండ్, త్రిపుర ఈశాన్య రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు తుమ్మల వ్యక్తిగతంగా లేఖలు రాశారు. ఆయిల్ పామ్ దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ పెంచాలన్న డిమాండ్‌తో కేంద్రాన్ని కలవాలని, రైతుల పక్షాన గళం వినిపించాలని కోరారు. అవసరమైతే దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతో సమావేశమై తమ డిమాండ్‌ను వినిపించాలని కోరారు. కాగా, సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి జిల్లాకు వచ్చే రబీ సీజన్‌నాటికి నీరందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తుమ్మల తెలిపారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పనులను సోమవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారెళ్లపాడు పూర్తయితే పినపాక నియోజకవర్గంలో కొత్తగా 25వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పథకం పనుల్లో జాప్యంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నవంబరు నాటికి పూర్తయ్యేలా పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు.

ప్రగతి భవన్ కట్టారు. పేదోళ్ల ఇళ్లు మరిచారు

- హామీలు మరిచి, అప్పులు మిగిల్చిన కేసీఆర్:మంత్రి పొంగులేటి



హైదరాబాద్, మన్ననూర్/అచ్చంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన మాజీ సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత పదేళ్లలో 2 వేల కోట్లతో ప్రగతి భవన్ నిర్మించుకొని విలాసవంతమైన జీవితం గడిపారని, పేదలకు మాత్రం ఇళ్లు కట్టించడం మరిచిపోయారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. నాగర్‌కర్నూలు జిల్లా మన్ననూరులో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డిలతో కలిసి 536 మంది ఆదివాసీ చెంచు లబ్ధిదారులకు సోమవారం ఇందిరమ్మ గృహనిర్మాణ అనుమతి పత్రాలను అందజేసి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా, రూ.8.19లక్షల కోట్ల అప్పులు చేసి ధనిక తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నదని, రాష్ట్రంలో మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. అటవీ, రెవెన్యూ అధికారులు మానవీయ కోణంలో సమన్వయంతో పని చేసినప్పుడే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని పొంగులేటి అన్నారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని భూ సమస్యలపై సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ శాఖ హక్కులు కల్పించాలని భావించినా నిబంధనల పేరుతో అటవీ అధికారులు కొర్రీలు వేస్తున్నారని, దీనిపై అటవీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

కన్నెపల్లి దగ్గరికొస్తే తాట తీస్తాం!

- హరీశ్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హెచ్చరిక
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు: దానం

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి, కల్వకుర్తి పంప్ హౌస్‌ల దగ్గరికి వస్తే తాట తీస్తామని హరీశ్‌రావును దేవరకద్ర కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్లుగా ఆయన మాట్లాడుతున్నాడని, కాళేశ్వరం ప్రాజెక్టులో ఇప్పుడు నీళ్లు నింపితే ఏమవుతుందో అందరికీ తెలుసని చెప్పారు. ప్రాజెక్టుల నుంచి రైతులకు ఎప్పుడు నీళ్లు విడుదల చేయాలో ప్రభుత్వానికి తెలుసన్నారు. సోమవారం సీఎల్పీ మీడియా హాల్లో ఆయన మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు నిల్వ చేస్తే అది కూలిపోవడం ఖాయమని ఎన్డీఎస్ఏ తేల్చి చెప్పిందని, ఆ సూచనలనే ప్రభుత్వం పాటిస్తోందని స్పష్టం చేశారు. 'ముచ్చుమర్రి నుంచి కృష్ణా నీళ్లను ఏపీ తోడుకు పోతోంటే బీఆర్ఎస్ సర్కారు పదేళ్లు పట్టించుకోలేదు. కల్వకుంట్ల కుటుంబం అవినీతిపై విచారణ జరుగుతుంటే.. ఆ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే బనకచర్ల అంశాన్ని ముందుకు తెచ్చారు.' అని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. తనకు మంత్రి పదవి ఇచ్చే విషయం అధిష్ఠానమే నిర్ణయిస్తుందన్నారు. గాంధీభవన్‌లో 'అందుబాటులో ప్రజాప్రతినిధులు' కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు, ప్రజల నుంచి దానం వినతిపత్రాలు స్వీకరించారు.

వారిని అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా తీసుకోవాలి

- వైద్య మంత్రికి పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇన్-సర్వీస్ పీజీ వైద్యులను ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా వెంటనే నియమించాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ సర్కారుకు విజ్ఞప్తి చేసింది. ఈమేరకు అసోసియేషన్ ప్రతినిధుల బృందం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదరను కలిసి వినతిపత్రం అందజేసింది. ఏటా 150-250 మంది ఇన్-సర్వీస్ పీజీ వైద్యులు వివిధ స్పెషాలిటీల్లో పట్టభద్రులవుతారన్నారు. వీరిని అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా తీసుకుంటే ప్రభుత్వానికి అదనపు భారం ఉండదని, విద్యా సంస్థల్లో ఫ్యాకల్టీ కొరత తీరుతుందని తెలిపారు.

అదృష్టమో.. దురదృష్టమో.. ఆగమైన శాఖలిచ్చారు!

(మొదటిపేజీ తరువాయి)

బర్లు.. అన్నీ కిరికిరులైనంక నా చేతిలో పెట్టిన్రు. ఇప్పుడు నేనా కిరికిరి చూడాల్నా.. లేకపోతే కొత్తగా పనిచేయాల్నా.. అర్థంకాని పరిస్థితి" అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సోమవారం కరీంనగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన వాకిటి శ్రీహరి.. చేపపిల్లల పెంపక కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో మత్స్యశాఖలో జరిగిన అవినీతి మూలంగా మత్స్యకారులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి.. మొదటిసారిగా ముదిరాజ్ బిడ్డను చేపలమంత్రిగా చేశారని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ఆయన.. తన శాఖల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. "స్పోర్ట్స్ ఒక్కటే కాదు.. నాకిచ్చిన ఐదు అట్లనే ఇచ్చిన్రు. తెలంగాణ వచ్చిందే నీళ్లు, నిధులు, నియామకాల మీద. అందులో నియామకాలు ఎవరికి ఇవ్వలే. కానీ యువజన సర్వీసుల శాఖ నాకు ఇచ్చిన్రు. ఇప్పుడు ఉపాధి ఎలా కల్పించాలి? ఇక గొర్ల విషయమైతే ఈ రాష్ట్రంలో జరిగిందేందో మొత్తం దేశానికి తెలుసు. అదే గొర్రె బయటకు దాటి.. మళ్లీ అదే గొర్రె లోపటికి వచ్చె. ఆ శాఖ కూడా నాకే ఇచ్చిన్రు. ఇక చేపల సంగతి.. గత పదేళ్లలో చేపలు ఎలా విడుస్తారో చూద్దామంటే నేనున్నప్పుడు చేపలు విడిచేవారు కాదు. నేను ఇంటికి పోయినంక విడిచేవారు. ఎన్ని విడిచారంటే మూడు లక్షలు అని చెప్పేవారు. కానీ పెరిగేవి మాత్రం మూడు వేల చేపలే. అలా చానా మోసం జరిగింది. దీంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈసారి రాష్ట్రంలోనే మొదటిసారిగా చేపలోనికి చేపల మంత్రి ఇచ్చారు. మరీ చేపల మంత్రినై చేపలు విడవకపోతే నాకు తల వంచుకునే పరిస్థితి వస్తుందని అంటే.. స్పెషల్ బడ్జెట్ కింద రూ.120 కోట్లు మంజూరు చేశారు. చేపల కేంద్రాల నిర్వహణకు, పంపిణీ కోసం బడ్జెట్ ఇచ్చారు" అని వివరించారు. అయితే.. ఎంత క్లిష్టమైన పరిస్థితిలో తనకు ఈ శాఖలు ఇచ్చారో.. అంతే అద్భుతంగా తీర్చిదిద్దుతానని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.



మహిళలకు 60 ఎమ్మెల్యే టికెట్లు

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇస్తాం.. వారిని గెలిపించే బాధ్యత నేను తీసుకుంటా

- మహిళా సంఘాలకు 21 వేల కోట్ల రుణాలిచ్చాం
- ఈ ఏడాది 18 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం: సీఎం రేవంత్
- వ్యవసాయ వర్సిటీలో వనమహోత్సవం ప్రారంభం



వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కను నాటుతున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్/రాజేంద్రనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ అమలు కాబోతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి 60 మంది మహిళలకు టికెట్లు ఇవ్వడంతో పాటు వారిని గెలిపించే బాధ్యత కూడా తాను తీసుకుంటానని ప్రకటించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నామని, అన్నిరంగాల్లో వారిని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. రుద్రాక్ష మొక్కను నాటి వనమహోత్సవానికి సీఎం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఒక్క ఏడాదిలోనే మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల మహిళలు కూడా మహిళా సంఘాల్లో చేరాలని పిలుపునిచ్చారు. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారుచేసిన వస్తువులను మార్కెటింగ్ చేసే సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకిచ్చేలా మహిళలను ప్రోత్సహించి, ఆదాయం పెంచుకునేలా ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని చెప్పారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను కూడా మహిళలకే అప్పగించామన్నారు. భారత్ సమ్మిట్, మిస్‌వరల్డ్ కార్యక్రమాలకు హాజరైన ప్రతినిధులు ఇందిరా మహిళాశక్తి పేరుతో ఏర్పాటుచేసిన ప్రాంగణాన్ని చూసి తెలంగాణ మహిళలు ప్రపంచంతో పోటీ పడుతున్నారంటూ కితాబునిచ్చారని తెలిపారు. మీడియా ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యం..

ప్రకృతిని మనం కాపాడితే.. మనల్ని ప్రకృతి కాపాడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాది వనమహోత్సవంలో భాగంగా రాష్ట్రంలో 18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారని, తల్లులు కూడా పిల్లల పేర్లతో మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి ఇంట్లో కనీసం రెండు మొక్కలు నాటాలన్నారు. పిల్లలను సంరక్షించినట్లు మొక్కలను సంరక్షిస్తే రాష్ట్రమంతా పచ్చదనంతో పరిఢవిల్లుతుందన్నారు. వనమే మనం.. మనమే వనం అని పెద్దలు చెప్పారని, ప్రతి ఒక్కరూ పెద్దల మాటలు గౌరవించి మొక్కలు నాటాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. చెట్లను పెంచడం ద్వారా మనల్ని మనం రక్షించుకోవడంతో పాటు జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. భౌగోళిక పరిస్థితి మెరుగుపడే విధంగా రాష్ట్రమంతా విరివిగా వనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, డాక్టర్ దండ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు యూనివర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించారు.

10న క్యాబినెట్ భేటీ

బనకచర్ల, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ

- యువ వికాసం, మెడికల్ కాలేజీల్లో మౌలిక సదుపాయాల కల్పనపైనా చర్చించే అవకాశం

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రిమండలి ఈ నెల 10న సమావేశం కానుంది. సచివాలయంలోని ఆరో అంతస్తులో ముఖ్యమంత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నారు. ప్రధానంగా.. ఇటీవల వివాదాస్పదంగా మారిన బనకచర్ల ప్రాజెక్టుపై, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, సన్నద్ధత, రిజర్వేషన్లు వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలిసింది. వీటితోపాటు రాజీవ్ యువ వికాసం పథకం పైనా చర్చించే అవకాశం ఉంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఈ పథకం ఇప్పటికీ గాడిన పడలేదు. యువత నుంచి దరఖాస్తులు స్వీకరించారే తప్ప.. ఇంకా అవి కొలిక్కి రాలేదు. ఇక వైద్య కళాశాలలకు మౌలిక సదుపాయాల కల్పన అంశంపై క్యాబినెట్ భేటీలో చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో తనిఖీలు నిర్వహించిన జాతీయ వైద్య కమిషన్ కొన్ని లోపాలను గుర్తించింది. ఇలాంటి లోపాలను సరిదిద్ది, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. దీనిపై మంత్రివర్గంలో చర్చ జరిగే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌ల నియామకం

క్షేత్రస్థాయి పార్టీ నిర్మాణంలో టీపీసీసీ మరో అడుగు

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా సంస్థాగత నిర్మాణం పూర్తి చేసేందుకు టీపీసీసీ కసరత్తులో మరో అడుగు పడింది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కమిటీలను ఏర్పాటు చేసేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ సోమవారం టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు ఇచ్చారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఇటీవల ఇచ్చిన ఆదేశాల మేరకు ఆయన చర్యలు చేపట్టారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షితో కలిసి మహేశ్‌గౌడ్.. ఈ పది మంది ఇన్‌చార్జ్‌లతో జూమ్ యాప్ ద్వారా సమావేశమయ్యారు. కమిటీల ఏర్పాటుకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ఇక ఈ ఇన్‌చార్జ్‌లకు తోడు కమిటీల నిర్మాణ ప్రక్రియలో పాలుపంచుకునేందుకు ఏఐసీసీ పరిశీలకులు రానున్నారు. వీరంతా కలిసి.. పార్టీ గ్రామ, బ్లాకు, మండల కమిటీల అధ్యక్షులు, కార్యవర్గాలను నియమించనున్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష, కార్యవర్గ నియామకాలనూ పూర్తి చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లు వీరే..

ఖమ్మం-ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, నల్లగొండ-ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్-మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మెదక్ -మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్-టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, మహబూబ్‌నగర్-రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు జెట్టి కుసుమ్‌కుమార్, ఆదిలాబాద్-ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కరీంనగర్-ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, నిజామాబాద్-వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుసేని, రంగారెడ్డి-స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి.

క్రీడా వర్సిటీకి సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)



సీఎం రేవంత్‌తో సమావేశమైన ప్రముఖ నటుడు అజయ్ దేవ్‌గణ్

కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరారు. భువనగిరిలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, రాయగిరిలో స్విమ్మింగ్ పూల్, మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో, నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌ల నిర్మాణాలు, కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో మల్టీపర్పస్ హాల్, హైదరాబాద్ హకీంపేట్‌లో ఆర్చరీ రేంజ్, సింథటిక్ హాకీ ఫీల్డ్, ఎల్‌బీ స్టేడియంలో స్క్వాష్ కోర్టు, నేచురల్ ఫుట్‌బాల్ ఫీల్డ్ అభివృద్ధి, సింథటిక్ ట్రాక్, గచ్చిబౌలిలో హాకీ గ్రౌండ్ నవీకరణకు రూ.100 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. క్రీడా వసతులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్నివిధాలా కృషి చేస్తోందని, కేంద్రం సైతం తమ వంతు సహకారం అందించాలని కోరారు. 2036లో దేశంలో నిర్వహించే ఒలింపిక్స్‌లో కనీసం రెండు ఈవెంట్లను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గతంలో మాదిరే రైల్వే టికెట్లలో రాయితీ ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

క్రీడారంగం అభివృద్ధిపై కపిల్‌దేవ్ ప్రశంస..

తెలంగాణలో క్రీడారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ ప్రశంసించారు. సోమవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కపిల్ దేవ్ కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, క్రీడాభివృద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కపిల్‌దేవ్‌కు సీఎం రేవంత్ వివరించారు. దీంతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు తెలంగాణలో క్రీడాభివృద్ధికి సంబంధించిన అన్ని విషయాల్లోనూ తాను భాగస్వామినవుతానని కపిల్ దేవ్ అన్నారు. కాగా, దక్షిణ కొరియాతోపాటు పలు దేశాల్లో తాము సందర్శించిన క్రీడా యూనివర్సిటీలు, అక్కడి క్రీడా ప్రముఖులతో తమ భేటీల వివరాలను కపిల్‌దేవ్‌కు సీఎం వివరించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణలో అజయ్ దేవ్‌గణ్ ఫిల్మ్ స్టూడియో..

తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఫిల్మ్ స్టూడియో ఏర్పాటు చేస్తానని ప్రముఖ బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ అన్నారు. ఇందుకు అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఢిల్లీలో సీఎంను ఆయన నివాసంలో అజయ్ దేవ్‌గణ్ కలిశారు. ఈ సందర్భంగా సినీ నిర్మాణంలో కీలకమైన యానిమేషన్, వీఎఫ్ఎక్స్ స్టూడియో, ఏఐ, ఇతర సదుపాయాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్టూడియో తెలంగాణలో ఏర్పాటు చేస్తానన్నారు. స్టూడియో నిర్మాణంతోపాటు సినీ పరిశ్రమలో వివిధ విభాగాలకు అవసరమైన నిపుణులను అందుబాటులోకి తెచ్చేందుకు నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకూ ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు. తెలంగాణ రైజింగ్‌కు సంబంధించి మీడియా, సినిమా రంగాలకు ప్రచారకర్తగా ఉంటానని సీఎంకు తెలిపారు. కాగా, ముఖ్యమంత్రి మంగళవారం కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్వినీ వైష్ణవ్, జేపీ నడ్డాలతో సమావేశమయ్యే అవకాశం ఉంది.

యంత్రాలకు మరమ్మతులు చేయాలి!

- ఆస్పత్రుల్లో యంత్రపరికరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- పెద్ద సమస్యలుంటే మూడు రోజుల్లో పరిష్కరించాలి
- వైద్య శాఖ సమీక్షలో మంత్రి దామోదర



హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో యంత్ర పరికరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం రాష్ట్ర స్థాయిలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ కార్యదర్శికి సూచించారు. సోమవారం కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో ఆయన వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో టీజీఎంఎస్ఐడీసీ ప్రధాన కార్యాలయంలో ఐదుగురు బయోమెడికల్ ఇంజనీర్లతో కూడిన కేంద్రీయ పర్యవేక్షణ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. టీజీఎంఎస్ఐడీసీలో పరికరాల విభాగం జనరల్ మేనేజర్‌గా సీనియర్ బయోమెడికల్ ఇంజనీర్‌ను నియమించాలన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సబ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని, అవసరాన్ని బట్టి వాటిలో ఒకరిద్దరు బయోమెడికల్ ఇంజనీర్లను నియమించాలని చెప్పారు. పరికరాల నిర్వహణపై ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి ప్రాథమిక శిక్షణ ఇప్పించాలన్నారు. యంత్రం మరమ్మతుకు గురైన గంట లోపే ఆస్పత్రి సూపరింటెండెంట్ సబ్ యూనిట్‌కు, ప్రధాన కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. చిన్నపాటి మరమ్మతులైతే ఒక్కరోజులోనే పరిష్కరించేలా కొత్త వ్యవస్థ ఉండాలని మంత్రి ఆదేశించారు. పెద్ద సమస్యలు ఉంటే మూడు రోజుల్లోగా దాన్ని సరిచేసి, యంత్రాలు పనిచేసేలా చూడాలని స్పష్టం చేశారు. ఒకవేళ విడిభాగాలు అవసరమైతే, సంబంధిత సరఫరాదారుకు సమాచారమిచ్చి మరమ్మతు చేయించాలని చెప్పారు. యంత్ర పరికరాల బాధ్యత ఆస్పత్రి సూపరింటెండెంట్లదేనని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రి స్థాయిని బట్టి, ఏయే యంత్రాలు ఉండాలనేదానిపై ఒక ప్రామాణిక జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, డీఎంఈ నరేంద్ర కుమార్, వీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ సభ్యులుగా కమిటీని నియమించారు. కొత్త టిమ్స్ ఆస్పత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని చెప్పారు. వైద్యులు, సిబ్బంది, రోగుల అవసరాలకు అనుగుణంగా ఫర్నిచర్ కొనుగోలు చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని, ఇందుకు అనుగుణంగా మందులు అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి ఆదేశించారు. టీ డయాగ్నస్టిక్స్ కేంద్రాల్లో అన్నిరకాల పరీక్షలు, స్కాన్లు చేయాలని చెప్పారు.

వెల్‌నెస్ కేంద్రాల్లో తనిఖీలు

ఉద్యోగులు, పింఛనుదారులు,జర్నలిస్టులకు వైద్యసేవలందించే వెల్‌నెస్ కేంద్రాలపై మీడియా వార్తల నేపథ్యంలో మంత్రి దామోదర సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ఆదేశాలతో వెల్‌నెస్ కేంద్రాల్లో ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వెల్‌నెస్ కేంద్రాల్లో వైద్యులు, ఔషధాలు, సిబ్బంది హాజరుపై వివరాలు సేకరించి, నివేదిక రూపొందించారు.

లక్షల కోట్లతో కూలిపోయే కాళేశ్వరం కట్టారు

- మరమ్మతుల పేరిటా రూ.కోట్ల దోపిడీ
- బీఆర్ఎస్ పాలనలో పల్లెలకు రోడ్లు వేయలేదు
- ఫాంహౌస్ చుట్టూ రూ.750కోట్లతో రోడ్లు
- పదేళ్లు దోచుకున్నారు: మంత్రి కోమటిరెడ్డి



బిచ్కుంద, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ హయాంలో రూ.లక్షల కోట్ల అప్పులు చేసి.. కూలిపోయే కాళేశ్వరం కట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టు కుంగిపోయి కూలిపోతున్నా.. మరమ్మతుల పేరిట రూ.కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి కోమటిరెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం బిచ్కుందలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. కాళేశ్వరం అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపడుతుంటే.. బీఆర్ఎస్ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. పదేళ్లుగా కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుని అప్పుల పాలు చేసిందన్నారు. కేసీఆర్ చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ నెలకు రూ.6వేల కోట్ల వడ్డీ చెల్లిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో పల్లెలకు రోడ్లు వేయలేదు కానీ.. కేసీఆర్ తన ఫాంహౌస్ చుట్టూ రూ.750 కోట్లతో నాలుగు లేన్ల రోడ్లు వేసుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. పదేళ్లలో యువతకు ఉద్యోగాల గురించి పట్టించుకోలేదు కానీ.. కేసీఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ ఉద్యోగాలు దక్కాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబానికి తప్ప... ఏ పేద కుటుంబానికీ మేలు జరగలేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నేతలు చెప్పే అబద్ధాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. ఏడాదిన్నరలోనే పేదలకు 5లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మిస్తున్నామని, ఏడాదిన్నరలోనే 60వేల ఉద్యోగాలను భర్తీ చేశామని గుర్తు చేశారు. బిచ్కుంద నుంచి శాంతాపూర్ జాతీయ రహదారి వరకు రెండు లేన్ల ప్రధాన రహదారికి రూ.20కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు. మంత్రి ఉత్తమ్‌తో మాట్లాడి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న లెండి, నాగమడుగు ప్రాజెక్టులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



ఐసెట్ ఫలితాలు విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి తదితరులు

ఐసెట్‌లో 58,985 మంది ఉత్తీర్ణత

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్ ఫలితాలు వెలువడ్డాయి. సోమవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్లు పురుషోత్తం, మహమూద్, ఐసెట్ కన్వీనర్ అలువాల రవి ఫలితాలను విడుదల చేశారు. జూన్ 8, 9 తేదీల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 64,938 మంది హాజరుకాగా 58,985(90.83%) మంది ఉత్తీర్ణత సాధించారు. అబ్బాయిల్లో 90.7%, అమ్మాయిల్లో 90.95% ఉత్తీర్ణత నమోదైంది.

ఎప్‌సెట్‌లో 85,695 మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి

ఇంజనీరింగ్ ప్రవేశాలకు ఉద్దేశించిన ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. గత నెల 28 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం కాగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన మంగళవారంతో ముగియనుంది. సోమవారం వరకు 97,533 మంది ధ్రువపత్రాల పరిశీలన కోసం దరఖాస్తు చేసుకోగా 85,695 మంది పరిశీలన పూర్తయింది.

నెలాఖరుకు యాదాద్రి పవర్ యూనిట్-1 సిద్ధం

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లోని ఐదు యూనిట్లలో 2026 ఫిబ్రవరికల్లా పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయాలని జెన్‌కో నిర్ణయించింది. ప్రస్తుతం 800 మెగావాట్ల యూనిట్-2లో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా.. యూనిట్-1 ఈ నెలాఖరుకల్లా పూర్తికానుంది. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పురోగతి, బొగ్గు తరలింపునకు దక్షిణ మధ్య రైల్వే చేస్తున్న పనులపై జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీష్ అధికారులతో సోమవారం సమీక్షించారు. 4000 మెగావాట్ల ఐదు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి జరగాలంటే రోజూ 50 వేల టన్నుల బొగ్గు అవసరం ఉంటుందని, రైల్వే లైనుకు అవసరమైన పనులన్నీ పూర్తిచేయాల్సి ఉంటుందని గుర్తించారు. ఎప్పుడు ఆ పనులు పూర్తవుతాయని జెన్‌కో ఆరా తీయగా.. డిసెంబరుకల్లా పూర్తిచేస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

కాచిగూడ-యశ్వంత్‌పూర్ వందేభారత్ బోగీల పెంపు

బర్కత్‌పుర, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ-యశ్వంత్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలను పెంచుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు. ఈనెల 10 నుంచి బోగీల పెంపు అమలులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం ఈ రైలు 8 బోగీలతో నడుస్తుండగా.. ఆ సంఖ్యను 16కు పెంచుతున్నట్లు వెల్లడించారు. 14 చైర్‌కార్, 2 ఎగ్జిక్యూటీవ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని, 1128 మంది ప్రయాణించవచ్చని చెప్పారు.

ఐఐటీహెచ్ డైరెక్టర్ మూర్తి పదవీకాలం పెంపు

కంది, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి పదవీకాలాన్ని మరో ఐదేళ్లు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఐఐటీహెచ్ డైరెక్టర్‌గా బీఎస్ మూర్తి 2019 ఆగస్టులో బాధ్యతలు చేపట్టారు. ఐఐటీహెచ్‌లో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేశారు.

క్యామ్‌సైన్ డైరెక్టర్ మధుసూదన్‌కు బెయిల్

అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడటంతో పాటు నిధులు దుర్వినియోగం చేసిన వ్యవహారంలో క్యామ్‌సైన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్(ఏ2)కు హైకోర్టు పలు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. చార్జ్‌షీట్ దాఖలు చేసేంత వరకు ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని సూచించింది.

మధ్యాహ్న భోజనం అందక విద్యార్థుల పస్తులు

బషీరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని మైల్వార్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనం వండకపోవడంతో సుమారు 150 మంది విద్యార్థులు పస్తులుండాల్సి వచ్చింది. మూడు నెలలుగా బిల్లులు రాలేదని, సొంతంగా డబ్బులు పెట్టే స్థోమత తమకు లేదని ఏజెన్సీ నిర్వాహకులు చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు పిల్లలను మధ్యాహ్న భోజనానికి ఇళ్లకు పంపించారు. ఇళ్ల వద్ద కొందరి విద్యార్థుల తల్లిదండ్రులు పనులకు వెళ్లడంతో భోజనం చేయకుండానే పాఠశాలకు వచ్చినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని పాఠశాల హెచ్ఎం తెలిపారు.

ఆస్తులు రాయించుకొని గెంటేశారు

▸▸ మనుమళ్లపై కలెక్టర్‌కు నాన్నమ్మ ఫిర్యాదు



నిజామాబాద్ కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధురాలు వెంకటలక్ష్మి

నిజామాబాద్ అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కన్న కొడుకు రెండేళ్ల క్రితం ఎటో వెళ్లిపోగా, అతని కుమారులు (మనుమళ్లు) తన పేరిట ఉన్న ఆస్తిని రాయించుకొని ఇంట్లో నుంచి బయటకు గెంటివేశారంటూ ఓ నాన్నమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం గాంధీనగర్‌కు చెందిన మేడగం వెంకటలక్ష్మి అనే 80 ఏళ్ల వృద్ధురాలు సోమవారం తన కుమార్తెతో కలిసి వీల్‌చైర్‌లో నిజామాబాద్ కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు అందజేసింది. తన భర్త బాల నాగిరెడ్డి చనిపోయాడని, పెద్ద కుమారుడు రెండేళ్ల క్రితం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని ఆమె చెప్పింది. అతని కుమారులు రమేష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలు తనకు పెన్షన్ ఇప్పిస్తామని చెప్పి.. తనతో సంతకాలు చేయించుకున్నారని తెలిపింది. ఇళ్లు, ఏడు ఎకరాల పొలాన్ని వారి పేరు మీదకు మార్చుకున్నారని, తనను ఇంట్లో నుంచి గెంటేశారని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. బ్యాంకు బుక్కు, ఆధార్‌కార్డు, పాస్‌బుక్కులు బలవంతంగా లాక్కొన్నారని తెలిపింది. అదేంటని అడిగితే పెట్రోల్ పోసి తగలబెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే సివిల్ కేసు అయినందు వల్ల కోర్టులో తేల్చుకోవాలని చెబుతున్నారని పేర్కొంది. ఫిర్యాదును పరిశీలించిన జిల్లా కలెక్టర్.. సీనియర్ సిటిజన్ యాక్ట్ కింద ఆమెకు న్యాయం చేయాలని ఆర్డీవోను ఆదేశించారు.

13 మంది అడిషనల్ ఎస్పీల బదిలీ

హైదరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 13 మంది అడిషనల్ ఎస్పీలు(నాన్ కేడర్) బదిలీ అయ్యారు. ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటిలిజెన్స్, సీఐడీ, ఇతర విభాగాలతోపాటు జిల్లాల్లో పనిచేస్తున్న అడిషనల్ ఎస్పీలు బదిలీ అయిన వారిలో ఉన్నారు.

గాడినపడనున్న వైద్య విద్య!

(మొదటి పేజీ తరువాయి)



ఆర్థికశాఖ ఆమోదం లభించింది. మిగిలిన 520 పోస్టులను మంజూరు చేయాలని వైద్యవిద్య సంచాలకుడు(డీఎంఈ) ప్రభుత్వానికి లేఖ రాసినట్లు సమాచారం. వాటికి కూడా సర్కారు నుంచి వెంటనే గ్రీన్ సిగ్నల్ లభించనున్నట్లు తెలుస్తోంది. మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరతపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా చాలా సీరియస్‌గా ఉన్న విషయం తెలిసిందే.! రిక్రూట్‌మెంట్, పదోన్నతులు వెంటనే చేపట్టాలని ఇటీవల ఆ శాఖ సమీక్ష సందర్భంగా ఆదేశించారు. దాంతో వైద్యశాఖ రంగంలోకి దిగింది. 35 వైద్య కళాశాలల్లో 3,650 అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పోస్టులకు గాను 2,194 ఖాళీలు ఉన్నట్లు లెక్కతేల్చింది. తాజాగా సోమవారం పదోన్నతులు వచ్చాయి. దీంతో.. ఈ ఖాళీలు మరింత పెరుగుతాయి. ఈ ఖాళీలను వెంటనే భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంలో రాతపరీక్ష, ఇంటర్వ్యూలు లేకపోవడంతో.. ఈ ప్రక్రియ త్వరగా ముగుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

44 మందికి పోస్టింగ్స్ నేడు జీవో

ఒకేసారి 44 మంది అదనపు వైద్యవిద్య సంచాలకులను మెడికల్ కాలేజీలకు ప్రిన్సిపాల్స్‌గా, బోధనాస్పత్రులకు సూపరింటెండెంట్‌లుగా ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన జీవో మంగళవారం విడుదల కానుంది. దీంతో రాష్ట్రంలో ఐదుచోట్ల మినహా అన్ని ప్రభుత్వ వైద్య కళశాలలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్స్, అన్ని బోధనాస్పత్రులకు రెగ్యులర్ సూపరింటెండెంట్స్‌ను భర్తీ చేసినట్లు అవుతుంది. రాష్ట్రంలో 35(కొడంగల్‌తో కలిపి) ప్రభుత్వ వైద్య కళశాలలు, వాటి అనుబంధ ఆస్పత్రులున్నాయి. ఉస్మానియా కాలేజీ, ఉస్మానియా ఆస్పత్రి, వరంగల్ ఎంజీఎంలను మినహాయిస్తే.. మిగతా కాలేజీలకు 69 అదనపు డీఎంఈ పోస్టులు అవసరం. గత సర్కారు హయాంలో 17 అదనపు డీఎంఈ పోస్టులను మంజూరు చేయగా.. వారిలో ఇద్దరు పదవీవిరమణ పొందారు. దాంతో.. 15 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగతా 54 పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే.. 44 మందికి మాత్రమే అదనపు డీఎంఈలుగా అర్హతల లభించింది. దాంతో.. వారందరినీ ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్, ఆస్పత్రులకు సూపరింటెండెంట్స్‌గా నియమించింది.

డీహెచ్ నుంచి మరో 300 మంది

ప్రజారోగ్య సంచాలకుల విభాగం(డీహెచ్) నుంచి ఇన్-సర్వీస్ కోటాలో పీజీ పూర్తిచేసిన సుమారు 300 మంది స్పెషలిస్టు వైద్యులున్నారు. వారంతా వైద్యవిద్య సంచాలకుల పరిధిలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. సోమవారం వీరంతా వైద్య మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి.. డీఎంఈ విభాగానికి వచ్చేందుకు సమ్మతిని తెలిపారు. నిబంధనల ప్రకారం అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల్లో 60% డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, 40% డీహెచ్, తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలోని స్పెషలిస్టు వైద్యులను చేర్చుకోవాలి. ఇప్పటికే టీవీవీపీ నుంచి సుమారు 60-70 మంది స్పెషాలిటీ వైద్యులు డీఎంఈకు రాగా.. త్వరలో డీహెచ్ పరిధిలో పనిజేస్తున్న 300 మంది స్పెషలిస్టులను కూడా తీసుకురానున్నారు. వీరిని అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌గా నియమిస్తారు. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో దాదాపుగా ఖాళీలు అన్నీ భర్తీ అవుతాయి.

భారీగా పదోన్నతులు

అధ్యాపకుల కొరతను అధిగమించేందుకు సర్కారు నియామకాల ప్రక్రియతోపాటు.. ఏకకాలంలో పదోన్నతులను చేపట్టింది. ముందెన్నడూ లేని విధంగా.. 44 మంది ప్రొఫెసర్లకు అదనపు డీఎంఈలుగా పదోన్నతికి కల్పించింది. అలాగే అర్హత కలిగిన 349 మంది అసోసియేట్ ప్రొఫెసర్స్‌కు ప్రొఫెసర్స్‌గా, మరో 231 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌కు అసోసియేట్ ప్రొఫెసర్స్‌గా పదోన్నతి ఇచ్చింది. ప్రొఫెసర్స్ పోస్టింగ్స్ జీవో కూడా వారంలోపే రానున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. అనంతరం అసోసియేట్ ప్రొఫెసర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి, పోస్టింగులిస్తారు.

అధ్యాపకుల కొరతను అధిగమిస్తాం

వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకుంది. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ఏకకాలంలో పదోన్నతులు, డైరెక్టు రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఖాళీ గా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేస్తున్నాం. ఇప్పటికే టీవీవీపీ నుంచి స్పెషలిస్టు వైద్యులను అబ్జార్బ్ చేసుకున్నాం. నిబంధనల మేరకు డీహెచ్ నుంచి కూడా ఆ ప్రక్రియను చేపడతాం.

\- డాక్టర్ నరేంద్రకుమార్, వైద్య విద్య సంచాలకుడు

సీఎం క్వాష్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

▸▸ రేవంత్‌పై ప్రైవేటు కేసు పెట్టిన బీజేపీ నేత

హైదరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు చేసిన ప్రైవేటు ఫిర్యాదు ఆధారంగా తనపై నమోదైన కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టు తీర్పు వాయిదా వేసింది. 2024 ఎన్నికల సందర్భంగా కొత్తగూడెంలో నిర్వహించిన జనజాతర సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఎత్తివేస్తారని తప్పుడు ఆరోపణలు చేశారని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. దీనిపై అమిత్‌షా మాట్లాడుతున్నట్లుగా ఉన్న ఫేక్ వీడియోను వైరల్ చేశారని తెలిపారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో విచారణ జరుగుతోంది. ఆ కేసును కొట్టేయాలని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ కే.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ కొనసాగించింది. రేవంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదిస్తూ.. ఎన్నికల సందర్భంగా చేసే రాజకీయ ప్రసంగాలపై కేసులు పెట్టడం సరికాదన్నారు. బీజేపీ తరఫున సీనియర్ న్యాయవాది విజయ్ కుమార్ వాదిస్తూ.. బీజేపీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా రేవంత్ అసత్య ప్రచారం చేశారని పేర్కొన్నారు. రేవంత్‌పై దిగువ కోర్టులో విచారణ కొనసాగనివ్వాలని కోరారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. తీర్పు రిజర్వు చేసింది.

హైదర్‌గూడలో ప్రభుత్వ భూమి కబ్జాపై నోటీసులు

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం ఉప్పర్‌పల్లి హైదర్‌గూడ సర్వే నెంబర్ 7లో రెండెకరాల ప్రభుత్వ భూమి కబ్జా ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని రంగారెడ్డి కలెక్టర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించినట్లు పిటిషనర్ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. అదే సర్వే నెంబర్‌లోని మరో 1200 గజాల స్థలాన్ని దొంగ పత్రాలతో స్వాధీనం చేసుకుని ప్రహరీ నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం సంబంధిత అధికారులకు నోటీసులు జారీచేసింది.

చదువుకుంటూ... ఉద్యోగం చేయొచ్చు!

▸▸ ప్రతి నెలా రూ..7వేల-24 వేల స్టైపెండ్

▸▸ అంబేడ్కర్ వర్సిటీలో సరికొత్త ప్రోగ్రాం

▸▸ అంబేడ్కర్ వర్సిటీ, రాసి మధ్య ఎంవోయూ

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చదువుకుంటూనే ఉద్యోగం చేస్తూ ప్రతి నెలా జీతం(స్టైపెండ్) పొందేందుకు వీలు కల్పించే ప్రత్యేక ప్రోగ్రామ్‌ను అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమేరకు హైదరాబాద్‌లోని వర్సిటీ క్యాంపస్‌లో సోమవారం రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(రాసి), అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదిరింది. దీనిపై వర్సిటీ రిజిస్ట్రార్ డా.ఎల్వీకే రెడ్డి, రాసి ఎగ్జిక్యూటివ్ హెడ్ జేమ్స్ రాఫెల్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. రాసితో ఎంవోయూ కుదుర్చుకున్న మొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయం తమదేనన్నారు. చదువుతోపాటు విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు ఈ ఎంవోయూ దోహదపడుతుందని చెప్పారు. స్టైపెండ్ ఆధారిత విద్య (స్టైపెండ్ బేస్డ్ అప్రెంటిస్‌షిప్ ప్రోగ్రాం-ఎస్ఏపీ)ను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. త్వరలో వర్సిటీ వెబ్ పోర్టల్‌లో పూర్తి వివరాలు తెలియజేస్తామని, రాసితో కలిసి ఉమ్మడి ప్రవేశ నోటిఫికేషన్ ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి చదువుతోపాటు ఉద్యోగ అవకాశం కల్పించడం, ఉత్సాహవంతులను వ్యాపారవేత్తలుగా మలచడమే తమ లక్ష్యమన్నారు. ఈ ప్రోగ్రాంలో చేరడం ద్వారా నెలకు కనీసంగా రూ.7 వేలు, గరిష్ఠంగా రూ.24 వేలకు మించి సంపాదించుకునే అవకాశాలు ఉంటాయన్నారు. తమ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులూ అర్హులేనని, ఈ ప్రోగ్రాంలో చేరేందుకు 18-28 ఏళ్ల వయసు వారు అర్హులని తెలిపారు. జేమ్స్ రాఫెల్ మాట్లాడుతూ ఉద్యోగానికి సిద్ధంగా ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి వారు చదువుతున్నప్పుడే ఆర్థికంగా సాయపడేలా స్టైపెండ్ అందించనున్నట్లు తెలిపారు.

కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యంపై.. ఉత్తమ్ పవర్ ప్రజెంటేషన్ రేపు

హైదరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కుంగిపోయిన మేడిగడ్డ.. సీపేజీ వస్తున్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై ప్రజాభవన్‌లో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. బుధవారం మధ్యాహ్నం 3గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. 'కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యం-తుమ్మిడిహెట్టి పునరుద్ధరణ' అంశంపై ఈ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలిసింది.

కాళేశ్వరంలో లేనివాళ్లకు పదోన్నతులు

కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేని వారందరికీ పదోన్నతులు కల్పించాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉత్తమ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణ వైఫల్యాలకు కారకులైన వారికి విజిలెన్స్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా షోకాజ్ నోటీసులు అందించిన విషయం విదితమే. ఆ నోటీసులు అందుకున్నవారు తప్ప.. అర్హత కలిగిన వారందరికీ పదోన్నతులు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

అనధికారిక నిర్మాణాలన్నీ కూల్చాల్సిందే!

'నెట్ నెట్' భవనంపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు సబబే

▸▸ జీహెచ్ఎంసీ ఉత్తర్వుల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలి

▸▸ సిటీ స్మాల్ కాజెస్ కోర్టు తీర్పు



నందగిరి హిల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నందగిరి హిల్స్‌లో నెట్ నెట్ వెంచర్స్ సంస్థ నిర్మిస్తున్న ఆకాశ హర్మ్యంలో తీవ్ర ఉల్లంఘనలు జరిగాయని, అనధికారిక కట్టడాలను కూల్చివేయాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను సిటీ స్మాల్ కాజెస్ కోర్టు సమర్థించింది. జీహెచ్ఎంసీ ఇచ్చిన ప్రణాళికకు భిన్నంగా భవన నిర్మాణం చేపట్టారంది. అనధికారిక నిర్మాణాలన్నింటినీ సరిచేయాల్సిందేనని కోర్టు స్పష్టం చేసింది. పర్యావరణ సమతుల్యతకు భంగం వాటిల్లేలా నిర్మాణాలు చేపట్టడంతోపాటు అనుమతించిన ప్లాన్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టారంటూ ఈ ఏడాది జనవరి 24న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. ఇదే విషయంపై జనవరి 25న 'నెట్ నెట్ భవనాన్ని కూల్చాల్సిందే' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. అయితే, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలను సవాలు చేస్తూ నెట్ నెట్ సంస్థ సిటీ స్మాల్ కాజెస్ కోర్టును ఆశ్రయించింది. కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని, నిర్మాణ పనుల్లో జోక్యం చేసుకోకుండా చూడాలని కోరింది. నెట్ నెట్ వెంచర్స్ ఉల్లంఘనలపై జీహెచ్ఎంసీ తన వాదనలను వినిపించింది. ఇచ్చిన ప్రణాళిక ప్రకారం నిర్మాణం చేపట్టలేదని, సెట్ బ్యాక్ నిబంధనలు ఉల్లంఘించారని, ర్యాంప్, డ్రైవ్ వేలను సెట్ బ్యాక్ నిర్మించాల్సిన ప్రాంతంలో కట్టారని కోర్టుకు తెలిపింది. రాత్రివేళ అనధికారిక నిర్మాణాలు చేపట్టారని, భవన అంతస్తుల ఎత్తు అనుమతించినదాని కంటే ఎక్కువగా ఉందని వివరించింది. తాము ప్రణాళిక ప్రకారమే నిర్మాణం చేశామని నెట్ నెట్ వెంచర్ కోర్టుకు వివరించింది. అనధికారిక నిర్మాణాలు తొలగించామని, ఇంకా ఉల్లంఘన ఉంటే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చే సమయంలో సరిచేసుకోవచ్చని వాదించింది. అనధికారిక నిర్మాణాలు తొలగించినట్లు ఆధారాలు చూపాలని కోర్టు ఆదేశించగా.. సమాచారం ఇవ్వలేదు. జీహెచ్ఎంసీ ఇచ్చిన ఆదేశాలను, విజిలెన్స్ నివేదికను, భవన చిత్రాలను పరిశీలించిన కోర్టు.. అనధికారిక నిర్మాణాలు, నిబంధనల ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొంది. జీహెచ్ఎంసీ ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని తీర్పు ఇచ్చింది. అనధికారిక నిర్మాణాలను కూల్చివేసే వరకు తదుపరి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశించింది.

ఇదీ నేపథ్యం..

నందగిరి హిల్స్‌లో హెచ్ఎండీఏ నుంచి హుడా వేలంలో అమరేందర్‌రెడ్డికి చెందిన నెట్ నెట్ వెంచర్స్ సంస్థ 4.748ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఈ స్థలంలో 12 అంతస్తుల(జీ+4, 7 సెల్లార్లు) భవన నిర్మాణం చేపట్టేందుకు 2013లో జీహెచ్ఎంసీ అనుమతి పొందింది. 2015లో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లో జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో 865.42 గజాల భూమిని కొనుగోలు చేసింది. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీకి సంబంధించి కొంత వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం 2017లో జీవో 305 ఇచ్చింది. దాని ప్రకారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాల్లో 30 మీటర్ల వరకు నిర్మాణాలు చేసుకోవచ్చు. కానీ, దాని వెనకే ఉన్న హుడా లేఔట్‌కు ఈ నిబంధనలు వర్తించవు. హౌసింగ్ సొసైటీకి ఇచ్చిన వెసులుబాటును అడ్డుపెట్టుకున్న నెట్ నెట్ వెంచర్స్ 30 మీటర్ల నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు సాధించింది. అక్కడితో ఆగక జీ+4 నుంచి జీ+5, తర్వాత జీ+12, చివరకు జీ+13 వరకు అనుమతులు పొందింది. 2,09,620 చదరపు అడుగుల్లో నిర్మాణం చేసుకునేలా అనుమతి పొందింది. నందగిరి హౌసింగ్ సొసైటీ సభ్యులు ఈ నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.



డోల్లార ప్రాథమిక పాఠశాల

చదువుకు సెలవు.. పశువులకు నెలవు

బడి అంటే చదువుల నిలయం. విద్యకు ఆలయం. విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయం. అటువంటి చోటు పాఠాలకు బదులు.. పశువులకు నెలవుగా మారితే.. బడి బాట పట్టాల్సిన చిన్నారులు.. జీవాలను కాస్తూ అక్షరాలకు దూరమైతే.. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం డోల్లార గ్రామంలో ఇదే దుస్థితి నెలకొంది. ఇక్కడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పశువుల కొట్టంగా మారింది. జీవాలకు పచ్చి గడ్డి వేస్తూ.. అవి ఎండా వానకు ఇబ్బంది పడకుండా బడిలో కట్టేస్తున్నారు. దాదాపు పదేళ్లుగా ఈ బడి మూసే ఉంది. ఈ పాఠశాలకు వచ్చేందుకు ఉపాధ్యాయలు ఆసక్తి చూపడం లేదు. దీంతో గ్రామానికి చెందిన సుమారు 35 మంది చిన్నారులు విద్యకు దూరమతున్నారు. బడికి వెళ్లాల్సిన పిల్లలు.. సద్ది చేత పట్టుకుని పశువుల కాపలాకు వెళుతున్నారు. (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)

ఇచ్చుకుంటూపోతే భవిష్యత్తులో ప్రభుత్వ భూమన్నదే ఉండదు

▸▸ హైకోర్టు వ్యాఖ్య

హైదరాబాద్, జులై 7 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో లక్షలాది ఎకరాల భూమి ఉండేదని, ఇచ్చుకుంటూ పోతే ప్రభుత్వ భూమి అన్నదే మాయమవుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. భవిష్యత్తులో ప్రభుత్వం ఆధ్వర్యంలో మరుగుదొడ్డి నిర్మించాలన్నా స్థలం దొరకని పరిస్థితి రానుందని వ్యాఖ్యానించింది. భవిష్యత్తు అవసరాల గురించి ఆలోచన లేకుండా ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కేటాయించడం, ఇప్పటికే ఆక్రమణలకు గురైన భూములను క్రమబద్ధీకరించడం వల్ల మున్ముందు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంది. వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం అంతరం గ్రామ పరిధిలో హేచరీ నిర్మాణం కోసం 6 ఎకరాలు కేటాయించాలని వినతి పత్రం సమర్పించినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడాన్ని సవాల్ చేస్తూ ఓ వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. హేచరీతో ప్రజలకు ఏం లాభం అని, మీ సొంత వ్యాపారాల కోసం ఏ ప్రాతిపాదికన భూమి అడుగుతున్నారని పిటిషనర్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగానే ఇచ్చుకుంటూ పోతే భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాలకు స్థలం ఉండదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వివరణ కోసం విచారణను ఈనెల 22కు వాయిదా వేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.